దేశంలో అత్యధికంగా చదవబడుతున్న తెలుగు మాసపత్రిక

జ్యోతి

05 - 1980

మే '80

రూ. 3/-



జ్యోతి నవలల
పోటీలో రెండవ
బహుమతి పొందిన నవల
"ఆకాశానికి
ఆటూ ఇటూ"
రచన: శివాజీ



సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

మే 1980

సంపుటి 18 — సంచిక 4

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

నవలల పోటీలో రెండవ బహుమతి పొందిన నవల


ఆకాశానికి అటూ ఇటూ

రచన : శివాజీ

ముఖచిత్రం : 'ఆటగాడు'లో ఎన్. టి. రామారావు

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123

సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు



ఉత్తరాలు

తెలుగులో తొలి సైన్సు నవల యుగాంతం!

అమ్లా స్టేషనులో యాధృచ్ఛికంగా జ్యోతి కొనడం జరిగింది. అందులో "యుగాంతం" సీరియల్ ప్రారంభం చదివేక సంవత్సర చందా పంపకుండా ఉండలేకపోయాను.

తెలుగు సాహిత్యంలో 'సైన్స్‌ఫిక్షన్' చాలా అరుదు (అనువాదాలు మినహాయిస్తే). నాకు తెల్సినంతవరకు తొలి తెలుగు సైన్సు ఫిక్షన్ నవలగా "యుగాంతం" ఓ ప్రత్యేకతను సంతరించుకొంటుందనుకొంటాను. ఈ నవల సాంతం ఇలాగే ఉత్తేజకరంగా సాగుతుందన్న నమ్మకం కలుగుతోంది. కథా సంవిధానం కూడా విలక్షణంగా ఓ "ఆర్థర్ హైలీ" నవల చదువుతున్నామా అనిపించేలా ఆసక్తికరంగా సాగుతోంది. అయితే కొన్నిచోట్ల అసంతృప్తి కలిగిన మాట వాస్తవం!

నవల ప్రారంభంలోనూ తదనంతరం చాలా సందర్భాల్లోనూ **Proxima centauri**ని ప్రోక్సిమా శాంక్చువరీగా తెనిగించారు. ఇది అంత సబబుగా లేదు. **Alpha centauri, Beta centauri**లతోబాటు ఇది కూడా దక్షిణార్ధ గోళానికి సంబంధించిన నక్షత్రం అయివుండగా, రమణ దీన్ని ఉత్తర దిశలో చూసినట్టు చెప్పడం (జ్యోతి, మార్చి సంచిక) అంత ఉచితంగా లేదు. అలాగే ఆ నక్షత్రం "తొందర తొందరగా వచ్చి వెళ్ళిపోడానికి" ఇచ్చిన 'థియరీ' కూడా అంత సమర్థనీయంగా లేదు. (భూమికి దగ్గరగా వున్న గ్రహాలూ, చంద్రుడూ కూడా తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమించడానికి దాదాపు 12 గంటల కాలం పడుతుంది!)

ఈ తప్పులు కూడా లేకుంటే యింకా బాగుండుననే కాని, ఈ నవలని ఎన్‌జాయ్ చెయ్యడానికి యివి అవరోధాలు ఎంత మాత్రం కావు.

దాస్‌బాబుగారి "అల్లావుద్దీన్ అభినవదీపం" చాలా బాగుంది.

—విజయ్‌శేషేంద్ర శాతకర్ణి,
నందన్ ప్రోజెక్ట్, దమువా (మధ్యప్రదేశ్)

బుచ్చిబాబు ముఖ చిత్రంతో వెలువడిన ఏప్రిల్ "జ్యోతి"లో "తీరని కోరిక", "మళ్ళీ ఎప్పుడో! ఎక్కడో?", "చలి" కథలు చాలా బాగున్నాయి. మంచి-కథలు ఎన్నుకొని, శ్రద్ధ వహిస్తున్నందుకు అభినందనలు.

—ఏ. శ్రీనివాస్, ఏలూరు.

'జ్యోతి' ఏప్రిల్ సంచికలో 'తొలిమాట' చదివాక ఇప్పుడిప్పుడే తడారుతున్న కళ్లు మళ్ళీ చెమర్చాయి. మా పెరట్లో మామిడిచెట్టుమీద 'కోయిల'లో 'కృష్ణశాస్త్రి'ని సాక్షాత్కరింప చేసింది మీ సంపాదకీయం. ఇందుకు మీరు అభినందనీయులు. ఈ నెల ప్రచురించిన కథలలో ఈశ్వర్‌గారి 'బోను' వెరైటీగా వుంది. నేటి పత్రికల తీరుతెన్నులను సద్విమర్శించిన ఈ కథను ప్రచురించటంతో 'జ్యోతి' మరో మెట్టు పైకెక్కగలిగింది.

—పక్కలంక రామారావు, మానేపల్లి.



మార్చి 16వ తేదీ విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ క్రోక్విల్ క్లబ్ ద్వితీయ వార్షికోత్సవసభలో క్లబ్ ఉపాధ్యక్షుడు ప్రముఖ కార్టూనిస్టు జయదేవ్‌బాబు నివేదిక సమర్పిస్తున్న దృశ్యం. చిత్రంలో శ్రీయుతులు రాఘవాచారి, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, నండూరి రామమోహనరావు, వీరాజీ, కూడా వున్నారు.

బహుమతి నవల బాగుంది

"జ్యోతి" ఏప్రిల్ సంచిక చాలా బాగుంది. కృష్ణశాస్త్రిగారిమీద శ్రీశ్రీగారి వ్యాసం చాలా నచ్చింది. "ప్రేమ సింహాసనం" ఎంతో ఆసక్తికరంగా సాగుతోంది. కంతంనేని రాధాకృష్ణమూర్తిగారి మొదటి బహుమతి పొందిన నవల "మానవుడు" చాలా బావుంది. ధనుంజయ, సరళ పాత్రలను చిత్రించిన తీరు ప్రశంసనీయం.

ప్రవాసాంధ్ర సాహితీ అభిమానులు
జి. మీనా, జి. రజనీప్రియ,
భువనేశ్వర్, ఒరిస్సా.

శ్రీశ్రీ ప్రహేళిక గురించి

'అన్యాయం'-అన్నది పెద్దమాటే అయినా ఏప్రిల్ సంచికలోని ఎన్. కె. రామారావు (నల్లగొండ) గారి అభిప్రాయంతో నేనేకీభవిస్తున్నాను. వెనకటి రోజుల్లో ప్రహేళిక ఎంతో వినోదంగా వుండేది. రాను రాను కేవలం నిఘంటువుతో కుస్తీ పట్టాల్సిన Exerciseగా తయారైపోయింది. రామారావుగారు నిఘంటువులో చూడలేదేమో ననిపిస్తుంది. 'ఐదు పది చేయడం' ఏ మంచి నిఘంటువులోనైనా దొరికేదే. 'బాస' అనేది కేవలం By productగా వచ్చిందేగాని "బకాసురుడి తీరు"కు ఎలాంటి సంబంధముందో శ్రీశ్రీగారే వివరించాలి. గతంలో 'నీడ'కు "మొదట ముందు పిదప వెనక" అన్న ఆధారం అసమంజసం. మనం సూర్యున కభిముఖులమై వున్నామా? లేదా? అనేదాన్నిబట్టి నీడ మారుతుంది కాని మొదట పిదప అన్న మాటలు అర్ధరహితం. ఇలాగే గతంలో "అసమగ్ర ఆంధ్ర సాహిత్యంలో ఆక్రద దూడ"కు 'కోతి' అనో 'దస్తగిరి' అనో సమాధానమిచ్చారు. ఎలా?

—తోట చంద్రశేఖరరెడ్డి, కడప.



ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు బాలబాలికలకు జాతీయ బహుమతిని జనవరి 24, 1980న ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీనుంచి అందుకొంటున్న తెలుగు బాల కుమారి సంధ్య.

శ్రీశ్రీ సమాధానం

(గత సంచికలోని లేఖకి)

వీని బాసవేరు అని తెలుగులో మొదటిసారి నన్నయ్యభట్టుగారు పేర్కొన్నారు, (బకాసురుణ్ని గురించి). ఆహవంబున అయిదు పది సేయుడు అనేది తెలుగు నానుడి. అయిదు పది చేయడమంటే రెండు చేతులూ జోడించి నమస్కరించడం. ఈ రెండు కూడా దూరం నుంచి తెచ్చినవి కావు. మన పెరటి పంటలే. పోతే, 'వేరు' అనడానికి బదులు 'శిరు' అని అచ్చు తప్పు దొర్లింది. ఈ చిన్న అన్యాయానికి మాత్రం నేను పెద్దగానే చింతిస్తున్నాను.

—శ్రీశ్రీ, మద్రాసు.

ధైర్యే సాహసే సంధ్యా!

ఫిబ్రవరి 18, 1979. ముస్సోరీ దాన్నా దగ్గర గంగ కాలువ గట్టుమీది తోటలో వన భోజనాలకు యేర్పాట్లు జరుగుతున్నాయి. మోడీ రబ్బర్ లిమిటెడ్‌లో పని చేస్తున్న అధికారుల బృంద మొకటి విహారయాత్రగా వచ్చింది. పెద్దలు భోజన యేర్పాట్లలో వుండగా పిల్లలు సుందరమైన గంగానది కాలువ తీరంకేసి వెళ్ళి ఆడుకొంటున్నారు. అందరూ ఆదమరచి కేరింతలు కొడుతున్నప్పుడు, అకస్మాత్తుగా మూడేళ్ళ బాబు కిశోర్ కాలు జారి కాలువలో పడిపోయాడు. పిల్లలందరూ భయంతో నోట మాట రాక చూస్తూ నిలబడిపోయారు. క్షణం ఆలస్యమైతే ముక్కుపచ్చలారని ఆ మూడేళ్ళ పిల్లవాడికి అప్పుడే నూరేళ్ళు నిండుతాయి. ఏడు సంవత్సరాలు యింకా నిండీ నిండని సంధ్య ముందూ వెనకా ఆలోచించకుండా నీళ్ళలోకి దూకింది. కిశోర్‌ని గట్టుమీదికి నెట్టింది. పెద్దగా అరిచి దూరంగా వున్న పెద్ద వాళ్ళని పిలిచింది. బాలుడి ప్రాణాలు ఆ విధంగా నిలిచాయి. ధైర్యే సాహసే సంధ్యా! 1979 సంవత్సరానికి భారత శిశు సంక్షేమ మండలివారి జాతీయస్థాయి 'ధైర్య సాహసాల బహుమతి' అందుకొన్న పధ్నాలుగుమందిలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన బాలిక ఒక్క సంధ్య మాత్రమే. □

ఇప్పుడు మీరు అతని పళ్లను
పిప్పిపళ్లు కాకుండా చెయ్యవచ్చును.



వాడండి సిగ్నల్ 2

పళ్లను గట్టిపరచి దంత క్షయాన్ని నివారించేందుకు
దీనిలో అత్యంత ప్రభావంగల ఫ్లోరైడ్ ఫార్ములా ఉంది.

హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-SG2. 1A-1710 TL

పంటినొప్పివల్ల కలిగేది కేవలం బాధ మాత్రమే కాదు. దంతక్షయా అది సంకేతం కూడా. అశ్రద్ధ చేస్తే దంతక్షయం మరింతగా పెరిగి పిప్పి పళ్ళు అయిపోతాయి.



నోటిలో ఊరే ఆమ్లాలు పళ్లలోకి చొచ్చుకుపోయి దంతక్షయాన్ని కలిగించకుండా మామూలు టూత్ పేస్టులు ఆపలేవు.



సిగ్నల్ 2లో అత్యంత ప్రభావంగల ఫ్లోరైడ్ ఫార్ములా ఉంది. ఇది నోటిలోని ఆమ్లాలు పళ్లలోకి చొచ్చుకుపోయి దంతక్షయం కలిగించకుండా అరికడుతుంది.

పిప్పి పళ్ళను నిరోధించే టూత్ పేస్ట్

పరిస్థితి విషమించక ముందే మీ కుటుంబంలో వారంతా వాడండి సిగ్నల్ 2—దంతక్షయాన్ని నిరోధించడంలో నిరూపించబడిన టూత్ పేస్ట్. దీనిలోని ప్రత్యేకమైన ఫ్లోరైడ్ ఫార్ములా పళ్ళతో కలిసి వాటిని గట్టిపరుస్తుంది, పళ్ళకు హాని కలిగించే నోటి ఆమ్లాలను నిరోధించేందుకు మరింత శక్తినిస్తుంది—పిప్పి పళ్ళు కాకుండా కాపాడుతుంది. దంతక్షయాన్ని అరికట్టడంలో దీనికి మించిన టూత్ పేస్ట్ లేదు. మేం చెప్పిందే మీరు నమ్మక్కర్లేదు. మీ దంత వైద్యుని కూడా అడగండి.



సిగ్నల్ 2

కుటుంబంలో వారికి పిప్పి పళ్ళు రాకుండా నిరోధిస్తుంది.



లింటాస్-SG2. 1B-1710 TL

తొలిమాట

మా పాఠకులకొక శుభవార్త. ప్రఖ్యాత రచయిత్రి బీనాదేవి క్రితంలో జ్యోతిలో ధారావాహికంగా రాస్తూ అనివార్య కారణాల వలన నిలిపివేసిన 'భూమి గుండ్రంగావుంది' నవలను తిరిగి ప్రారంభించబోతున్నారు. తనదైన శైలితో పాఠకలోకాన్ని ఉర్రూతలూపగల బీనాదేవిగారి సీరియల్ నవలను త్వరలోనే ప్రారంభిస్తాము.

* * *

మన పత్రికలలో పుస్తకసమీక్షలు మొక్కుబడి తీర్చుకున్నట్టుంటాయనే విమర్శ ఒకటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే మేము 'కొత్త పుస్తకంతో కొంతసేపు' శీర్షిక ప్రారంభించాము. మాకున్న పరిధిలో వీలైనంత విపులంగా, ఆలోచనాత్మకమైన సమీక్షలను ప్రచురించాలనే మా ప్రయత్నం. ఈ శీర్షికలో ఈ నెల శ్రీశ్రీగారి కథల సమీక్ష ప్రచురించాము.

* * *

విద్యార్థుల కథలపోటీకి వస్తున్న కథలు మమ్మల్ని నిరుత్సాహపరుస్తున్నాయనే చెప్పాలి. విద్యార్థి రచయితలు ఈ విషయాన్ని గమనించగలరని ఆశిస్తున్నాము.




కాకినాడ సన్మానసభా వేదికమీద శ్రీశ్రీ ఫోటో: స్మైల్

శ్రీశ్రీకి జ్యోతి పాఠకుల నిధి సమర్పణ


మహాకవి శ్రీశ్రీకి డెబ్బయ్యేళ్ళు నిండిన సందర్భంగా ఆయనకు కాకినాడలో మార్చి 2న ఘనంగా జరిగిన ఒక సన్మాన సభలో జ్యోతి, శ్రీశ్రీ అభిమానులైన తన పాఠకులనుంచి సేకరించిన నిధికి 'ఉడతా భక్తిగా' మరొక వెయ్యిన్నూట పదహార్లు చేర్చి శ్రీశ్రీకి సమర్పించింది.

శ్రీశ్రీకి జ్యోతి బహూకరించిన మొత్తం రెండువేల ఆరువందల యాభై రూపాయలు. ఈ నిధి సేకరణలో తన పిలుపునందుకొని సహకరించిన పాఠకులకు జ్యోతి కృతజ్ఞతలు తెలియజేస్తోంది. శ్రీశ్రీ ఫోటోల కోసం డబ్బు పంపినవారికి, వారు కోరిన ఫోటోలు శ్రీశ్రీ సంతకాలతో పంపించాము. ఈ సత్కార్యంలో మాతో సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, మహాకవి శ్రీశ్రీ మరో డెబ్బయ్యేళ్ళు జీవించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలని కోరుకొంటున్నాము.

వేము సైతం రెండు శ్రీలకు కానుకొక్కటి సమర్పించాము!



విజయలక్ష్మీ ఆర్ట్ పిక్చర్స్
ఘరానా దొంగ
నిర్మాత: టి. త్రివిక్రమరావు B.A.,(HONS) దర్శకత్వం: కె. రాఘవేంద్రరావు B.A.
లక్ష్మీ ఫిలింస్



జీవం ఉట్టిపడేలాగ మురియండి
Liril
అపూర్వమైనది లిరిల్. పచ్చని తరంగరేఖలు.
నిమ్మకాయల్లోని తాజాదనపు ఉత్సాహంతో.
చురుకైన, పులకరింపజేసే లిరిల్ మిమ్మల్ని
నవనారిగా రూపొందిస్తుంది.
లిరిల్
తాజాదనపు సబ్బు
నిమ్మకాయిల తాజాదనపు ఉత్సాహంతో
హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి
లింటాస్-LR. 27-1710 TL

అందమైన ప్రశ్న


ఎగురుతూంటే గగనంలో పతంగం
పిల్లల మనస్సు ఎగసే హిమ శిఖరం.
కదలుతూంటే రోదసిలో పతంగం
పిల్లల మనస్సు సరించే ప్రవాహం.
ఏ గాలి విసరుకో ఊగి తెగి
ఏ చెట్టు కొమ్మకో చిక్కుకొనీ
ఏ స్తంభం తీగకో తట్టుకొనీ
గుండెను చుట్టుకునేను ఆ క్షణం.
ఒదిగి ఒదిగి పోతూంటే పతంగం
లోయలో పడుతూన్నట్లు ఉంటుంది.
క్రింద పడిపోతూంటే పతంగం
సుడిగాలిలో తిరుగుతూన్నట్లు ఉంటుంది.
క్షణాల వ్రేళ్ళ సందున కదలుతూ
ఊహల గాలి అంచున తేలుతూ
ఇది మన ఉన్నతికీ అవనతికీ
సంకేతమై—జీవిత పథంలో.
ఉన్నంత కాలం గగనాన
కదలుతుంది ఎదలో ప్రభయై
ఆ పై క్షణంలో దిగిపోయి
తరలేను స్మృతిలో నీడయై.
జవాబు కోసం ఎదురు చూస్తూ
నిష్క్రమించే బ్రతుకు బాటతో,
వస్తూపోయే కాలం వేసే
అందమైన ప్రశ్న— పతంగం.

మాదిరాజు రంగారావు

కథలు కానివి...కానీ విలువైనవి!

చరమ రాత్రి
శ్రీశ్రీ కథలు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : : విజయవాడ-4.

తెలుగు ప్రచురణ సంస్థల్లో ఒక పెద్ద సంస్థ విశాలాంధ్ర ప్రచురణాలయం. తెలుగు రచయితల్లో (కవులతో సహా) అతి "పెద్దవాళ్ళల్లో" శ్రీశ్రీ ఒకరు. ఆయన అడపా దడపా రాసిన కథలూ, కథల్లాంటి స్వగతాలూ "చరమ రాత్రి"గా ప్రచురించి మంచి పని చేసిన విశాలాంధ్ర ప్రచురణాలయంవారు కొన్ని ప్రాథమికమైన ప్రచురణ వివరాలను తెలియజేయ లేదు. ఉదాహరణకు "చరమ రాత్రి" లోని మొదటి 18 కథలూ ఎప్పుడో (19 7.58 అనుకుంటాను) విశాఖపట్నం గుప్తా బ్రదర్స్‌వారు ప్రచురించారు. మళ్ళీ శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా ఆయన రచనలన్నీ సంపుటాలుగా



వెలువరించినప్పుడు తిరిగి "చరమరాత్రి-18" అచ్చైంది. కొన్ని "ఆనందవాణి" లోనూ, మిగతావి "సమీక్ష" లాంటి పత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి. ఆ యా రచనల (రచనా లేదా ముద్రణా) కాలం ఇవ్వడం మంచి ప్రచురణ కర్త చేసే పని. "తారీఖులు, దస్తావేజులు... ఇవి కాదోయ్ చరిత్ర సారం?" అని శ్రీశ్రీ మాటల్నే మనకు గురిపెడితే... నమ్రతగా తల వంచడం కంటె చేసేది లేదు. ఏమైనా పుస్తక ప్రచరణ ముందుగా వ్యాపారం... ఆ తర్వాతనే....సాహిత్య సేవ. అందుకనే శ్రీశ్రీ రేఖాచిత్రాన్ని-మాత్రమే పరిచయంగా ఉద్దేశించి Without Comments అంటారే....అలా నిరలంకారంగా....నిర్వ్యాఖ్యగా (ఇలాంటి మాట ఉందా?)....కథలు వరుసగా అచ్చు గుద్దేరు. అన్నట్టు 89 వ పేజీలో ఉన్న "సీతయ్య" సమాచారం విషయ సూచికలో లేదు.

రచనలకు తారీఖు లవసరం వుంది. వస్తురూపేణా, శిల్ప రూపేణా రచయిత పరిణామానికి తారీఖులు ఒక రకమైన సూచికలు. అసలు శ్రీశ్రీ లాంటి ప్రముఖుడి రచనలు వివరణాత్మకంగా ప్రచురించితే ఇంకా మంచిది....అదెప్పటికి సాధ్యమౌతుందో!

ఇక కథల్లోకి వద్దాం. ఇవన్నీ కథలు కావు. కొన్ని కబుర్లు....కొన్ని పదచిత్రాలు....కొన్ని ఆలోచనలు...అన్నింటిలోకీ ఆలోచన రేకెత్తించే రచన ఈ పుస్తకానికి మకుటమైన "చరమ రాత్రి"....ఇది కథ కాదు....ఒక బహిరంగ స్వగతం. ఒక మేధావి వేదన. అతను నిజాయతీపరుడు. సామాజిక జ్ఞానం ఉన్నవాడు. సామాజిక సంస్కారం అంటనివాడు. అతని సమస్య మానసిక సంఘర్షణ. అతనికి అన్నీ ఉన్నాయి. సంపద, జ్ఞానం....కాని లోకంలో చాలామందికి ఏవీ లేవు. కొంత మందికి చాలా లేవు. ఈ "విపరీతమే" అతని సమస్య. ఈ అంతరమే అతని వేదనా శిల్పం.



....ఈ అంతరాలను, ఈ విపరీత పరిస్థితిని చక్కదిద్దడం ఎలా? తనకు తాను హాయిగా బతికితే తానూ నేరస్తుడు కాడా? అలాంటి స్వేచ్ఛగా బతకడానికీ—సమాజాన్ని సరి చేయాల్సిన బాధ్యతకూ మధ్య నున్న సంఘర్షణే అతని సమస్య....ఈ సమస్యకు అతని పరిష్కారం ఆత్మహత్య... ఆత్మహత్యకు ముందు తన ఆలోచనలన్నీ మన ముందుంచుతున్నాడు. ఇది ఒంటరితనపు మంచివా రందరికీ ఎదురయ్యే నైతిక సమస్య....ఆలోచనాపరులు చాలా మంది తేల్చుకోలేని వైరుధ్యం. ఆత్మహత్యను ఒక పరిష్కారంగా అస్తిత్వ వాదం అంగీకరిస్తుంది. సార్ కూడా ఒకప్పుడు ఈ పరిష్కారాన్ని బలపరచినట్టు గుర్తు. కాని....ఈ వైరుధ్యానికి నిజమైన పరిష్కారం....సమాజంలో ....సమాజంతో... దొరుకుతుంది. ఆలోచనా క్రమాగారంలోనూ "మస్తిష్క కులాయంలో"నూ దొరికేది—ఆత్మహత్య—పరిష్కారం కాదు. మానవుడి అపజయం. సమాజ సమస్యలను ఒంటరిగా....మననం చేసుకుని ....ఒంటరిగా నిర్ణయాలు తీసుకుంటే.... "ఒంటరిగా ఆత్మహత్య" కాక మరే విధమైన పరిష్కారమూ దొరకదు....


మరో జిజ్ఞాసాపూరితమైనకథ 'హేమంతం'. దీనికి ముఖ్యమైన పూర్వ రంగం ఉంది. చలం ఆ రోజుల్లో ఒక ఉగాది (ఆంధ్రజ్యోతి మాస పత్రిక) సంచికలో "కొత్త చిగుళ్ళు" అని ఒక కథ రాసాడు. అందులో "భిక్షు వర్షీయసి" అక్కగారు ముఖ్య పాత్ర. ఆ కథలో చలం చెప్పదలచుకున్నది క్లుప్తంగా ఇది: అలగా జనానికి నిజాయితీ లేదు. శృంగారమనేది సోమరిపోతులకే కాక, అలగా జనాని కూడా అవసరమే. సహజంగానే శ్రీశ్రీ దానికి ప్రతిస్పందించి "హేమంతం" రాసాడు. చలం "వేళాకోళంగా" రాసినా ఆ దృక్పథం ఒక వర్గానికి సంబంధించిన ఆలోచన అని శ్రీశ్రీ స్పష్టపరచాడు. చలంగానీ, మరొకరు కానీ, "సొంతంగా" రాస్తున్నామని భ్రమపడతారే గాని, నిజానికి ప్రతి రచయితా ఏదో ఒక "వర్గ"పు టాలోచననే గ్రంథస్థం చేస్తాడు. చలానికి, అలగా జనపు....కక్కుర్తి, సంస్కారరాహిత్యం.... కనబడ్డాయేగాని బతుకు పోరాటంలో వా రెంత Disadvantage లో ఉన్నారో....ఈ సంఘర్షణలో తీవ్రత ఎంతో కనబడలేదు. అందుకే చలాన్ని చూస్తే "జాలి". శ్రీశ్రీకి చలమంటే ఎంతో యిష్టం. అయినా "కొత్త చిగుళ్ళు" లాంటి తీవ్రమైన ఆరోపణలను శ్రీశ్రీ ఖండించడం... అదే శ్రీశ్రీ ఔన్నత్యం. అందుకే శ్రీశ్రీ—విరసంలో ఉండి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతో సరసమాడడానికి ప్రయత్నించినా....ఎమర్జన్సీని....కార్మిక వర్గ నియంతృత్వమని భ్రమించినా....శ్రీశ్రీని.... ఏమీ అనలేం...."హేమంతం" గొప్ప కథ కాదు. కాని శ్రీశ్రీలోని చైతన్యానికి... శ్రామిక వర్గ సంస్కారానికీ ఒక ప్రతీక....

ఇక మిగతా కథలన్నీ....శ్రీశ్రీలోని విలక్షణ లక్షణాలను చూపుతాయి. "ఒసే తువ్వాలు అందుకో"—చైతన్య స్రవంతి విధానంలో రాసిన "దంపతుల" కథ. ఈ కథలో అక్కడక్కడ బికెతెగించడమూ....తనను తాను అదుపులో పెట్టుకోవడమూ ఉన్నాయి. "కుళ్ళు వదిలిస్తేనా? కడుపు తోముకోవడం అయింది. దిగేడు....పీచు పరుపులో బూరుగు దూది.... దిగేడు....అచే....న్ షన్....లకిడీకే మాఫిక్ ....తోముకుంటున్నాడు....అని Glass with care" అని స్నాన ఘట్టాన్ని నిస్సంశయంగా బూతుకు సరిహద్దు వరకూ వర్ణించి వెంటనే

దయచేసి గమనించండి!

'కొత్త పుస్తకంతో కొంతసేపు' శీర్షికలో సమీక్షార్థం మాకు అందిన పుస్తకాలలో ఎన్నిక చేసిన కొన్ని పుస్తకాలను మాత్రమే సమీక్షించడం జరుగుతుంది. ఈ విషయంలో తుది నిర్ణయం "జ్యోతి" సంపాదకులదే. పరీక్షార్థం పంపేవారు రెండు ప్రతులు పంపవలసిందిగా కోరుతున్నాం.

—ఎడిటర్.



"....ఏమిటో నానా చెత్తా రాసేస్తున్నారు. ఇది రాయొచ్చు... ఇది రాయకూడదు....అనే విచక్షిత పోయింది" అని కూడా అనుకుంటాడు. ఆ పాత్ర....అందుకే శ్రీశ్రీ ఎన్ని చిత్ర విచిత్రమైన ఫీట్లు చేసినా....సర్రియలిస్టు కవిగానో, చైతన్య స్రవంతి రచయితగానో....ఎక్కువ రచనలు చేయలేదు. సామాజిక స్పృహ, సంస్కారం....శ్రీశ్రీని పట్టె కిందికి....నేల మీదకి....వాస్తవానికి దించగలవు.

"ఒక్కాల"'బాధ:కవిత్వానికి పర్యాయపదం' "క్షణంలో సగం" "బొమ్మ" "అనామిక"—— ఇవన్నీ ఒక తరహాకు చెందిన రచనలు. రచయితకు లేదా కవికి ఉండే వివిధావస్థలు ఈ రచనలో వర్ణించాడు. ఒకచోట కవితా వస్తువు మరోచోట కవితా శిల్పం, మరోచోట కవితా సంస్కారం....వీటితో రచయితకుండే సంబంధమూ సంఘర్షణా ఈ రచనల్లో చెప్పాడు శ్రీశ్రీ. ముఖ్యంగా "బాధ కవిత్వానికి పర్యాయపదం——" శ్రీశ్రీ కవిత్వ తత్వానికి....శ్రీశ్రీ వ్యక్తిత్వానికి మంచి వివరణ. మన జ్ఞానాన్ని కవిత్వంగా తర్జుమా చేసి ప్రసారం చేయడం ఎంత "శ్రమ"తో కూడుకున్నదో చెప్పాడు.

అసలు....ఈ పుస్తకమంతటిలో కథా లక్షణాలున్నది రెంటికే...."అశ్వమేధ యాగం"——"కవి సన్మానం"——అయితే ఇవి శ్రీశ్రీ కథలే... (లేక రచనలే) అంటానికి తార్కాణం వస్తువులో మాత్రం దొరకదు. ఎవరైనా రాయదగ్గ కథలే. కాకపోతే శ్రీశ్రీకున్న చాతుర్యం వల్లా....శబ్ద చమత్కారాల వల్లా....అవి మంచి కథలేమో ననే భ్రమ కలుగుతుంది. నిజానికి ఇవి శ్రీశ్రీ రాయాల్సినవి కావు.

ఇంకా మూడు"కోనేటిరావు కథలు"న్నాయి. మధ్యతరగతి బడుద్దాయికి కోరికలు లావు.... భయాలూ డిటో డిటో....కోరికలు కలల్లోనూ ....భయాలు బతుకులోనూ అతన్ని నడిపిస్తాయి. అదే ఈ కథల్లో చెప్పింది.

కథా రచయితగా శ్రీశ్రీని లెక్కించడం అనవసరం. నిజానికి ఈ కథలన్నింటా కథ కంటే కవిత్వమే రాజ్యమేలింది. కనుక వీటిని కథ లనకుండా ఒట్టి శ్రీశ్రీ రచనలంటే బాగుంటుంది. ఎందుకనో శ్రీశ్రీ వచన శైలిని గురించి పెద్దగా ఎవరూ మాట్లాడరు కాని.... శ్రీశ్రీ వచనం....కవిత్వమంత అద్భుతం. కవిత్వం కంటే స్పష్టం....శ్రీశ్రీని ఒక తాత్వికుడుగా, కవిగా, రచయితగా, విదూషకుడిగా....అన్ని రూపాల్లోనూ...."చరమ రాత్రి" చూపిస్తుంది.

——"రహి'



ప్రేమసింహాసనం

యద్దనపూడి సులోచనారాణి

23 సీరియల్

యజమానుల యింటిగుట్టు, బైట లోకంముందు దాచగలరేమోగానీ, యింటి నౌకర్ల ముందు వీలేకాదు। ఆ యింట్లో వంటకి కొత్తగా ఒకతను వచ్చాడు. అతనికి స్వప్న వృత్తాంతం ఆ నోటా, యీ నోటా తెలిసింది. పెద్దమ్మగారు కోపంతో వెళ్ళిపోయారని కూడా వాడికి తెలుసు

సుధీర్ యింట్లో వున్నప్పుడు, ఎంతో అణకువగా, అతిమంచితనంగా వుండేవాడు. సుధీర్ కోర్టుకు వెళ్ళగానే, వెకిలిచేష్టలు ప్రారంభించేవాడు. అనవసరంగా, మాటి మాటికీ స్వప్నగదిలోకి వచ్చి ఏదో ఒకటి మాట్లాడించేవాడు। స్వప్న అతని వాలకం కనిపెట్టి, గంభీరంగా, తృంచినట్టుగా మాట్లాడేది. అయినా వాడు వెంటనే వెళ్ళేవాడు కాదు. అలాగే స్వప్నని చూస్తూ నిలబడేవాడు. వాడి చూపులు తినేసేట్టుగా వుండేవి. స్వప్న వస్తుంటే చూడనట్టు వచ్చి డాష్ యిచ్చేవాడు. స్వప్నకి చాలా చిరాకు వచ్చింది. సుధీర్‌కి చెప్పాలంటే ఎలాగో అనిపించింది. అతను అసలే బాధలో వున్నాడు। ఇదొక కలత అవుతుందేమోనని సందేహించింది।


ఆ రోజు సాయంత్రంవేళ, సుధీర్ యింటికి రావటం ఆలస్యం అవుతుందని ఫోన్ చేసాడు. స్వప్న పడకగదిలో నిలబడి భర్తతో ఫోన్‌లో మాట్లాడటం అతను టీ యివ్వటానికి వచ్చి విన్నాడు। స్వప్న ఫోన్ పెట్టేసి వెనక్కు తిరిగింది. అతను టీ కప్పు పట్టుకుని నిలబడ్డాడు. 'అక్కడ పెట్టి వెళ్లు,' అంది స్వప్న ఆజ్ఞాపించినట్టు. వినలేదు। 'తీసుకోండి' దగ్గరకి వస్తూ అన్నాడు। స్వప్నకి అప్పుడే అనుమానం

జరిగిన కథ

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందుకు సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది. పరీక్ష లయ్యాయి. సుధీర్ మేనమామ కూతురు విమల స్వప్నని అవమానించింది. క్రైస్తవసన్యాసినిగా మారిపోవాలన్న స్వప్న నిర్ణయాన్ని మార్చి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. అహల్యమ్మ ఈ విషయంలో తన అయిష్టతని సుధీర్‌కి తెలియజేసింది.

వేసింది! 'తీసుకోండి' దగ్గరగా వచ్చేసాడు! స్వప్న ఒక్క తోపుతో ఆ చేతినీ టీసీ అవతలకి కొట్టి పరుగెత్తబోయింది! వాడు వేగంగా వచ్చి పట్టుకున్నాడు. స్వప్న గిలగిలలాడింది. వాడిని యిష్టం వచ్చినట్టు కొట్టింది! రక్కింది! పశువులా ప్రవర్తిస్తున్న వాడి నుంచి తప్పించుకోవడం ఎంతో కష్టం అయింది. చీర చిరిగిపోయింది. తల రేగిపోయింది! స్వప్నలో మళ్లా వాడిని చంపాలనే వుద్రేకం వచ్చేసింది. అది వుచితానుచితాలు తెలియని ఆవేశం! వాడి కంఠం పట్టకుంది!

ఇంతలో మాలి వచ్చాడు. 'అమ్మా' అని పిల్చాడు. స్వప్నకి ఆ పిలుపు అమృతమయంగా అనిపించింది. చేతిలో వంటవాడిని అప్రయత్నంగా వదిలేసింది!



వాడు పరుగెత్తాడు. తలుపులు తెరుస్తూ మాలిని కౌగలించుకుంటూ అన్నాడు. 'బాబూ! నువ్వు వచ్చి నా ప్రాణం కాపాడావు. లేకపోతే ఇవాళ ఆవిడ చేతుల్లో నా ప్రాణం పోయివుండేది. ఏమీలేదు, మామూలుగానే టీ యివ్వటానికి వెళ్ళాను. అప్పటికే పిచ్చిదానిలా చూస్తోంది! హఠాత్తుగా నా మీద పడింది. నా కంఠం పట్టుకుంది. నన్ను చంపేస్తానంటూ అరవసాగింది! ఓరి దేవుడో! ఈ యింటికో దణ్ణం. అయ్యగారికి చెప్పు! నాకు రావాల్సిన జీతం పంపించమను! ఒక్క క్షణం కూడా యింట్లో వుండలేను బాబోయ్' అంటూ వీధిలోకి పరుగెత్తేసాడు. మాలి రోజూ ఏదోక పువ్వుల పొట్లాం తెచ్చి యివ్వటం అలవాటు. సుధీర్ పురమాయింపు అది! స్వప్న గుమ్మం దగ్గరకు వచ్చింది. ఆ పెద్దదైన కళ్ళు, బిగబట్టిన పళ్లు, చిరిగినబట్టా, రేగినజుట్టూ నిజంగానే వున్మాదినిలాగానే వుంది!

'అమ్మా! పూలు' భయంభయంగా అందించాడు.

'వాడేడీ?' అంది.

'పారిపోయాడు!'

'పారిపోయాడా! మళ్లీ కళ్ళకి కనిపిస్తే పళ్ళు పీకేస్తానని చెప్పు' అంది.

మాలి అలాగేనని తల వూపాడు.

ఇంతలో సుధీర్ డ్రైవ్ చేస్తున్న కారు ఆ యింటి గుమ్మం ముందుకు వచ్చి ఆగింది. అతను ఆ రూపంలో వున్న స్వప్నని చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్న అతన్ని చూడగానే ఒక్కసారిగా ఏడవసాగింది.

'ఏమైంది! ఏమైంది!' పట్టుకుంటూ అడిగాడు.

స్వప్న ఏడుస్తూ చెప్పింది. స్వప్నని బుజ్జగించాడు. లోపలకి వెళ్ళమన్నాడు.

మాలి అతన్ని 'బాబూ? ఇలా ఒకసారి వస్తారా?' అన్నాడు.

సుధీర్ యివతలకి వచ్చాడు. మాలి వంట అతను చెప్పినవాటిని గురించి చెప్పాడు. 'స్వప్నకి మతిచలించటమా! చెప్పు తీసుకు కొడ్తానన్నానని చెప్పు! ఈసారి నా కళ్ళపడ్డాడా! రక్తం చూస్తాను!'

'ఏమో బాబూ! నాకేం తెలియదు!' మాలి దణ్ణంపెట్టి వెళ్ళిపోయాడు.

అతను లోపలకి వచ్చాడు. స్వప్న కుర్చీలో అలాగే కూర్చుని వుంది. అతను స్వప్నవైపు చూసాడు. ఆ క్షణంలో చూస్తే స్వప్న వున్మాదినిలాగానే వుంది! సుధీర్ ఆలోచనలో పడ్డాడు. మోహన్ విషయం, స్వప్న మర్చిపోదామన్నా యీ లోకం మర్చిపోనీయటం లేదు! స్వప్నని తను పెళ్ళిచేసుకోవటం తప్పు కాలేదు కదా? ఇక జీవితం అంతా యింతే అయితే, యిద్దరం ఏం సుఖపడేట్టు! అతను ఆలోచనలో పడ్డాడు.

స్వప్నని తీసుకుని ఎక్కడికైనా వెళ్లిపోతే? ఎక్కడికి వెళ్తాడు. తన ప్రొఫెషన్, తన బంధువర్గం అంతా యిక్కడే వున్నారు! వీళ్ళందర్నీ వదిలి ఎక్కడో ఏకాకిగా వెళ్ళాలి! వెళ్ళటానికేం అతనికి భయంకాదు! కానీ వృత్తి! వృత్తిలో మళ్ళా యింత స్థిరత్వం సంపాయించాలంటే యెంత వ్యవధి పడుతుంది! ఎంత కష్టం.

అతను మంచంమీద తలవైపు చెక్కకి తల ఆనించి, వెనక్కు వాలి ఆలోచనగా కూర్చుండిపోయాడు!

కొంచెం సేపటికి, స్వప్న లేచివెళ్ళి స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చింది. వచ్చి టేబిల్ దగ్గర తప్పు చేసినదానిలా, చిన్నపిల్లలా తల దించుకుని నిలబడింది!

'ఎందుకలా దూరంగా నిలబడ్తావు! ఇలా రా!' అతను పిల్చాడు.

స్వప్న యీ పిలుపుకే ఎదురు చూస్తున్నదానిలా, గభాల్న వచ్చింది. మంచం మీద కూర్చుని, అతని మీద వాలిపోయి, అతన్ని కరుచుకున్నట్టుగా అయిపోయింది. 'రభస చేసాను కదూ! మీకు తెలియదు! వాడు-వాడలా నా చేయి పట్టుకునేసరికి నాకు పిచ్చికోపం వచ్చేసింది! మాలి రాబట్టి సరిపోయింది! లేకపోతే నిజంగా చంపేసేదాన్నేమో!' చేతులు చూసుకుంటూ అంది.

అతను స్వప్న తల నిమిరాడు. తగ్గుస్వరంలో అన్నాడు.

'స్వప్నా! ఇది నీ యుద్ధం! నువ్వే ఒంటరిగా పోరాడాలి. నేను చూస్తూ నిలబడటం తప్ప ఏమీ చేయలేను! నేను నిన్ను పెళ్ళి చేసుకుని యీ లోకానికి నీ మీద మరింత కోపం తెప్పించాననుకుంటా! మోహన్ గురించి మనిద్దం మర్చిపోయినా, యీ లోకం మరవటం లేదు!"

స్వప్న అతని గుండెల మీద తల ఆనించి నిశబ్దంగా వింది! అవును! యీ యుద్ధం నేను చేయాల్సిందే! నేను ఏ పనిచేస్తే లోకం నన్ను క్షమిస్తుంది! అత్తగారు

యీ యింటికి తిరిగి వస్తుంది! లోలోపల అనుకోసాగింది.

సుధీర్ మృదుగంభీర స్వరంతో చెప్పాడు. "స్వప్నా! ఈ లోకం అనేది వుందే! ఇది పిరికివాళ్ళకి పులిలా కన్పిస్తుంది! ధైర్యవంతులకి మేకలా తల వంచుతుంది! నువ్వు ధైర్యంగా వుండమని చెప్పటం మినహా నేనేం చేయగలనో చెప్పు!"


స్వప్న తలెత్తి సుధీర్ వైపు చూసింది. 'సుధీర్ నా లాంటి ఆడపిల్ల తెలిసో తెలియకో ఒక తప్పు చేస్తుందనుకో! ఇక దానినుంచి విముక్తి లేదా? అది జీవితాంతం, క్రీస్తు శిలువ మోస్తున్నట్టూ మోస్తూ వుండాల్సిందేనా! క్షమకి తావు లేదా!'

"నాకు తెలియదు స్వప్నా! వ్యక్తిగా నా ఆలోచనలు వేరు! కానీ, నా ఆలోచనలతో యీ సంఘం ఏకీభవించదు. దాని నియమాలూ, కట్టుబాట్లు దానివి? వాన వస్తే భూమి తడవటం ఎంత సహజమో. తప్పు చేసిన మనిషి దోషిగా చూడటం సహజం అంటుంది!"

స్వప్న నిట్టూర్చింది!

సుధీర్-స్వప్న వివాహం చేసుకున్నారు! కానీ, స్వప్న గతం యిద్దరి మధ్యా అడ్డుగోడగా నిలబడడానికి లేస్తోంది! సుధీర్ దాన్ని పడగొట్టటానికి తన శక్తి అంతా ధారపోసి ప్రయత్నిస్తున్నాడు.

స్వప్నని పెళ్లి చేసుకోవటంతో, అతనికి యింట్లో తల్లితోనూ, బైట సంఘంతోనూ పేచీ వచ్చింది! వృత్తిరీత్యా అతన్ని ఎవరూ ఏమీ అనరు? కానీ అతని జీవితం



అంతా కేవలం న్యాయవాదే కాదుగా! అతనిలో తల్లిని ప్రేమించే ఒక కొడుకు వున్నాడు! స్నేహితులని ఇష్టపడే మిత్రుడూ వున్నాడు! బంధువులని ప్రేమించే సహచరుడు వున్నాడు! స్వప్న కావాలి అనుకున్నాడతను! స్వప్నని తీసుకో! అంది లోకం. కానీ లోకం విదిలించే దండం అతనికి కూడా తగలసాగింది! అతను లోలోపల పడే యీ వేదన స్వప్నముందు బైటపెట్టాడు.

ఆ వంటవాడు యింట్లోంచి వెళ్ళిపోయి వూరుకోలేదు! స్వప్న మతిచాంచల్యం వున్న మనిషి అని, వూరూ, వాడా టాంటాం వేసాడు. ఫలితంగా ఆ యింటికి వేరే నౌకరు రాకపోగా, స్వప్న గురించి రకరకాల కథలు పరిచయం అయినాయి!

స్వప్న వంటచేసింది! సుధీర్ భోజనానికి కూర్చున్నాడు! స్వప్న వడ్డించలేదు. 'అదేమిటి! పెట్టవే' అన్నాడు. 'పెట్టను. మీరు పెట్టుకోండి' అంది. 'అదేమిటి!' అతను ఆశ్చర్యపోయాడు. స్వప్న చేతులు చూసుకుంటూ అంది. 'ఈ చేతులకి మీకు అన్నం పెట్టేటంత అర్హత ఉందా అని!' సుధీర్ క్షణంసేపు నిరుత్తరుడయాడు. ఆ వెంటనే 'స్వప్నా' అంటూ తల దగ్గరకు లాక్కుని గుండెలకి హత్తుకున్నాడు.

"నేనెంత చెడ్డవాడిని కదూ! నువ్వు వద్దంటున్నా వినకుండా, నిన్ను బలవంతంగా పెళ్ళి చేసుకున్నాను! పెళ్ళి చేసుకుని భర్తగా అన్ని సుఖాలూ యివ్వలేకపోతున్నాను!"

'అలా అనకండి! దయయుంచి అలా అనకండి!' స్వప్న అతని నోరు చేత్తో మూసింది.

ఇరువురికీ, ఒకరిమూలంగా, ఒకరికి వ్యధ కలుగుతుందే అనే బాధ పీడిస్తూనే వుంది!

దానితో వారి మధ్యవున్న అనురాగానికి గ్రహం పట్టసాగింది!

(సశేషం)

కళాశాల విద్యార్థుల కథలపోటీలో రెండవ బహుమతి పొందిన కథ

ఈ బ్రతుకింతే!

కుమారి శ్రీరామ శశికళ (జూ॥ ఇంటర్)
వి. ఆర్. కాలేజి, నెల్లూరు.

రాత్రి పది కావస్తూంది. గడియారం టిక్కు టిక్కు మంటోంది. గదిలో ట్యూబ్‌లైట్ ప్రకాశవంతంగా వెలుగుతోంది. గాఢంగా నిట్టూర్చింది దుర్గ. ఒక్కసారి నలువైపులా చూసింది. ప్రక్కన మంచంమీద పదిహారేళ్ళ పాప అమాయకంగా నిద్దరోతోంది. పదేళ్ళ బాబు వళ్లు తెలిని జ్వరంతో మూలుగుతున్నాడు. మరో మంచంమీద చంటిది నోట్లో వేలేసుకుని నిద్దర్లోనే నవ్వుతూ వుంది. నిద్ర కళ్ళమీదకు రాగా జోగుతోంది దుర్గ. లేచి, గ్లాసు నీళ్లు త్రాగి మరలా ఆలోచిస్తూ కూర్చుంది. భర్త ఎంత ప్రొద్దుపోయి యిల్లు చేరినా అప్పటివరకూ భోంచేయదు. దుర్గ భర్త రాజేష్ బ్యాంక్ మేనేజర్. హుందాగా, అందంగా, వుంటాడు. కానీ ఉన్న దొక్కటే లోపం. అదే త్రాగుడు!!!

"దుర్గా! దుర్గా!! ఏయ్ దుర్గా! ఏం చేస్తున్నావే! తలుపు తెరు" ముద్దగా వినవచ్చాయి రాజేష్ మాటలు. అదరా బాదరా వెళ్ళి తలుపు తీసింది. తూలుతూ వచ్చి మంచంమీద పడ్డాడు. ... మెల్లగా వెళ్ళి టై విప్పి బూట్లు లేసు ... విప్పసాగింది. దెంప ఛెళ్ళుమంది!! ఓ ... తల ముదుంటూ, మరో చేత్తో ష్టు ... నిషాలో ఏవేవో అసభ్యంగా ... తున్నాడు రాజేష్. కళ్ళు పీక్కు ... యింట్లో తప్ప మరెక్కడా ... గరకు తెలును. అందుకే ... పెళ్ళి ... చెయ్యేసి.

"ఏమండీ! భోంచేయండి!" వేడికోలుగా అంది.

"వద్దు! నా కక్కర్లేదు పోవే!" కటువుగా అన్నాడు.

"ఏమండీ! లేవండీ! పిల్లల్ని చూసైనా మనం కాస్త మారక తప్పదండీ!" జాలిగా అడిగింది దుర్గ.

"ఛీ! ఛీ! నువ్వెళ్ళు! అనవసరంగా వాగక!" విసుక్కున్నాడు.

"ఏమం...."

దభీ దభీమని దెబ్బలు పాడసాగాయి దుర్గ శరీరంమీద మరి మాట్లాడకుండా. నిశ్శబ్దంగా భరించింది దుర్గ. కాస్సేపటికి మామూలుగా నిద్రపోయాడు రాజేష్.

దుర్గ లేచింది. తన సమస్యకు పరిష్కారం ఆలోచించింది. మెల్లగా వెళ్ళింది పెరట్లోకి. నూతి గట్టుమీద నుంచుంది. కళ్ళ ముందు పచ్చటి వలయాలు.

"పాప జాలి చూపు!"
"బాబు జ్వరంతో కలవరింత!!"
"చంటిదాని ఏడుపు!!!"
"రాజేష్ అసహాయత!!!!"

"వద్దు!! వద్దు!! వద్దు!! వద్దు భగవాన్!!! వద్దు!!!"

దుర్గ మామూలుగా లేచి వెళ్ళి ఓ గ్లాసెడు మంచినీళ్లు త్రాగి పడుకుంది.

"దుర్గా! దుర్గా! కాఫీ!!" హుషారుగా పిల్చాడు రాజేష్.

ముభావంగా వెళ్ళి కాఫీ అందించింది—దుర్గ.

"ఏమిటోయ్! అలా డల్‌గా వున్నావ్?"

"..........."

"ఓహో రాత్రి బాగా తాగొచ్చానని కోపమా? సారీ డియర్, ఫ్రెండ్స్ బలవంతం మీద తీసుకున్నా నంతే. ఈసారికి క్షమించేసేయ్. మా బంగారు దుర్గవి కదూ!" దుర్గ చుబుకం పట్టి ముద్దుగా అన్నాడు రాజేష్.

నవ్వుతూ వెళ్ళింది దుర్గ.

"నాన్నా! నాన్నా! మరేమో! నాకే....రాత్రే ....బాగా జ్వర మొచ్చేసింది. నువ్వు రాత్రి రాలేదేం నాన్నా ఇంటికి?" గారాంగా అడిగాడు బాబు.

"వచ్చా న్నాన్నా! మరి నువ్వేమో మాంచి నిద్రలో వున్నావు. నిద్ర పాడౌతుందని లేపలే దంతే!" బాబుని మంచి చేసేసుకునే దృష్టితో ముద్దుగానే చెప్పాడు రాజేష్.

"నాన్నా! డాన్స్ స్కూల్ కెళ్తున్నా" విసురుగా అనేసి దూకుడుగా వెళ్ళింది పాప.

"ఓహో! పాపక్కూడ తెల్సినట్టుందే రాత్రి వ్యవహారం? ఒక్క సినిమా ప్రోగ్రాం వేశామంటే సరి. ఆ కోపమంతా ఎగిరిపోతుంది" అనుకుంటూ ఆఫీస్ కెళ్ళాడు రాజేష్.

* * *

సాయంత్రం అయిదు కావస్తూంది. దుర్గ పనంతా ముగించి ముస్తాబై భర్తకోసం ఎదురు చూస్తూ నిల్చుంది. పాప లోపల డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తూంది. బాబు ఏవో చదువుతున్నాడు. చంటిది ఆడుకుంటూంది. హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చాడు రాజేష్.

"హాయ్! డార్లింగ్! యెక్కడికోయ్? ముస్తాబైనావ్?"

"ఓహో సినిమాకు కదూ! ఊఁ....వెరీ క్విక్. పాపా! బాబూ! త్వరగా రెడీ కావాలి. సినిమా కెళ్తున్నాం" ఉషారుగా గుక్క తిప్పుకోకుండా పిల్చాడు.

ఆ రోజు సినిమా కెళ్ళారు. ఇంటర్వెల్‌లో చాక్లెట్స్, డ్రింక్స్. అబ్బ! ఎన్నో!!

తర్వాత సర్దాగా హోటల్లో భోంచేశారు.

ఓ పదిరోజులు సరదాగా గడిచాయి.

* * *

రాత్రి పది కావస్తూంది. గడియారం టిక్కు టిక్కుమంటోంది. పిల్లలు నిద్రపోతున్నారు. దుర్గ జోగుతోంది. భయంకరమైన నిశ్శబ్దం!!

"దుర్గా! దుర్గా!" భర్త కఠినమైన పిలుపు.

తర్వాత—తిట్ల వర్షం!!

జీవితంమీద విరక్తితో, నూతిగట్టు మీద దుర్గ!! కళ్ళ ముందు పచ్చని వలయాలు!!

పాప జాలి చూపు!!

బాబు కలవరింత!;

చంటిదాని ఏడుపు!!!

రాజేష్ అసహాయత!!!

మౌనంగా వచ్చి పడుకుంది దుర్గ.

* * *

"హల్లో! దుర్గా! పిల్ల లేరి? అబ్బ! అచ్చం నీ వెలా వున్నావంటే అప్సరసలా వున్నావ్" రాజేష్ పొగడ్త.

దుర్గ మౌనం!

పాప కోపం!!

బాబు ఎదురు చూపు!!

అన్నీ మామూలే!!

* * *

"ఏయ్ దుర్గా! తలుపు తెరవ్వే! ఇడియట్!" తర్వాత తిట్ల వర్షం.

జీవితంమీద విరక్తితో. నూతిగట్టుమీద దుర్గ!

పాప జాలి చూపు!

బాబు కలవరింత!

చంటిదాని ఏడుపు!!!

రాజేష్ అసహాయత!!!

□

జ్యోతి



సహజాతాలు

పియస్వీ. రమణారావు

"... ఒరేయ్ వాసూ! వోరి వాసూ!....ఆ దరిద్రగొట్టు ముండ మళ్ళీ పెరట్లో జొరబడినట్టుంది. చూడొరే....కాలు విరగ్గొట్టి, మరోసారి గుమ్మం తొక్కకుండా...."

వెంటనే—

వో బరువయిన వస్తు వేదో విసిరేసిన చప్పుడూ,

వెనువెంటనే—

"కుఁయ్యో" మని హృదయవిదారకంగా, పరుగెడుతున్న అరుపూ,

వినబడేసరికి—

గుండెల్ని దేవేసినట్లయింది,

కడుపులో ప్రాణం కదిలినట్లయింది,

హేమకి!

తన నా వూరికి, ఆ యింట్లోకి, ఆ చీకటి గదిలోకి, తీసుకొచ్చినప్పటికి,

త నే స్థితిలో వుందో—

సరిగ్గా, అదే రోజు—

అంతవరకూ, అల్లారుముద్దుగా పెంచుకునీ, ఇప్పుడు మాత్రం దాని పొడంటే గిట్టక, అల్లంత దూరంలో కనిపిస్తే చాలు, దాన్ని గుమ్మం యెక్కనీకుండా, రాళ్ళతో తరిమి తరిమి కొట్టేస్తున్న, ఆ యిల్లుగలవాళ్ళ కుక్క కూడా—

అదే స్థితిలో వుంది!

తల్లీ, అన్నా కలిసి, బలవంతంగా, తన నీ వూరికి ఈడ్చుకు రావడఁవూ—

అదే రోజు, ఆ ఇల్లుగలవాళ్ళు, వాళ్ళ

కుక్కని తరిమి కొట్టడమూ—

రెండూ వొక్కలాగే వున్నాయనిపించాయి, హేమకి.

"....ఎంత పాలూ అన్నం దాని మొహాన్న పోసి పెంచితే మాత్రం, దిక్కుమాలిన కుక్క, దాని బుద్ధి పోనిచ్చుకుంటుందిటండీ...."

కుక్కని తరిమికొట్టిన రోజున, ఇల్లుగలావిడ, అన్న మాటలు—

జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా,

"....పువ్వుల్లో పెట్టి పెంచుకున్నందుకూ, నువ్వాడింది ఆట, పాడింది పాటగా చెల్లుబాటు చేసినందుకూ, మమ్మల్ని నలుగుర్లోనూ తలెత్తుకొని తిరగనీకుండా, తగిన శాస్తినే చేశావు. వయసొచ్చిన ఆడపిల్లలెందరేరూ భూమ్మీదా? అందరూ ఇలాగే వొళ్ళు పొగరెక్కి వీధిని బడ్డారా? ఛి, ఛీ...."

తన సంగతి, యింట్లో తెలిసిన మొదటి క్షణంలో, కన్నతండ్రి అన్న మాటలు—

జ్ఞాపకం వొస్తుంటాయి, హేమకి.

నిష్కల్మషంగా, ప్రాణానికి ప్రాణంగా, ప్రేమించిన మూర్తి,

ఆ రోజు,

వర్షంలో చిక్కుబడిపోయిన,

చీకటి క్షణాల్లో,

ఎందుకలా తొందరపడ్డాడో,

తప్పంతా అతనిదేనా?

తనేం జేసిందీ?

అతను తొందరపడినా,

మున్నెన్నడూ యెరగని ఆ వెచ్చని అనుభూతికి,

తను లొంగకుండా ఎందుకుండలేక పోయిందనీ?

ఆ వొక్క క్షణం, తను వారించి వుండగలిగినట్టయితే,

ఇప్పుడిలా, పదిమందిలో....

కన్నీటి ప్రవాహం ఆపుకో శక్యం కాలేనిదయిపోయింది, హేమకి.

"....పెద్దల అనుమతి లేకుండా, కట్టుబాట్లు మరిచి, తొందరపడ్డం తప్పే. అయినా మించిపోయిందేం లేదు. నా జీవితానికి దేవుడిచ్చిన గొప్ప వరం హేమ. దయచేసి మా పెళ్ళికి అనుమతించండి. హేమను నా తలమీద పెట్టుకుని పూజించుకుంటాను...."

తనవాళ్ళ ముందు, దీనాతిదీనంగా, మిక్కిలి ప్రాధేయపడిన మూర్తిని, అతని సంస్కారాన్నయినా గుర్తించకుండా తన అన్న మూర్తిని చాచి కొట్టినా కూడా—

"నామీద మీకున్న కోపం ఏ రూపంలోనయినా తీర్చుకోండి. కాని నా నుంచి హేమను దూరం చెయ్యాలని మాత్రం దయచేసి ప్రయత్నం చెయ్యకండి. నేను జీవించలేను."

అంతటి అవమానాన్ని సహించీ, మూర్తి అన్నా:

"నీ అంతరం ఎక్కడ? మా అంతరం ఎక్కడరా? కట్టుకున్న పెళ్ళాంకి కడుపునిండా తిండయినా పెట్టలేని అణా కానీ వెధవ్వి. నా కూతుర్ని పెళ్ళి చేసుకుంటాననడానికి నీ బ్రతుకెంత? నువ్వెంతరా? చేసిన వెధవపని చాలక, నా ఎదట నిలబడి ఆ మాట అనడానికి నీ కెన్ని గుండెల్రా? యూ, స్కౌండ్రల్. గెటవుట్, గెటవుట్, ఈ ఛాయల మళ్ళీ కనిపించావో తన్ని పాతేయించేస్తాను."

నానా మాటలూ అని, మనిషి కుండవలసిన కనీస సభ్యత కూడా మరిచి, తన తండ్రి మూర్తిని మెడ పట్టుకుని బయటికి, తన కళ్ళెదుటే, గెంటుతున్నప్పుడు—

నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ, చూడటమినహా,

తనేం చెయ్యగలిగిందా రోజు?

ఎదిరించి, ధైర్యంగా, మూర్తి వెంట, ఎందుకు వెళ్ళలేక పోయిందీ?


రాళ్ళుచ్చుకుని, తరిమి తరిమి కొడుతున్నా, ఇల్లుగలవాళ్ళ కుక్క ఆ యింటినే పట్టుకుని, పదే పదే వేళ్ళాడుతుందెందుకనీ?

వొకప్పుడు పాలూ అన్నం పెట్టించారని, తన జాతి లక్షణ విశ్వాసమా? అది.

అలాంటప్పుడు—

పుట్టింటిమీద ఆడపిల్లకున్న విశ్వాసమూ, అలాంటిదేనా?

కాక?



తను నెత్తీ నోరూ బాదుకుంటున్నా, వీల్లేదని, తండ్రి అన్నా కలిసి డాక్టర్ దగ్గరకు తిప్పితే, తిరగాలేదూ తను?

"కుదుర్దు. తల్లి ప్రాణానికి ప్రమాదం" అని డాక్టర్లన్నప్పుడు,

మూడో కంటివాడికి తెలీకుండా, ఈ బరువొదిలించేద్దామని, తల్లీ అన్నా కలిసి, ఇన్ని వందలమైళ్ళు బలవంతంగా ఈడ్చుకొస్తే,

రాక, ఏం చేయగలిగింది తను?

ఈ బరువేదో వొదిలిన్తర్వాత—

తన మెడలు వొంచి, ఎవడిచేతో మూడు ముళ్ళూ వేయించేసి, తమ పరువు నిలబెట్టుకో చూస్తే—

అప్పుడు మాత్రం, యెదిరించ గలదా తను?....

"—పోనీండి అక్కయ్యగారూ, దిక్కుమాలిన ముండ యెక్కడకని పోతుందీ? అలవాటయిన పంచ. చూస్తూవుంటే నేడో రేపో, ఈనేసాలా వుంది. పెరట్లోనే కదా, వుణ్ణిద్దురూ—"

ఇల్లుగలావిడతో, తల్లి అంటున్న మాటలు, హేమకి వినిపించగానే ఆమె ఆలోచనలు అక్కడికి ఆగేయి.

"అది కాదండీ....మద్రాసెళ్ళినప్పుడూ, జాతి కుక్క కదాని, దాని ఎదాన్న నాలుగొందలు పోసి, ఇంతప్పుడు దాన్ని కొనుక్కొచ్చాడు మా పెద్దాడు. మా యింటికొచ్చిన రెండు నెల్లకి, దువ్వలా రూపూ, గువ్వలా గంతూ, తేలిందంటే, దానికేం సామాన్యమైన తిండి పెట్టామనుకున్నారా ఏం? మాతో సమానంగా దానికి తిండి పెట్టాం అంటే మీరు నమ్మరు. దాని జాతిదే, గుర్రంలాంటి మొగకుక్క, డాక్టరు రాజాగారింట వుంది. ఇదిగో, దానితో జత కలిపిద్దాం అని అనుకుంటున్నామో లేదో, వొళ్ళు కొవ్వెక్కి, కట్టు తెంపుకుని, వీధిని బడి, అడ్డమైన వెధవ కుక్కలతోనూ పోయింది. ఆ దిక్కుమాలిన సంతు అంతా పెరట్లోనే కంటా నంటే.... ఛి, ఛీ—"

ఇల్లుగలావిడ మాటలో కొక్కటి ఒక్కో సూదయి గుచ్చుకొన్నాయి, హేమ చెవులికి.

తల్లికూడా నిస్సహాయంగా చూస్తూ, మారు మాటాడకపోవడంతో, ఆ బాధ మరింతైంది హేమకి.

* * *

డాక్టరు దగ్గిర కెళ్ళి, తిరిగొస్తున్న హేమకి—

రోడ్డువార, చెట్టుక్రింద, పక్క లెగరేసుకుంటూ కళ్ళు మూసుకొని పడుకున్న, ఇల్లుగలవాళ్ళ కుక్క కనిపించింది.

రిక్షాలో బరువుగా వాలి కూర్చున్న, తనవేపోసారి చూసుకొందామె.

"పెరట్లో వో మూలగా పడుకోనిచ్చి, వాళ్ళు తినగా పారేసిన యిన్ని మెతుకులు దానికి పడేస్తే నేంపోయింది వాళ్ళ సొమ్మూ? బొత్తిగా దయాదాక్షిణ్యం లేని వెధవలు—"

తన ప్రక్కన కూర్చున్న తల్లి అనేసరికి;

తల్లివేపు చూసిందామె.

"—ఎక్కడికో దూరంగా తీసుకుపోయి, ఈ మచ్చ వొదిలించుకోపోతే, పదిమందిలో మన పరువేంగానూ? వొంటికి జబ్బొస్తే, వొదిలించుకోటంలా? ఇదీ అంతే....కడుపులో పుట్టిన పుండనుకోటంవూ—"

తనెక్కడికీ రానని మొరాయించినప్పుడు, తండ్రి అన్న మాటలు చటుక్కున జ్ఞాపకం వొచ్చాయి, హేమకి!

తల్లికీ, తండ్రికీ, తనమీదున్న, సానుభూతిని, తల్చుకునేసరికి—

శరీరం అంతా కంపించిపోయింది, ఆమెకి!

"కుక్కకే, తల్లీదండ్రీ వుండుంటే, యే మెడ్రాసో, బెంగుళూరో, తీసుకుపోయి, దాని కొచ్చిన మచ్చ మాపుకొనే వాళ్ళేమో" అని, అందామనుకుని—

'ఛీ' అని తనలో మాత్రం అనుకుని, వూరుకుంది హేమ.

—రిక్షా యింటిముందు ఆగే వేళకి, ఎదురొచ్చి,

"యేఁవంది డాక్టరూ?...." అడిగాడు, అన్న.

"ఇంక రెండ్రోజుల్లో రావచ్చంది...."అంది తల్లి.

"ఏదో అయిపోతే బాగుండును, వెధవది, ఎన్నాళ్ళిక్కడుండటం?"

"బావుందిరా నువ్వన్న మాట....మన చేతుల్లో ఏం వుందీ?"

"చేతుల్లో కాదు....ఖర్మ, మన రాతల్లో వుంది"విసుగ్గా అనేసి చరచరా బయటికి వెళ్ళిపోయాడు అన్న.

గదిలో మంచంమీద కూర్చుని, ఈ సంభాషణంతా వింటున్న, హేమకి—

"అయిపోతే బాగుండును. తనని మళ్ళీ వెనక్కి తీసుకెళ్ళాల్సిన అవసరం రాకుండా, అంతా, ఇక్కడయిపోతేనే బాగుండును, తన పీడ వొదిలిపోతుంది వీళ్ళందరికీ" అని, అనిపించగానే—

"నా సంగతేం జెప్తావ"ని,

కడుపులోంచి యెవరో ప్రశ్నించినట్టయింది!

* * *

ఆ రాత్రి

అన్నం తింటున్నప్పుడు, ప్రక్కలో సన్నగా మొదలయిన నొప్పి, పొత్తికడుపులో ప్రవేశించి, క్రమేపీ, కొండంత అయి, పది నిముషాల్లో చుట్టుముట్టేసింది, హేమని.

తల్లి కంగారు పడిపోయి కొడుకుని పంపించి, నర్సుని తీసుకురమ్మని.

మెలికలు తిరిగిపోతూ, చుట్టుకుపోతోంది హేమ.

"—ఎంత కొట్టినా కదల్టంలేదే అమ్మా, దాని వాలకం చూస్తుంటే చచ్చినట్లా వుందే—"

ఇల్లుగలవాళ్ళ చిన్నబ్బాయి అంటున్నాడు, వాళ్ళమ్మతో.

"అదెందుకు ఛస్తుందిరా బాబూ, దిక్కుమాలిన పిల్లల్ని పెట్టి, మనల్ని చంపుతుంది గానీ—చోద్యం చూస్తున్నట్టు కూర్చున్నావేంరా....తగిలేసి తలుపెయ్యక—" అంటోంది ఆవిడ.

"పోన్లేవే....ఈ రాత్రప్పుడు యెక్కడికి పోతుందదీ? తెల్లారేకా, దాన్నీ, పిల్లల్ని కలిపి తరిమేయొచ్చు....వుణ్ణీయే" అంటున్నాడా అబ్బాయి జాలితో.

అంత మరణవేదనలోనూ,ఇదంతా వినబడుతోంది హేమకి.

వొక్కసారి భయంగా, రెండు చేతుల్తోనూ



కడుపులోని ప్రాణాన్ని పొదువుకుని 'అమ్మా' అని అరిచింది.

"పార్వతమ్మగారూ, ఓసారిలా వస్తారూ?" తల్లి పిలుస్తోంది, యిల్లుగలావిడని, కంగారుగా.

ఆమె వొస్తోందంటే, హేమ గజ గజ వొణికిపోయింది.

తల్లీ, అన్నా కలిసి, గుట్టుగా ఈ సంగతి దాచబట్టిగానీ—

ఆవిడకు తెలిస్తేనా?

ఇంట్లోంచి బయటకు గెంటేదూ?

కుక్కకే గతిలేకపోయింది!

సరిగ్గా అదే సమయానికి, నర్సుని తీసుకుని అన్న వొచ్చాడు.

వొక గంటకి పైగా—

ఆమె ప్రాణం అనుభవించిన చిత్రహింసకి ఫలితంగా—

'కేర్' మంటూ—

ఆమెలోంచి మరో ప్రాణం భూమ్మీద పడింది.

'మొగపిల్లాడు' అని నర్సు అంటున్న క్షణంలోనే—

"....అమ్మా....అమ్మా....మన కుక్కేం మూడు పిల్లల్ని పెట్టిందేవ్....ఎంత ముద్దుగా వున్నాయనుకొన్నావ్—"

పరుగెత్తుకొంటూ వొచ్చి, అంది ఇల్లుగల వాళ్ళమ్మాయి.

"ముద్దేఁవిటే నీ మొహమ్మండా....దరిద్ర గొట్టు ముండాకుక్క పెరడంతా పెంట చేసుంటుంది—వుండండమ్మా వొస్తాను—"

అంటూ యిల్లుగలావిడ వెళ్ళిన మరుక్షణం—

వొళ్ళంతా నీరసం ఆవహించి మైకం కమ్ముకొంది హేమని!

—ఆ మగతలోంచి తేరుకోటానికి, గంటకి పైనే పట్టింది ఆమెకి.

తెలివొచ్చిన ఉత్తరక్షణం—

ఆమె చేతులు మంచంమీద, తన పక్కలో ఆత్రంగా వెతుకుతున్నాయి—

ఎంత తడిమి చూసుకున్నా, వుట్టి మంచమే తగుల్తోంది—

రెండు ప్రక్కలా తిరిగి చూసుకొంది—

ఎక్కడా తన చిన్నారి ప్రాణం కనిపించలేదు—

ఎక్కడ?

వోపిక తెచ్చుకొని, లేచి కూర్చుని, గదంతా కలయ చూసింది.

ఎంత కళ్ళు చించుకొన్నా,

శూన్యమే!

ఏడీ తన చిన్నారి బాబూ?

వాడు భూమ్మీద పడగానే, 'కేర్' మనడం తను వింది!

ధారాళంగా అంత బలు వుండేవాడు నాయన!

కడుపంతా చెరువు చేసుచేసుకొని కదిలే వాడు,

తన కడుపు చెరువు చేసి, పోలేదు కదా?

ఆ వొక్క ఆలోచనతో,

మతిపోయింది హేమకి!

పుట్టెడు నీరసం మళ్ళీ కమ్ముకొచ్చి,

స్పృహ తప్పింది!

* * *

హేమకి, మెలకువ వొచ్చేసరికి——

పక్కవాటాలోంచి, ఇల్లుగలావిడ, పెద్ద 'పెడబొబ్బ' పెట్టి,

"....దిక్కుమాలిన ముండ, నా కొంపకి శనిలా దాపురించింది తల్లో, ప్రాణం కొరికేసింది, దీనమ్మ కడుపు కాలా...." అంటూ, పెడుతున్న శోకాలు వినిపిస్తున్నాయి.

"ఏం జరిగింది పార్వతమ్మగారూ?" ఎవరో అడుగుతున్నదానికి,

"ఏంచెప్పను తల్లీ, శనిగొట్టు ముండాకుక్క పుట్టింటి కొచ్చినట్లు, రాత్రి పెరట్లో ఈనీసింది కదా....పైకి తగిలేద్దాం(వనీ పిల్లాడు దగ్గరకెళితే 'గుర్రు'గా చూస్తోందన్నాడని, నేం వెళ్ళి, వొక పిల్ల నింకా ముట్టుకున్నానో లేదో, పెద్దపులిలా మీద కురికి, కండ వూడిపీకేసిందే తల్లీ.... ఏంవర్రా, ఎవర్రా అక్కడా? ముక్క వూడిపోయి రక్తం కాలవగట్టేస్తోంది....డాక్టరు దగ్గిరకు తీసుకు పొండ్రా నన్నూ...."

గగ్గోలు పెట్టి యేడ్చేస్తోంది, యిల్లుగలావిడ.

చటుక్కున యేదో జ్ఞాపకం వొచ్చిన హేమ, పక్కకు తిరిగి పక్కలో చూసుకొంది.

ఖాళీ మంచం!

తన పేగులు కదిలించి బయట కొచ్చిన,

తన పేగులో పేగు,

తన ప్రాణంలో ప్రాణం,

ఏడీ తన బాబు ఏడీ?

"....చూడండమ్మగారూ .... కలికాలం.... ఏటవతలొడ్డుకి పసిగుడ్డు శవం కొట్టుకొచ్చిందట; మా పేటవోల్లంతా సుద్దానికి పొరెల్లినారు....ఏ ముండకొచ్చిందో పోయీకాలం.... వొల్లు పొగరెక్కినప్పుడున్న ధైర్యం వోం కన్నప్పు డేటయిపోనాదో....పేణం వున్న పసికందుని పారేయటానికి, దానికి సేతులెలా వొచ్చాయో పాపిష్టిముండ...."

అప్పుడే పనిలోకొచ్చిన పనిమనిషి అంటున్న మాటలు వినబడేసరికి——

తల్లి ప్రాణం హేమ రొమ్ముల్లోంచి పాలయి చాలా ఆవేశంతో చివ్వున చిమ్మేసరికి; తట్టుకోలేక——

"అమ్మా!"

భూమి బ్రద్దలయిన అరుపు అరిచి——

తన కఠోర స్వరానికి తనే చెవులు మూసుకొంది!

"ఏం తల్లీ? ఎందుకమ్మా పిలిచావు?"

తల్లి కంగారుగా పరుగెత్తు కొచ్చి అడిగింది.

కాని, సూటిగా తన మొహం చూడలేకపోడాన్ని, పసికట్టిన హేమ——

"నా పిల్లాడు? నా పిల్లా డేడమ్మా?"సూటిగా తల్లి నడిగింది.

"..........."

సమాధానమివ్వకుండా మొహం పక్కకు తిప్పుకున్న తల్లిని,

"వొక్కసారి చూపించమ్మా నా బాబుని" అతి దీనంగా అడిగింది.

అంతవరకూ పక్క గదిలోంచి ఆ మాటలు వింటున్న ఆమె అన్న రివ్వున వొచ్చి——

"నువ్వు బైట కెళ్ళమ్మా" తల్లి రెక్క పుచ్చుకొని, బైటికి పంపించేసి;

"ఏంవిటీ?" అనడిగాడు చెల్లిని చూస్తూ.

"నా బాబు ఏడీ? ఎక్కడున్నాడు? నాకు వెంటనే చూపించాలి"

చాలా సూటిగా అడిగింది.

"నీకు బాబు పుట్టాడని ఎవరు చెప్పేరు? నీ కసలు ఏ పిల్లా పుట్టలేదు. ఇంత నెత్తురుముద్ద బైట పడింది. చచ్చిన పిండం, బైట పారేసాం."

చాలా కంగారుగా అన్నాడు.

తన కడుపులోని పేగులన్నీ వొక్కసారి తెంపేసినట్టయింది హేమకి!

"అబద్ధం" చేతులు అటూ ఇటూ నెరుపుతూ పొట్టమీద తడుముకొంటూ బాధగా అరిచింది.

ఆమె అన్న యే మాత్రం చలించలేదు!

ఆ మౌనం చూసి ఆమె సహించలేక,

"పుట్టగానే 'కేవ్' మన్న నా బాబు గొంతు నేను విన్నాన్రా. నాకు తెలుసురా....యేం చేసార్రా? కన్నయినా తెరవలేని నా చిన్నారి బాబుని....వొక్కసారి చూపించండ్రా...." ఆక్రోశిస్తూ అడిగింది.

"విన్నావా? అయితే వినేవుంటావు. మళ్ళీ చెప్తున్నాను విను. నీకు మొగపిల్లాడే పుట్టాడు. పుట్టిన పావుగంటకి చచ్చేడు; సరా"

చాలా తేలిగ్గా అన్నాడతను.

కడుపులో అలలు అలలుగా తిరుగుతున్న బాధ, వొక్కసారి పెద్ద కెరటమై, ఉవ్వెత్తున లేచి గుండెల్ని చుట్టుముట్టేసరికి——

"చచ్చిపోయాడా? చంపేసారా?" చాలా తీక్షణంగా అడిగింది హేమ.

"నీకేం పిచ్చెక్కిందా?" విసుగ్గా అన్నాడతను.

"నా బాబును నాకు చూపించకపోతే నాకేం వన్నా ఎక్కుతుందిరా. చెప్పు. ఏటొడ్డుకి కొట్టుకొచ్చిన పిల్లాడి శవం ఎవరిది?"

"నాకేం తెలుసు? నేనేం వెళ్ళి చూసొచ్చానా?"

"వెళ్ళి పారేసొచ్చినవాడివి, నీకాకపోతే ఇంకెవరికిరా తెలుస్తుందీ?"

"నోటికొచ్చినట్టు పేలక."

హేమకి నరాలన్నీ బిగుసుకొన్నాయి.

పక్కమీంచి రివ్వున లేచింది.

పిడికిళ్ళు బిగించింది.

పళ్ళు కొరికింది

శంఖంలాంటి అన్న గొంతు ముడి పట్టుకోవాలని

ఛెంగున అతనిమీద కురికింది

ఆడపులిలా!

క్షణంలో పరిస్థితి గ్రహించిన వేటగాడిలా

వొడుపుగా పక్కకు తప్పుకున్నాడతను.

ఉరికిన ఆమె దభీమని కింద పడిపోయింది!

"బాబూ....వొరే కన్నా....నా తండ్రీ...." పిచ్చిగా అరుస్తూ బైటకి పరుగెత్తబోతున్న హేమ రెక్క పుచ్చుకొని, ఈడ్చుకొచ్చి మంచంమీద కూలదోసాడు ఆమె అన్న.

"జరిగినదానికి నువ్వు చేసేదేం లేదుగానీ, కళ్ళు మూసుకుని పడుకో. పిచ్చి పిచ్చిగా ఆలోచించక" అన్నాడతను వెళ్ళబోతూ.

"అవున్రా, నేనేం చెయ్యగలన్రా? పిచ్చిదాన్ని కాబట్టే మీ వెంట వొచ్చాన్రా. అప్పుడే యెదిరిస్తే నా బ్రతుకిలా కుక్కకన్నా హీనంగా తయారయేది కాదురా........ నన్ను పెట్టిన వుసురు వుట్టినే పోదురా.... బాబూ....నా కన్నా....వాళ్ళు కాదురా.... నేనేరా నిన్ను చంపేసిన రాక్షసిని....నా కడుపునెందుకు పుట్టేవురా నాయనా...."

పేగులు తెగిపోయేలా పెద్దపెట్టున ఏడుస్తూ తల బాదుకుంది, జుట్టు పీక్కుంది, చీర ముక్క ముక్కలుగా చింపుకుంది.

ఆ తర్వాత——

మరి ఏ ఆక్రోశం గానీ, ఆక్రందన గానీ, ఆమెనుంచి రాలేదు.

మూసుకుపోతున్న ఆమె కన్నుల్లో,

పాలు తాగుతూ, తన వొడంతా చిన్ని చిన్ని కాళ్ళతో కుమ్మేస్తూ తిరుగాడుతూన్న తన పిల్లల్ని అరమోడ్పు కన్నులతో చూసుకుంటూ ఆ మధురాతి మధురమైన పులకింతకి మైమరచి మురిసిపోతున్న——

ఇల్లుగలవాళ్ళ కుక్క——


చివరి దృశ్యమై నిలిచిపోయింది! □

పొడుస్తాను!

వాడి కళ్ళలో నా వేళ్ళు దించేసి గుడ్లను పీకేస్తాను. లేకపోతే....

లేదా? నా పెళ్ళామే వీడి కళ్ళలో దూరిందా?

'అబ్బా!' అటూ యిటు కదిలాను. కొరివి మీద కూర్చున్నట్లుంది—కొబ్బరిపీచు సీట్ల





—నాన్సెన్స్! బస్సెక్కిన దగ్గర్నుంచీ చూస్తున్నా. వాడి చూపులో మార్పులేదు. కన్నార్పటంలేదు. పక్కసీట్లో ఎవడొచ్చి తోస్తూ రాచుకు కూర్చున్నా వాడికేం పట్టటంలేదు.

—వెధవ కళ్ళలో రక్తపు జీరలు—పాము నాలుకల్లా చీలి వున్నాయి. కుంత బండ పెదాల మీద జొల్లు కారుతోంది అసహ్యంగా. ఛీ! ఛీ!

వాడి కళ్ళలో మెదిలేది లత ఒక్కతేనా?

నా పళ్ళ పటపటలు వాడి చెవుల్ని తాకుతున్నాయా?

"టిక్కెట్! టిక్కెట్!"

కండక్టరు పిలుస్తున్నా వినిపించుకోడేం? నాకు తెలుసు వాడింకా టిక్కెట్టు తీసుకోలేదని.

రాస్కేల్, వీడింతవరకు ఆడదాన్నే చూడ

మీద.

లత బాబుకేవో బైట చూపిస్తూ కిలకిలా నవ్వుతూ ముచ్చట్లాడుతోంది.

కనుకొలుకుల్లోంచి ఆ 'మేనర్‌లెస్ క్రీచర్' ఇంకా కనబడుతూనే వున్నాడు. వాడు చూపు మరల్చకుండా లతనే చూస్తున్నాడు.

ఇక ఓపిక పట్టలేను. వాడి గుడ్లు పీకి పారేస్తాను.

అమ్మో! అది అమానుషం! ఘోరం!

అలా అనుకొని ఎంతసేపు ఓర్పు? నా 'పేషన్సు' మీద పిన్నులు గుచ్చుతున్నాడు ఆ 'బ్రూట్.'

లేచి నుంచున్నాను—వాడి చూపులకి అడ్డుగోడగా.

'మంచి పని చేశాను' నన్ను నేనే మెచ్చు



కొన్నాను. వాడిక లతను చూడలేదు.

"గవర్నరుపేట సెంటరెవరండీ?"

"దిగండి త్వరగా."

కండక్టరు గొంతు చించుకుంటున్నాడు.

వాడు దిగలేదు.

అసలు వాడు దిగతాడా? బస్సులోనే పాతుకుపోతాడా?

ఆఁ! వాడు... వాడు తొంగి తొంగి లతను చూస్తున్నాడు. వీడసలు మనిషేనా?

"ఎందుకండీ లేచి నిల్చున్నారూ?" అంది లత.

కూర్చున్నాను.

నా మనసు మాత్రం మరిగిపోతోంది.

ఆ వెధవను ఓ కంట కనిపెడుతూనే వున్నాను.

ఆడదాన్ని చూస్తే ఆమాంతం తినిపారేసేట్టుండే వీడి చూపుల్ని సమాధి చెయ్యాలి. వీడిలాటి వెధవల్ని పట్టపగలు హత్యచేసి పారెయ్యాలి.

"గాంధీనగర్ పార్కెవరండీ?" కండక్టరు కంఠం.

"లతా! లే! లే!" నేను.

"ఇంకా దుర్గా టాకీసు రాలేదు గదండీ!" లత.

"ఇక్కడికి దగ్గరేలే. మాట్లాడకుండా దిగు."

డర్టీ బగ్గర్ అగ్లీ లుక్స్ నుంచి లతను తప్పించుకు బైటపడ్డాను.

ర ర ర

అదుగో! వీడెవడు?

వాడికి అన్నమాదిరున్నాడే వీడు.

"పిపీ! పి.... పువ్వాఁయ్.... పువ్వాఁయ్."

ట్రాఫిక్ బందయి పోతున్నా పట్టించుకోడేం—?

వాడి చూపులు.... వాడి పంచేంద్రియాలూ లతమీదే కేంద్రీకరింపబడ్డాయా?

ఆఁ!.... తప్పుకోడేం? ఆ లారీ, ఆ బస్సు, ఆ టాక్సీ ఒకదాని తర్వాత ఇంకొకటి వాడిమీద ఎక్కి పారేస్తే! పీడా విరగడై పోదూ!

లత నిశ్చింతగా నడుస్తోంది.

పోనీ వాడి చూపు వాణ్ణి చావనీ.

మళ్ళీ వెనక చూపు చూడకుండా ముందుకి సాగిపోయాను.

ర ర ర

మల్లెలు, తెల్లగన్నేర్లు ఎంత చక్కగా వున్నాయి ఈ పార్కులో!

నైట్‌క్వీన్ సువాసనలు ఏ మూలనుంచో గుప్పున గుబాళిస్తున్నాయి.

"ఆహాఁ!

"లతా!"

"ఊఁ."

"వాట్ ఎ లవ్‌లీయస్ట్ లైఫ్ వుయ్ లీడ్!"

జలతరంగాల్లా లత నవ్వు.

నా తల లత ఒడిలో పెట్టుకుందామని లేచాను—ఆ మారుమూల చెట్టుకింద.

సిగరెట్టు పీలుస్తూ చూస్తున్నాడు.

సర్రున లేచి నిల్చున్నాను.

—నాకు తెలుసు ఆ రాక్షసుడి కళ్ళలో కదిలే బొమ్మ ఎవరిదో?

"ఎందుకుబే అలా చూస్తావ్?" అడిగే 'తాకత్' నాకు లేదు.

విసురుగా లతవైపు తిరిగేను.

"లతా!" అరిచేను.

ఏదో తన్మయత్వంలో వున్న లత నిండు గర్భిణిలా కదిలింది.

"లే! లే!" సినిమాకి టైమవుతోంది" తొందర చేశాను.

"అబ్బబ్బా! మీరెప్పుడూ ఇంతే." విసుగ్గా అంది లత.

"ఏం చెయ్యమంటావ్? నీ అందం నా పాలిటి శాపమై కూర్చుంది. నీకేం? రాజఠీవితో ఏం పట్టనట్టు వెళ్ళిపోతుంటావ్. ప్రతి అప్రాచ్యపు వెధవా చూపులతో నిన్ను కొరికేస్తుంటే నే చూడగలనా? పెళ్ళాం బెల్లం ముక్కలా జేబులో వుంటే సరిపోతుందా? నాకు తెలీకుండా ఆ బెల్లానికి చీమలు పట్టిపోతే నా బాధ నీకేం తెలుసు లతా!" అని లతకు చెప్పలేక చెయ్యి పట్టుకు లేవదీసుకు పార్కు బైట పడ్డాడు.

" " "

"వచ్చగడ్డి కోనేటి వడుచుపిల్లోయ్!"

"..........."

"కొంగు జారి తేముంది కొంటి పిల్లోడోయ్!"

"..........."

అబ్బా! అహుఁ!....ఓహో!

ఆ పాట నేనూ లతా పాడుతున్నట్టుంది.

ఆ ప్రేమ విహంగాలం మేమే.

ఒళ్ళో వున్న బాబు కిందినించి, చేతులు ఫ్రీ చేసుకుని 'లతా' అని లత చెయ్యిమీద చెయ్యి వేశాను.

"అఁ!...." లత.

కొద్దిసేపు ఒకళ్ళ శరీరంలోంచి ఇంకొకరి శరీరంలోకి చేతులగుండా "ఎలక్ట్రాన్లు" ప్రవహించేయి.

"విశ్రాంతి" తెర.

సర్దుకు కూర్చున్నాం.

సౌండు బాక్సులోంచి సంగీతం,

"లతా! కాఫీ తాగవూ?" అడిగేను.

"పదండి వెళ్దాం" ఐంతిలా లేచింది లత.

"నువ్వు కూర్చో. నే తెస్తాలే" అని అనలేకపోయాను.

లత ముందడుగు వేసింది.

చుట్టూ చూస్తూ అంగరక్షకుడిలా లత అడుగులో అడుగువేశాను.

"సార్ పాసు" గేటువాడు పిలిచి గేట్ పాస్ చేతిలో పెట్టేడు. పరధ్యాన్నానికి కొంచెం బాధేసింది.

కాఫీ స్టాల్—

జుర్రు జుర్రున కాఫీ త్రాగే శబ్దాలు—టిక్ టిక్ మంటూ సిగరెట్టు నుసి దులుపుతున్న చిటికెలు.

జనాన్ని తప్పించుకుంటూ కౌంటరు దగ్గరకెళ్ళి "రెండు కాఫీ లివ్వండి" లత ఆర్డరు.

ఇంత దూరంలో, భుజంమీద బాబు నేసుకొని బెరుగ్గా చూస్తున్నాను నేను.

ఆఁ! లతలోంచి ఏదో శక్తి బైటకి పోతోంది—దానంతట అదికాదు. ఎవరో లాగేస్తున్నారు.

ఎన్ని జతల కళ్ళు లతను చూస్తున్నాయ్!

లతకు నాకు ఎంతమంది అడ్డం!

ఊఁహూఁ! లాభంలేదు.

—జనాన్ని చీలుస్తూ క్షణాల్లో కౌంటరు చేరాను.

నా కళ్ళు ఇంతింత చేసుకుని లతను కింద నుంచి పైదాకా చూసుకున్నాను. సూమ్మయ్యా! లత ఏం చెక్కుచెదరలేదు.

"ఇదుగో! కాఫీ తీసుకోండి" లత.

అందుకుని గోరు వెచ్చటి కాఫీ గటగటా త్రాగేశాను.

"రండి లోపలి కెళ్దాం" లత కాఫీ కప్పు అవతల పెడుతూ.

"ఆగూ! లైట్లు పోనీ. ఇప్పుడు స్లైడ్స్ వేసేది" నేను.

నా భయం నాది.

ఔను. ఇప్పుడు లైట్లుండగా లతను లోపలికి తీసుకెళ్తే ఇంకేమన్నా వుందా?

లైట్లు పోయాయి.

నేను లతతో లోపలికి పోయాను.

—హీరో హీరోయిన్‌లు పగిలిన హృదయాలతో విడిపోయారు.

లత పక్కనుంచి నా కుర్చీ తీసి నన్నెక్కడో విసిరేసినట్లనిపించింది.

చప్పున లత చెయ్యి నా చేతిలో ఇరికించుకున్నాను.

"అబ్బా! చెమటగా వుంది. ఫ్రీగా కూర్చోండి" లత నా చెయ్యి విడిపించుకుంది.

"ఛిస్...." కిసుక్కున వెనక నించి నవ్వు.



ఎవరో పోకిరీ వెధవలు.

—ట్రాజిడీ సినిమా చూసి లేచాం.

నా ట్రాజిడీ ప్రారంభం.

మెయిన్ గేటు బైట పడుతున్నాం.

"మొలలోతు నీళ్ళల్లో మొగ్గల్లే నువ్వుంటే" నా పక్కనే నడుస్తున్న రోగ్.

"నల్లవాడనుకుని చేరదీస్తే...." ఇంకొకడు. నా నల్లరంగు వాడు పసిగట్టినట్టున్నాడు.

వీళ్ళందరి చూపులు లతమీదే.

లత ఇవేం పట్టించుకోటంలేదు. పక్కగోడలమీది వాల్‌పోస్టరు చూస్తూ ముందుకి వెళ్ళిపోతోంది.

బికారి వెధవలా పిల్లాణ్ణి భుజాన వేసుకుని నేను.

"లతా! ఏమిఁటా బరితెగింపు? నాతోపాటు నడవలేవ్?" అలాగని అంతమందిలో ఖేలా అనను?

గేటు బైట పడ్డాం.

రిక్షావాళ్ళు గంటలు వాయిస్తున్నారు.

—"రిక్షా వస్తావా?" అడిగేను.

అప్పటికే ఆ నాయాల చూపులు లతమీద పడిపోయాయి.

అరె! ఆఖరికి ఈ లేబరు వెధవకూడా నా పెళ్ళాంమీదే కన్ను!

వాడి కళ్ళలో కొరివి పెట్టాలనిపించింది.

"నిన్నే అడిగేది" తమాయించుకొని గద్దించాను.

"ఎక్కడికి బాబూ?" తడువుఁకుంటూ చూసేడు వాడు.

చెప్పాను.

బేరం సాగింది.

ఎక్కాం.

చాలాసేపు నాకూ లతకూ మాటల్లేవు. ఆ తర్వాత ఒక చిరాకైన మూలుగు మూలిగాను.

అర్ధరాత్రి ఒంటి గంటయింది ఆ రోజు నా ట్రాజిడీ ఓ కొలిక్కి వచ్చేసరికి.

" " "

"ఇంత పొద్దుపోయి ఎక్కణ్ణించి వస్తున్నావ్ లతా?"

"అమ్మాయి స్కూలు హెడ్మాష్టారింటికెళ్ళి"

"ఎందుకు?"

"ఎల్లుండీ స్కూల్లో యానివర్సరీ ఫంక్షనట. మన అమ్మాయి, మాస్టారి పాప కలిసి డాన్సు చెయ్యాలని ఆయన చాలా ముచ్చట పడుతున్నారు. ప్లేబాక్ నేనే" ఖుషీగా చెప్పింది లత.

"అందుకని" నాకేం తోచలేదు.

"ప్రాక్టీసుకి వెళ్ళొస్తున్నా" లత.

నా ఒంటినిండా పాములూ, మండ్రకప్పలు పాకుతున్నట్టయి పోయింది.

లత ఒక్కతే వెళ్ళటమా?

నా కడుపులో కొరివి పెట్టితిప్పుతున్నట్టయింది.

"లతా" నా గొంతు నా చెవుల్లో మార్మోగింది.

ఏమిటన్నట్టు లత చూసింది.

"....నువ్వొక్కదానివీ వెళ్ళొద్దు. రేపటి నుంచీ నేను ఆఫీసునుంచి వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి వెళ్దాం. సరేనా?'' ఆజ్ఞాపించేను.

"సరే!" తలెగరేసి వెళ్ళింది లత.

ఆ తర్వాతి రోజు లతతో కూడా నేనూ వెళ్ళేను. రోజూ వెళ్తున్నా.

ర ర ర

లత పక్కన ఒక హార్మోనిస్టు, ఒక తబలిస్టు—వాళ్ళిద్దరి కళ్ళూ లత మొహంలో దిగబడి వున్నాయి.

"మధురా నగరిలో చల్లనమ్మ బోకు
దారి విడుము క్రిష్ణా."

కోయిలకీ, కాకికీ మధ్యస్థ స్వరంలో లత గొంతెత్తింది.

మాధ్య మధ్యలో హార్మోనిస్టు లత మీదికి ఒంగి "ఇలా కాదు. అలా" అంటూ కిళ్ళీ గారాల పళ్ళు బైట పెడుతున్నాడు.

హెడ్మాష్టరు లత ముందు కూర్చున్నాడు. ఆయన కళ్ళు కమలాకాయలంత పెద్దవిగా వున్నాయి. అయినా ఆయన కళ్ళలో లత ఇమడనట్టుంది. ఇంకా పెద్దవి చేస్తూ లతనే చూస్తున్నాడు. ఆ మూర్ఖుడి నాలుక మాటి మాటికీ బైటికి వస్తూ పోతూ వుంది.

నేనో మోడామీద కూర్చున్నా—హరికథ పందిట్లో ముసలమ్మలా. లత నా గురించేం పట్టించుకోటంలేదు.

"ఆంటీ ఈ మిరియాల పాలు తీసుకోండి" ఒక తూనీగలాటి పిల్ల వచ్చి గ్లాసు అందించింది లతకి.

"ఆఁ....ఆఁ.... తీసుకోండి....తీసుకోండి" హెడ్మాష్టరు లేచి గ్లాసు తాకబోయాడు.

నా మోడా కింద ఆటంబాంబు ప్రేలినట్టయింది. లేచి ఫుట్‌బాల్‌లా ఆ 'ఎద్దు' మాస్టర్ని తన్నాలనిపించింది. తమాయించుకున్నా.

"ఇంకా పిల్లల్ని పిలుద్దామా?"

"ఇంకో రెండుసార్లు ప్రాక్టీసు చెయ్యనీయండి" లత. ఆ తర్వాత నా కూతురు, ఎద్దు మాస్టరు కూతురు వచ్చి తైతక్కలాడేరు.

ఎప్పుడు లతను జుట్టుపట్టుకు లాక్కుని యింటికిపోదామా అని రెడీగా వున్నాను నేను –

ఇంటి ముఖం పట్టేదాకా నాకు శూలాల మీద కూర్చున్నట్టయింది.

"లతా! ఏవిఁటిది? నీ కసలు సిగ్గుందా?" ఇంటికొచ్చినాక విరుచుకుపడ్డాను.

"ఏవైఁదండీ?'' తాపీగా లత.

"నన్ను ముందుంచుకుని ఆ ఎద్దె మద్దిమాస్టారు గాడితోనూ, గారపళ్ళ హార్మోనిస్టుతోనూ కులాసా చేస్తావా? ఛీ! ఛీ!''

"ఏఁవండి'' లత కఠం పగిలింది.

"ఏం?''

"పెళ్ళయిన దగ్గర్నించీ చూస్తున్నా–అసలు ఏమిటి మీ వుద్దేశం? బజారు తీసికెళ్తే బేజారెత్తిపోతారు. సినిమాకి తీసికెళ్తే సరిగా చూడనివ్వరు. ఏం? సన్నెపరెత్తుకు పోతారనీ?"

"లతా! ఆడదానివి. అంత అహంకారం పనికిరాదు. హద్దుమీరి అరవకు"

"ఏవఁండీ!'' ఈసారి లత కంఠం జీరబోయింది.

లత ఏడుస్తోంది.

"ఇప్పుడే, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటా. మీరూ పిల్లలూ హాయిగా వుండండి. ఇంకో పతివ్రతను వెదికి పెళ్ళి చేసుకోండి. ఆఁ'' అంటూ లత పెరట్లో నూతి దగ్గరకు పరిగెత్తింది. నా మనసు గజగజ లాడింది.

నా లత—నా బంగారు లత నూతిలో దూకుతోంది. అంతా నా అనుమానాలతో లతను పీక్కు తింటున్నా. లతను క్షమాపణ అడుగుతా. లత నిజంగా నిప్పులాంటిదే. ఔను నా మనసే అనుమాన విష వృక్షం.

"లతా! లతా! నూతిలో పడొద్దు లతా! నన్ను క్షమించు లతా!" గొంతు పగిలేట్టు అరిచేను. పెరట్లోకి పరిగెత్తాను.

"ఏవఁండీ! ఏవఁండీ''

మెలకువ వచ్చింది.

నా పక్కనే నైట్ గౌన్‌లో లత శోభనం గదిలో మంచానికి వేళ్ళాడే మల్లెలా.

"కలగన్నట్టున్నారు. ఏమిటి?" లత

"ఆఁ....ఏమిటో! .... ఏమిటో" పైనించి కిందివరకూ లతను చూస్తుండి పోయాను □

కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

కళవిలువ

బి. శాంతారామ్ బి. కాం. (ప్రథమ)
ఎ. ఎన్. ఆర్. కాలేజి, గుడివాడ.

తడబడుతున్న అడుగులతో వడివడిగా నడుస్తున్నాడతను. కళ్ళలో ఆశ, వళ్ళంతా నీరసం. చాలాదూరం నడిచాడేమో నడకవేగం తగ్గి ఓ చోట ఆగాడు. జేబులోవున్న కాగితాన్ని మళ్ళీ ఓ సారి చూసుకున్నాడు. ఆనందంతో కళ్ళు మెరిశాయ్. అతని గమ్యం వచ్చేసింది.

జగన్నాధమూర్తి....
కళాసదన్

ర ర ర

ఇల్లు సులభంగానే దొరికింది. అది ఒక ఎకరం పూలతోటలో ఓ చివర అందంగా కట్టిన ఇల్లు. కాదు. చిన్నసైజు రాజులుండే కోట అంటే బాగుంటుందేమో. ఇంటిపైన పిట్టగోడల చుట్టూ చక్కటి బొమ్మలు అందంగా అమర్చబడ్డాయి. చేతిలో చిత్రాలున్న సంచితో వరండాలోకి అడుగుపెట్టి ఇల్లంతా ఓ సారి కలయచూశాడు. ఆ గృహం పేరుకుతగ్గట్టు కళాత్మకంగా వుంది. ఇంటినిండా బొమ్మలు గోడలచుట్టూ ఓ క్రమపద్ధతిలో అమర్చిన చిత్రపటాలు. వాటిని చూసిన అతనిలోని చిత్రకారుడు స్వర్గదేవతలను భూమ్మీద చూసినంతటి అనుభూతి పొందాడు.

అతని పేరు సంజీవ్. ఓ చిత్రకారుడతను.

"ఎవరూ?" ఓ వ్యక్తి గుమ్మంలో నిల్చుని, దిక్కులు చూస్తున్న సంజీవ్‌ని నొసలు చిట్లించి అడుగుతున్నాడు. సంజీవ్ ఆకారంలో కన్పిస్తున్న బీదతనం ఆ ధనికునికి అసహ్యంగా కన్పించి వుండవచ్చు.


"నమస్కారమండీ! నన్ను రామకృష్ణగారు పంపించారు" అని తనని తాను పరిచయం చేసుకుని ఓ చీటీ ఇచ్చి, ఆయన చదువుకునే లోపలే "నేను బియ్యే పాసయ్యేనండి. బొమ్మలు గీస్తాను...."

"ఏవీ బొమ్మలు చూపించు" సంజీవ్ మాటలు పూర్తికాకముందే అడిగాడు ముప్పయ్యయిదేళ్ళ జగన్నాధమూర్తి.

బొమ్మలు చూసి మళ్ళీ ముఖం చిట్లించాడాయన. ఆయన మనస్ఫూర్తిగా కళాభిమాని కాదని చెప్పేకంటే, సంఘంలో గౌరవం కోసం అలా ప్రాకులాడే మనిషి అని అనడం బాగుంటుంది. చాలామంది ధనవంతులు కళాత్మక వస్తువులకోసం డబ్బు విరజిమ్మి అవి ఇంట్లో పెట్టుకుంటే పెద్ద గొప్పతనం వచ్చినట్టు ఫీలవడం అందరికీ తెలిసిందే. ఆ కోవకు చెందిన పెద్దమనిషే ఈ జగన్నాధమూర్తి.

'బాధ' అనే పదానికి అర్థం తెలియని ఆ పెద్దమనిషికి, వయసులో వున్న ఆ ధనవంతుడికి విషాదం అంటే పరమ అసహ్యం, (అదసలు ఆయన దరిదాపులకి ఇప్పుడప్పుడే రాదు) అందుకే ఆయనకు ఆ బొమ్మలు నచ్చలేదని కచ్చితంగా చెప్పొచ్చు.

"ఏమిటివి? ఇవసలు బొమ్మలేనా? ఇంత అధ్వాన్నంగా వున్నవాటిని నా కెలా చూపిద్దామని తీసుకొచ్చావ్? 'వంగిపోయిన ముసలివాడు', 'విరిగిపోయిన చెట్టు', 'తుఫాను భీభత్సాలూ' ఇవేనా చిత్రాలంటే? ఛీఛీ! ఏవో పిచ్చిపిచ్చి బొమ్మలేసి ప్రతివాడూ చిత్రకారుడి పోజు!" కోపంగా క్రిందకు విసిరేశాడు. "అటు ఆ గోడలకేసి చూడు. ఎంత సుందరమైన చిత్రాలో! శృంగారం కొన్నిటిలో చిందులేస్తుంటే సుందర దృశ్యాలతో కొన్ని ఎంత అందం కలిగిస్తున్నాయో? అవి ప్రపంచ ప్రఖ్యాత



చిత్రకారులవి."

అతని కోపాన్ని గర్వాన్ని చూసిన సంజీవ్ నిజంగా భయపడ్డాడు. "క్షమించండి, నేను ఈ చిత్రాలు కొనమని రాలేదు. మీకు బొమ్మలంటే యిష్టమనీ, ఈ బొమ్మలు చూసి సంతోషించి నాకేదైనా జీవనాధారం చూపిస్తారనీ రామకృష్ణగారు చెప్పి పంపారు. దయచేసి నాకేదైనా పని...."

జగన్నాధమూర్తిలో యింకా కోపం, అసహ్యం తగ్గలేదు. "పనా? నీకా? ముందిక్కడ్నుంచి వెళ్ళు. నీ లాటి దరిద్రపు మొహాల్ని ఒక్క క్షణం చూళ్ళేని నేను, నిన్ను పన్లో పెట్టుకుని రోజంతా చూడలేను" త్రుంచినట్లు మాటలాడి లేచి వెళ్ళిపోయాడు.

సంజీవ్ ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుని ఇంటికేసి బయలుదేరాడు. అతని కళ్ళనిండా విరక్తి నిండిపోయింది. భారంగా నడుస్తున్నాడు.

తలుపునెట్టి ఆ పూరింట్లోకి ప్రవేశించాడు. అంతా చీకటి-అతని బ్రతుకులా. దీపం వెలిగిస్తే వెలగలేదు-వెలుగు లేని అతని కళ్ళలా. పైన ఊడిన తాటాకుల సందుల నుండి వెన్నెల తొంగిచూస్తోంది——కాని భవిష్యత్తులోకి అతని ఆశలు తొంగిచూడటంలేదు. సందడిలేక బిక్కుబిక్కు మంటున్న ఆ ఇంటిని చూస్తేనే తెలుస్తుంది అతను ఒంటరివాడని. ఇప్పటి వరకూ వివరించిన అతని పరిస్థితే చెబుతుంది అతను నిరుద్యోగి అని.

సంజీవ్ తండ్రి కాయకష్టంకేసి, అతన్ని చదివించాడు. అతని సంపాదన తినకుండానే మరణించాడు. (అసలు సంపాదన ఉంటేగా తినడానికి!)

సంజీవ్ చదువు ముగించిన తరువాత కొన్నాళ్ళకు, తన అభిరుచికి తగ్గట్టు పెయింటింగ్ షాపులో పని దొరికింది. జీతం డెభై రూపాయలైనా సంతోషంగా కొన్నాళ్ళు చేశాడు. అతని ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఇప్పుడా షాపులేదు. ఆ షాపు యజమాని పెద్ద ఉద్యోగం వస్తే షాపు ఎత్తేసి వెళ్ళిపోయాడు.

సంజీవ్ కొన్నాళ్ళు దుర్భరంగా రోజులు గడిపాడు. ఆ రోజులలోనే విరక్తి అతన్ని వెంటాడుతూ చివరకు ఈ రోజు జగన్నాధమూర్తి చేసిన పరాభవంతో అతనికి జీవితం

మీద ఆశ నచ్చిపోగా, పూర్తిగా అతన్ని విరక్తి ఆక్రమించుకుంది.

తన అభిరుచికి తగిన ఉద్యోగం దొరుకు తుందని సంజీవ్ చదువునే రోజుల్లో యెన్నో కలలు కన్నాడు.

ఏ కళాకారునికైనా అతని కళలో, అతని స్వంత అనుభవాలే యెక్కువగా కనబడుతా యని అందరికీ తెలిసిందే. సంజీవ్ మనసు ఏ నాడూ సుందరదృశ్యాలవైపు మొగ్గలేదు. అతను గీసిన ఆ పది చిత్రాలూ విషాదపూరిత మైనవే!

తాను గీసిన చిత్రాలన్నిటినీ ఓ సారి చూసు కుని నిట్టూర్చాడు. చాపమీద పడుకుని కళ్ళు తెరిచి, తాటాకుల సందుల్లో నుండి ఆకాశాన్ని, మిణుకు మిణుకుమంటున్న నక్షత్రాల్ని చూస్తు న్నాడు. కళ్ళు నీరసంలో మూతలు పడు తున్నాయి చుక్కల్లాగా. అన్నం వాసన చూసి ఓ వారం రోజులు కావచ్చు.

ఇప్పుడతనిలో ఆశలులేవు. భవిష్యత్తుపై ఊహలు లేవు.

అతను తన జీవితాన్ని మట్టిగా ఉపయో గించి చేసిన బొమ్మల్లాంటి ఆ చిత్రాలు అతన్ని చూసి సానుభూతిగా ఏడుస్తున్నాయి. ఒక చిత్రంలో సూర్యోదయాన్ని, భయంకరంగా కూలిపోయిన చెట్లమధ్య చూపించాడు. సృష్టి లోని సుఖదుఃఖాలకు ఆ చిత్రంలోని ఆ రెండు దృశ్యాలు ప్రతినిధులేమో! అన్ని చిత్రాల్లోనూ విషాదం తప్పకుండా తొంగిచూస్తుంది. అవి అతని జీవితానికి దర్పణాలు. అతని కళ్ళలో కొరవడిన జీవం ఆతని చిత్రాలలో కనబడు తుంది. చురుకుదనం లేని ఆతని కళ్ళను ప్రక్కకునెట్టి అతని కళాహృదయం కళ్ళు తెరవగా; హృదయస్పందనలు గీతలుగా మారు తున్నాయేమో! రంగులు కొనలేని ఆ బీద కళా కారుడు తన రక్తాన్ని రంగుగా పోశాడేమో అన్నట్లు అ చిత్రాలు గోచరిస్తాయి.

ఆ యువకుడి జీవనానికి చదువు, కళ రెండు తోడ్పడలేకపోయాయి.

సంజీవ్ కళ్ళు అప్రయత్నంగా మూసు కున్నాయి నిద్ర వచ్చి. మళ్ళీ అతను కళ్ళు తెరవలేదు.

$ $ $

కాలగర్భంలో చాలా సంవత్సరాలు శిధిల మయ్యాయి. క్రొత్తమార్పులు ప్రపంచంలో ఉదయించాయి. మానవుడు యింకా నాగరికు డయ్యాడు.

స్థలం: కళాసదన్. అందులో ఓ శతవృద్ధుడు గోడకు క్రొత్తగా తగిలించిన చిత్రాలకేసి చూస్తున్నాడు. చాలా కాలం క్రితం వేసినట్లు న్నాయి. రంగులు నిండుగాలేవు. అవి 'విరిగిన చెట్లు'; 'వంగిపోయిన వృద్ధుడు'; 'రెక్కలు తెగిన పక్షి'; 'తుఫాను దృశ్యం' మొదలైన రకరకాల చిత్రాలు. అవి సంజీవ్ చిత్రాలే! ఆ వృద్ధుడు జగన్నాధమూర్తే! ఇప్పుడతని వృద్ధాప్యంలో అవి చాలా అందంగా కన్పి స్తున్నాయ్! ఏవో సత్యాలు చెబుతున్నాయ్!

ఒకానొకప్పుడు ఆ వ్యక్తిచేత విసిరేయ బడ్డ చిత్రాలు, ఇప్పుడతని ఇంటిలో ప్రత్యేక మైన గదిలో వ్రేలాడుతున్నాయి. ఆ వ్యక్తి వాటిని ఓ మ్యూజియంలో ఆ మధ్యనే రెండు లక్షలకు కొన్నాడు; చాలామంది పోటీలుపడి ధరపెంచగా! అది కళాభిమానం కాదని మళ్ళీ చెప్పాలా? రెండు లక్షలతో ఆ చిత్రాలు కొన్నం దుకు సంఘంలో చాలా 'ప్రెస్టేజ్' సంపా దించుకున్నాడు.

ఆ చిత్రాకారుడి హృదయం నుండి సూటిగా వెలువడ్డ ఆ చిత్రాలు; అతని రక్తంతో రంగులు దిద్దుకున్న ఆ చిత్రాలు; ఆ నాడతన్ని కళాకారునిగా గౌరవించకపోయినా కనీసం అతన్ని ఓ మనిషిగానైనా నిలబెట్టలేకపోయిన 'ఆనాటి' జగన్నాధమూర్తి' లాంటి వారిని నేడు వెక్కిరిస్తున్నాయి.

సీరియల్



శేఖరం తల్లికి వందరూపాయల కాగితం యిచ్చేడు మీరా జీతం నిమిత్తం.

శాంతమ్మగారు వచ్చేనెలనించి ఎలాగూ యివ్వడలుచుకుంది. శేఖరం ఒక్క నెలకేమిటి? అనేసరికి ఆవిడేం అభ్యంతరం చెప్పలేదు. కాని మీరా వందరూపాయలు తీసుకోవడానికి నిరాక

రించింది. శాంతమ్మగారు నాలుగయిదుసార్లు చెప్పినా మీరా వినలేదు "అప్పుడు నేను మానేస్తా ననడం జీతంకోసం అనుకున్నారు మీరు—మీరు నన్ను అర్థం చేసుకోలేదు" అంది.

"దానికోసం కాదు. అబ్బాయే యిచ్చేడు. వాడు అనవసరంగా ఏ పనీ చేయడు" అందావిడ. ఇంక మీరా ఏం మాట్లాడలేదు.

శాంతమ్మగారు లేనప్పుడు మీరా శేఖరం గదిలోకి వచ్చింది.

ఇరవైరూపాయలు అక్కడ పెట్టింది.

ఏదో రాసుకుంటున్న శేఖరం తలెత్తి చూశాడు.

"ఏమిటవి?" అని అడిగాడు.

"ఇరవై రూపాయలు."

"ఎందుకూ?"

"నాకు ఇవ్వవలసినవి ఎనభై."

శేఖరానికి అర్థమయిపోయింది. అతను రాస్తున్న కాగితాలు అలాగే వదిలి కుర్చీలో వెనక్కి జార్లబడుతూ అన్నాడు "అమ్మకి ఇచ్చెయ్యి! నా కెందుకూ?"

అప్పటికి గుమ్మంవరకూ వెళ్ళిన మీరా ఆగి మెడ వెనక్కి తిప్పి అంది: "ఇచ్చింది మీరని అమ్మగారు చెప్పారు—ఆవిడకి ఎలా ఇస్తాను?"

శేఖరం కుర్చీలోంచి లేచాడు. ఇంకా యెక్కువ ఇవ్వాలని వున్నా మీరా అపార్థం చేసుకుంటుందని వూరుకున్నాడు. ఇరవైరూపాయలంటే ఎలాంటి ఆరాలు రావు. అయినా తను వచ్చినరోజు మీరా రావటానికి కుదరదు మానేస్తానన్నప్పుడు తల్లి జీతం పెంచుతాననడం విన్నాడు. అందుకే ధైర్యంచేసి తల్లికి యిచ్చేడు.

అమ్మ తను యిచ్చినట్లు యెందుకు చెప్పిందో! అనుకున్నాడు.

మీరా వెళ్ళబోతోంటే శేఖరం "మీరా, ఆగు" అన్నాడు సాధ్యమయినంత మృదువుగా.

మీరా ఆగిపోయింది—వెనక్కి తిరిగి చూడలేదు.

ఈ విషయం యెలా చెప్తే బాగుంటుందో అతనికి తోచలేదు.

'అమ్మ నీకు జీతం పెంచుతానందిగా' ఉఁహుఁ! అలా అనలేదు. 'జీతం' అనేమాట తను అనలేదు. మరి ఏమని చెప్పాలి....

"అమ్మ నేను ఇచ్చేనని చెప్పిందా!" అన్నాడు చివరికి.

"అవును" వెంటనే అంది మీరా.

"అదే అమ్మ యిస్తే తీసుకొనేదానివి కదూ!"


"ఎవరిచ్చినా-అనవసరంగా ఒకరి నుండి తీసుకొనే అలవాటు లేదు."

"మొదట అమ్మ ఒకత్తేనేగా!....యిప్పుడు అదనంగా నేను వున్నాను—అరుణ వస్తుంది........"

మీరా మనస్సు కస్సుమంది—అదే భావంతో చురుగ్గా అతనికేసి చూసింది. 'ఛీ' కొన్న చూపుల్ని అతను తప్పించుకోవడానికి క్షణంలో సగంసేపు చూపులు మళ్ళించుకొని మళ్ళీ మీరాకేసి చూస్తూ ఏదో అనబోయాడు.

మీరా యిలా అంది, "అరుణకి చేసిన చాకిరీకి—అరుణ దగ్గర వసూలు చేసుకుంటాను. అమ్మగారింటికి—ఎవరో ఒకరు వచ్చిపోతూనే వుండచ్చు—అది నాకు అనవసరం" అనేసి వెళ్ళిపోయింది,

నిర్విణ్ణుడయినట్లు అలాగే వుండిపోయాడు శేఖరం.



తను ఏమని యిచ్చేడు—మీరా ఏమనుకుంది? అమ్మగారింటికి—వచ్చేవాళ్ళల్లో—తనూ ఒకడు....హుఁ....

* * *

వారం రోజులు గడిచిపోయినాయి.

ఈ వారం రోజుల్లో చాలా అత్యవసరం అయితే తప్ప శేఖరం మీరాని పలకరించేవాడు కాదు—రెండు రోజులనుండి శాంతమ్మగారు మామూలుగా తిరుగుతోంది. దాంతో మీరాకి కొంత సమస్య తగ్గింది. నేరుగా శేఖరం వచ్చి "నాకు టీ కావాలి" అన్నప్పుడు మీరా మనసు ఎదురు తిరుగుతుంది. శాంతమ్మగారి ద్వారా చేయటం అది వేరే సంగతి.

శాంతమ్మగారు రాయించిన ఉత్తరానికి అన్నపూర్ణమ్మగారు ముహూర్తం పెట్టించి, ఆ రోజున తీసుకెళ్ళవలసిందిగా రాయించింది.

శ్రీమంతం అయిదో నెలలోనే జరిపారు. ఇప్పుడు తొమ్మిదో మాసం వచ్చింది అరుణకి. అయినా ఊరికే తీసుకురావటం ఎందుకని శాంతమ్మగారు ఎవరినేనా మనిషిని చూడమని చెప్పింది శేఖరానికి మిఠాయి అదీ చేయించడానికి. మరీ కొద్దిగా పంపితే బాగుండదు. రెండు వీశలన్నా పంపాలని ఆవిడ అభిప్రాయం. పెద్ద పెద్దవి రెండు అరటి గెలలు ముగ్గేయించి వుంచింది.

పెళ్ళిళ్ళకి వాటికి మిఠాయి, జిలేబీ వగైరాలు చేసే అంజన్న ఊళ్ళో లేడు. ఇంకో అతను అచ్చన్న అని వున్నాడు. అతనంత బాగా చేయడు. అయినా ఇంకెవరూ లేరు. అతని కోసం కబురు చేశారు. అతను నాలుగు రోజుల్నుంచీ జ్వరంతో బాధపడుతున్నాడని వెళ్ళిన మనిషి కబురు తీసుకొచ్చేడు.

శేఖరం ఏమేమి—ఎంతెంత తీసుకెళ్ళాలో చెప్తే బజారునుండి తెస్తానని లేకపోతే అక్కడే కొంటానని తల్లికి చెప్పేడు. అది ఆవిడకి నచ్చలేదు. తన చేతులతో తను చేసి ఇచ్చే ఓపిక ఎలాగూ లేదు. దగ్గరుండి యింట్లో చేయించయినా ఇస్తే అదో తృప్తి.

శేఖరం శాంతమ్మగారూ మాట్లాడుకొనే మాటలూ—నాళ్ళ మనిషికోసం చేసే ప్రయత్నం

—మనిషి దొరక్క ఆవిడ నిరుత్సాహపడడం అన్నీ మీరాకి తెలుసు. ఆఖరికి వూరుకోలేక శేఖరం అక్కడ లేనప్పుడు శాంతమ్మగారితో అంది. "నాకు అంత బాగా రాదుగాని మీరు దగ్గరుండి చెప్తే నేను చేస్తానమ్మా!"

"నువ్వా!" ఆవిడ ఆశ్చర్యపోయింది. "నీకు చేతనవునా?" అని, "అయినా అంత నువ్వొక్కదానివీ చేయద్దూ!" అంది.

"ఫరవాలేదు. చేయగల్ను. మీరు దగ్గరుండి చూపించండి. మీరంత సరదాపడుతున్నారు. మైసూరుపాకం అయితే నేనే చేస్తాను" అంది.

మీరా అలా చేస్తానన్నందుకు ఆవిడకి సంతోషంగానే వుంది. కాని ఒక్కతే చేయాలి. తనేం ఆసరా చేయలేదు అనుకుని "మూడుశేర్ల పిండి మిఠాయి చేయాలి మీరా! మరి...."

మధ్యలోనే అంది మీరా "ఫరవాలేదమ్మా! చేస్తాను."

మీరా స్థానంలో ఇంకోరు ఇంకోరయితే శాంతమ్మగారు మొదటే చెప్పునేమో! మీరాని వంటమనిషి అని ఆవిడెప్పుడూ అనుకోదు. ఎందుకో ఆవిడకలా అనిపించటంలేదు. 'మీరా చదువూ, సంస్కారం వున్నదానిలానే వుంటుంది. ఏం చదువుకోకపోతేనేం! చదువుకున్నవాళ్ళకున్న చదువుకోని మీరా వినయ విధేయతలు మీరాని గౌరవించేలా—అభిమానించేలా చేస్తాయి' ఆవిడ ఎన్నోసార్లు అనుకుంది.

మీరా చేస్తానందని శేఖరానికి చెప్తే అతను క్షణం తెల్లబోయి, "ఈ తిప్పలన్నీ ఎందుకమ్మా! అక్కడ కొనడం యిష్టం లేకపోతే యిక్కడే కొని తీసుకెళ్తాను" అన్నాడు.

"ఎందుకురా! నేను చెప్పకుండా తనే చేస్తానంది" అందావిడ.

శేఖరం యింకేమీ అనలేదు. మీరా, అరుణల స్నేహం ఎలాంటిదో అతనికి తెలియందేమీ కాదు. ఆ స్నేహభావంతోనే మీరా ధైర్యంగా ముందుకొచ్చి వుంటుంది....

* * *

మీరా ఇంటికొచ్చేసరికి ఏడు గంటలు దాటింది. నిజంగా మీరా ఆ పూట బాగా అలిసిపోయింది.

"ఈ రోజింత ఆలస్యమయిందేం?" అని శాంతమ్మ అడిగింది.

"వాళ్ళ బాబు పడ్డాడు—దెబ్బ తగిలింది. వాళ్ళ పనిమనిషి దుకాణం వరకూ దిగబెట్టింది" అంది మీరా. ఎప్పుడేనా ఆలస్యమయినప్పుడు ఆవిడలా—అడగటం—అప్పటికి తోచిందేదో మీరా చెప్పడం మామూలే.

రోజులా వస్తూనే విజయ్‌ని ఎత్తుకోలేదు మీరా. వాడు చంకన ఎక్కేడంటే ఓ పట్టాన దిగడు. పొయ్యి దగ్గర కూర్చుని కూర్చుని వచ్చిందేమో చిరాగ్గా వుంది మీరాకి. రెండు చెంబులు నీళ్ళు పోసుకుంటే తేలిగ్గా వుంటుందని వస్తూనే బాత్రూంలోకి వెళ్ళిపోయింది.

మీరా గదిలోకి రాగానే "ఆ, ఆ" అంటూ, ఉయ్యాల్లోంచి గొడవ మొదలెట్టేడు విజయ్—మీరా కావాలని వాడి కేసి చూడకుండా గూడు దగ్గరకి వెళ్ళింది—బొట్టు పెట్టుకోవటానికి.

విజయ్—కాస్సేపు "దా, దా" అని, మరి కాస్సేపు "ఆఁ" అంటూ పెద్ద దీర్ఘం తీసి అల్లరి చేసేడు. విజయ్ ఏం చేస్తాడో చూద్దామని మీరా అక్కడే నిలబడిపోయింది వాడికేసి చూడకుండా.

"మామ్—మామ్" అని వొక్కసారిగా "అంమ్మా!" అని ఘనకార్యం చేసినట్లు కిలకిల నవ్వాడు.

మీరా చివ్వున ఇటు తిరిగింది. ఆశ్చర్యంతో—అనిర్వచనీయమైన భావంతో ఉక్కిరిబిక్కిరయింది మీరా.

"అమ్మ—మామ్...." విజయ్ మీరాకేసి చూసి కిలకిల నవ్వేడు.

మీరా—ఒక్కంగలో ఉయ్యాల ధగ్గర కొచ్చింది. ఏదో అనాలనుకొంది. పెదాలు అదిరాయి—చేతులు కంపించాయి....వణుకుతున్న చేతులతో విజయ్‌ని చేతుల్లోకి తీసుకుని—ఒక్కసారిగా హృదయానికి హత్తుకుంది. "అమ్మ! అమ్మా అని పిల్చేవా? నీకు నేను అమ్మనురా!.... నీకు నేను అమ్మనని ఎవరు—ఎవరు చెప్పారు, విజయ్! ఊఁ...." విజయ్ ఒళ్ళంతా ఆప్యాయంగా నిమురుతూ ఏవేవో మాట్లాడుతున్న మీరా కంఠం వణికింది. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "ఒక్కసారి—ఒక్కసారన్నా అమ్మగా నేను నీకు జోలపాడి ఎరుగను—నువ్వు నన్ను "అమ్మా" అని పిలిచిన తరుణంలో కూడా గొంతెత్తి జోలపాడలేని అశక్తురాలిని—దురదృష్టవంతురాలిని విజయ్! ఇదే నీకు జోల—నా మాటలే నీకు జోలపాటరా, విజయ్....విజయ్ వొళ్ళంతా మాతృప్రేమతో నిమురుతూ తన మనసులో ఆవేదనంతా వాడితో చెప్పుకుంటోంది మీరా.

మీరా మాటలన్నీ అర్థమయినట్లుగా వింటూ 'ఊఁ,ఆఁ' అంటున్నాడు విజయ్.

విజయ్‌కి నడకంత చురుగ్గా మాటలు రాలేదు. నాలుగు రోజులనుండి "మామ్—మామ్" అని; తెగ అవస్థపడుతున్నాడు "అమ్మా" అని అనటానికి.

విజయ్‌ని గట్టిగా హృదయానికి హత్తుకోవటానికి భయం! గట్టిగా మాట్లాడాలంటే భయం! విజయ్ ఎప్పుడేనా పడుకోకుండా గొడవ చేసినప్పుడు జోలపాడి నిద్ర పుచ్చాలని మనసు ఆరాటపడేది—అయినా ఉగ్గబెట్టుకుని వూరుకొనేది. ఏ పెళ్ళిళ్ళకో—జాతరకో—రికార్డులు వేసినప్పుడు—జోలపాట వస్తే విజయ్‌ని ఉయ్యాల్లో పడుకోబెట్టి ఊపేది. అక్కడికి దగ్గర్లోనే వున్న పూజార్లకి పిల్లలు లేకపోవడంవల్ల వాళ్ళకి పిల్లలంటే సరదాకొద్దీ ఓసారి వదినగారి కూతుర్నీ—ఇంకోసారి అక్కగారి కూతుర్నీ—బిడ్డ పుట్టి మూడోనెల రాగానే తీసుకొచ్చి, నెలరోజులపాటు ఉంచుకున్నారు. రాత్రిళ్ళు పూజార్లావిడ ఆ చంటిబిడ్డకి జోల పాడుతోంటే—విజయ్ నిద్రపోతున్నా యాంత్రికంగా వుయ్యాల ఊపేది మీరా.

ఆ రాత్రి విజయ్‌ని పక్కలో పడుకోబెట్టుకొని మీరా విజయ్‌కి అర్థంకావనే ఊహ లేకుండా ఏవేవో చెప్తూనే వుంది. అవి:—విజయ్ పెద్దయ్యాక ఎలా నడుచుకోవాలో—ఎంత ధైర్యంగా నిబ్బరంగా మసులుకోవాలో—ఇంకా ఇలాగే చాలా చాలా చెప్తోంది. ఇవేమీ తెలియని విజయ్ తల్లి పక్కలో—నోట్లో వేలేసుకుని నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

* * *

శాంతమ్మగారు మీరా చేత అరుణకి పంపవలసినవి అన్నీ సర్దించింది.

శేఖరం ఎన్నింటికి బయలుదేరుతాడో ఏమోనని వంట కూడా తొందరగా చేయమంది. మీరా అలాగే చేసింది.

ఉదయం పది గంటలు కావస్తోంది. శేఖరం యెక్కడికి వెళ్ళాడో అప్పుడే వచ్చేడు.

"భోజనం చేసేస్తావేమిట్రా!" అని అడిగింది శాంతమ్మగారు.

"అప్పుడేనా!....నాకు టీ కావాలి" అన్నాడు.

శాంతమ్మగారు మీరాకి చెప్పి వచ్చింది.

శేఖరం తల్లి పక్కనే కూర్చుని మాట్లాడుతున్నాడు.

ఇంతలో "టెలిగ్రాం సార్" అని వినిపించింది.

శేఖరం లేచి వెళ్ళాడు. శాంతమ్మగారు ఖంగారుగా లేచివచ్చింది.

అప్పుడే టీ పట్టుకొచ్చిన మీరా టీ కప్పు అలా పట్టుకునే గుమ్మం వరకూ వచ్చింది.

శేఖరం సంతకంచేసి టెలిగ్రాం తీసుకున్నాడు.

అది చదువుతుంటె అతని కనుబొమలు ముడిపడ్డాయి—

"ఎక్కడనించిరా" ఆదుర్దాగా అడిగింది శాంతమ్మగారు. శేఖరం సమాధానం చెప్పక పోవటంతో కొడుకు దగ్గరగా వచ్చి, "ఎక్కడనించిరా బాబూ! మాట్లాడవేం" అంది మళ్ళీ.

"ఏదో—మా పనుల గురించిలే! బొంబాయి నుండి" అంటూ చెప్పులేసుకున్నాడు.

"టీ తీసుకుని వెళ్ళు."

"ఇప్పుడే వస్తా—రెడ్డి దగ్గరకెళ్ళాలి" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.

అది రాజేంద్ర యిచ్చిన టెలిగ్రాం. 'అర్జంటుగా పాతికవేలు—శేఖరాన్నే తీసుకురమ్మన్ని యిచ్చేడు. ఇంత కొంప మునిగిందేమిటో శేఖరానికి యెంత ఆలోచించినా అర్థంకాలేదు.

రాఘవరెడ్డి దగ్గరకెళ్ళి టెలిగ్రాం అతని చేతికి ఇచ్చేడు.

"ఏం చేద్దామంటావ్" అన్నాడు రెడ్డి ఆలోచనగా.

"సంగతేమిటో నాకు తెలియదు. కావాలి తప్పదు. టైము కూడా ఆట్టేలేదు. ఈ రోజు ప్రయాణం ఆగటానికి వీలులేదు" అన్నాడు శేఖరం.

ఇద్దరూ కాస్సేపు మౌనంగా వుండిపోయారు.

"చూద్దాం! సాధ్యమైనంతవరకూ ఈ పూటే బయలుదేరుదువుగాని. రేపు రాత్రి బండికి గదా అరుణని తీసుకువచ్చేది? రేపు సాయంత్రం లోగా నువ్వక్కడికి వెళ్తే చాలు...."

"అరుణ సంగతి సరే! ముందు అన్నయ్య సంగతి అర్జంటు."

"ఆలస్యమైతే యిద్దరం టాక్సీలో వెళదాం" అన్నాడు రాఘవరెడ్డి.

సాయంత్రం అయిదు గంటలవుతుండగా వచ్చేడు శేఖరం.

ఇంటి దగ్గర శాంతమ్మగారు కంగారుపడుతూ కూర్చుంది. ప్రయాణం ఎందుకాగిపోయిందో అర్థంకాలేదు. రేపు వెళ్ళకపోతే వాళ్ళేమనుకుంటారో! అయినా అరుణకి తొమ్మిదో మాసం వచ్చి అప్పుడే వారం కావస్తోంది. ఏడోనెలలో పంపమంటే వాళ్ళు పంపలేదు. ఇంకా ఆలస్యమైతే దూరప్రయాణం కష్టం.

ఆవిడ భోజనం కూడా చేయకుండా కూర్చుంది.

ఇంటికి వచ్చేక తల్లిని చూసి అప్పుడు అనుకున్నాడు శేఖరం తను కబురు చేయవలసిందని. అతనికామాటే తోచలేదు.

"ఏమిట్రా బాబూ! ఈ రోజు ప్రయాణం లేదా?" అని అడిగింది.

"లేకపోవడం ఏమిటి? ఓ గంటలో బయలుదేరుతున్నాం,"

"బస్సులో వెడతావా? దానికి కూడా టైము అయిపోయిందేమో" సందేహంగా అడిగింది.

"బస్సులో కాదు; టాక్సీలో వెళ్తున్నాం. రెడ్డి కూడా వస్తున్నాడు."

"నువ్వేదో పని అంటున్నావు! పాపని రేపేనా తీసుకురావటం! ఆవిడ చాదస్తం మనిషి. ఆవిడ పెట్టిన ముహూర్తానికి తీసుకురాకపోతే...."

మధ్యలోనే అన్నాడు శేఖరం "రేపే అరుణని తీసుకొస్తాను. ఇంకా మా పని కాకపోతే రెడ్డి చూసుకుంటాడు. అందుకే అతను కూడా వస్తున్నాడు"

"కాళ్ళు కడుక్కురా భోజనం చేద్దువుగాని."


"వద్దమ్మా! ఇప్పుడు భోజనం చేయలేను."

"మధ్యాన్నం కూడా చేయలేదు. ఇప్పుడు కూడా తినకపోతే ఎలాగరా బాబూ!"

"దార్లో ఏదేనా తింటాలేమ్మా!" అన్నాడు.

"దార్లో యెప్పుడో తింటావ్లు! వుండు పూరీలన్నా చేయమంటాను"అంటూ లేచిందావిడ.

తాగుబోతు అప్పుల శావమ్మ-తాగుబోతప్పుల షావమ్మీ!



శేఖరం వద్దు టైము అయిపోతోందన్నా ఆవిడ వినలేదు.

మీరా పూరీలు చేసేసరికి శాంతమ్మగారు కూర తరిగి సిద్ధంగా వుంచింది. అర్ధగంటకి వేడివేడి పూరీలు కూరా సిద్ధంగా వున్నాయి.

శాంతమ్మగారు వచ్చి శేఖరాన్ని పిల్చింది. "రెడ్డి వస్తాడు రానీ" అన్నాడు.

రాఘవరెడ్డి వచ్చేడు.

పళ్ళాలలో సర్దమని శేఖరమే తీసుకెళ్ళాడు. వెళ్తూ తల్లితో అన్నాడు "టీ కలిపి వుంచితే నేను వచ్చి తీసుకెళ్తాను."

తర్వాత వచ్చి టీ తీసుకెళ్ళాడు.

"బ్రతికాను" అనుకుంది మీరా. శాంతమ్మగారు తనని పెట్టమంటుందేమోనని భయపడింది మీరా.

ఇలాంటివేం ఆలోచించకుండా గుడ్డిగా చేరింది తను. ఎవరో ఒకరు రాకుండా వుంటారా! ఇలాంటి ఆలోచనే కలగలేదేం?

§ § §

శేఖరం ఒక్కసారి పిలవగానే తలుపులు తెరుచుకున్నాయి.

రాజేంద్ర కళ్ళు ఎర్రగా వాచివున్నాయి—జుట్టు రేగివుంది—నిద్రలేకో, ఏమో కళ్ళు ఎర్రగా కనురెప్పలు బరువుగా వున్నాయి.

శేఖరం వెనకాలే రాఘవరెడ్డి రావటం చూసిన రాజేంద్ర క్షణంలో సగంసేపు తెల్లపోయాడు. వెంటనే తేరుకుని రెండు చేతులూ చాచి రాఘవరెడ్డి రెండు భుజాలమీదా వేసి దగ్గరకి తీసుకున్నాడు మౌనంగా.

బలరామరెడ్డి పోయాక రాజేంద్ర వెళ్ళలేదు. వాళ్ళనెవళ్ళనీ చూడలేదు. రాఘవరెడ్డి కోటేశ్వరరావుగారితో వ్యవహారం తేల్చుకోవటానికి వచ్చినప్పుడు రాజేంద్ర ఊళ్ళోలేడు. ఇప్పుడింత డబ్బు కావాలని ధైర్యంగా తమ్ముడికి రాశాడంటే రాఘవరెడ్డిని కూడా దృష్టిలో ఉంచుకునే! కాని అతను కూడా వస్తాడని రాజేంద్ర వూహించలేదు.

రాజేంద్ర కళ్ళల్లో గిర్రున తిరిగాయి.

రాఘవరెడ్డి రాజేంద్ర పట్టునుండి నెమ్మదిగా విడిపించుకుని, రాజేంద్ర చేయి పట్టుకుని సోఫాకేసి నడిచాడు.

అయిదు నిముషాలు మౌనంగా గడిచిపోయినాయి.

కుసుమకి వీళ్ళు వచ్చినట్టు తెలిసినా ధైర్యం చాలక యివతలకి రాలేదు. వీళ్ళని పలకరించలేదు. శేఖరం కూడా లోపలకి వెళ్ళలేదు.

ముగ్గురూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మధ్యలో రాజేంద్ర లోపలకెళ్ళి ముగ్గురికీ కాఫీ పట్టుకొచ్చేడు. ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు.

ర ర ర

రత్న, రమేష్ దూర దూరంగా తిరుగుతున్నారు. శేఖరం, రెడ్డి పిలిచినా వాళ్ళు భయం భయంగా చూశారు.

రెండురోజుల నుండి రాజేంద్ర రౌద్రావతారానికి వాళ్ళు హడలెత్తిపోతున్నారు. రాజేంద్ర ఇటువస్తే అటు అటువస్తే యిటూ తప్పుకు తిరుగుతున్నారు. నిజానికి రాజేంద్ర వాళ్ళని పల్లెత్తు మాటనలేదు. వాళ్ళకేసి కోపంగా కూడా చూడలేదు. కాని, యెప్పట్లా ముద్దుగా దగ్గరికి తీసుకోలేదు.

కోపంలోవున్న ఆ మూర్తిని చూసేసరికి వాళ్ళకి హడలెత్తింది.

కుసుమకి తిక్కగా—తలకొట్టేసినట్టుగా వుంది. శేఖరం సహాయం తనకెన్నడూ రాదనుకుంది. అతనితో మాట్లాడవలసిన అవసరమే తనకి లేదనుకుంది ఒకనాడు. కాని యిప్పుడు అతడే గతి అయినాడు. అతనెదుటికి రావాలంటేనే ఏదో భయంగా వుంది. అదివరకులా ఎదురుపడితే స్నేహం తిప్పుకుని యిప్పుడు వెళ్ళలేదు; అని మాట్లాడించలేదు. అభిమానం అడ్డువస్తోంది.

శేఖరం ఆవిడని పలకరించలేదు. ఎప్పటిలా మామూలుగా తిరుగుతున్నాడు. దాంతో కొంచెం రోషం ఎక్కువయింది కుసుమకి. "తనే కదా పెద్ద వుపకారం చేసేనని—అహంకారం. ఇలాంటి వాళ్ళ దగ్గర చిన్నమెత్తు వుపకారం కూడా పొందకూడదు" కసిగా అనుకుంది.

తొమ్మిది గంటలయేసరికి శేఖరం, రెడ్డి స్నానాలు చేసి తయారయారు.

"అప్పుడే యెక్కడికి తయారయారు!" అని అడిగాడు రాజేంద్ర. అతని మనసిప్పుడు యెంతో తేలిగ్గా వుంది. అతనికి జ్ఞానోదయం కూడా అయింది. స్వతహాగా, చిన్నప్పటి నుంచీ వుండే నిర్లక్ష్యభావం కూడా మాసిపోయింది. తల్లిచాటు బిడ్డలాగే పెరిగిగా శేఖరం పినతల్లి సంరక్షణలో పెరిగి యెలా ప్రయోజకుడయ్యాడో-ఆవిడనీ ఆవిడ మాటలనీ లక్ష్యపెట్టక నిర్లక్ష్యమైన తన స్వభావం—దానికి నీరుపోసి మంచి మంచి ఎరువులు వేసి కుసుమ వృద్ధిచేయడం—యివన్నీ హఠాత్తుగా కళ్ళముందు మెదిలి—రెండు రోజుల క్రితమే అతనికి జ్ఞానోదయమయింది.

శేఖరం తల దువ్వుకుంటూ సమాధానం యిచ్చేడు. "ఈ రోజు అరుణని తీసుకెళ్ళాలి. వాళ్ళకోసారి కనిపించద్దూ! లేకపోతే రాలేదనుకుంటారు."

అరుణకి ఎన్నో మాసమో అతనికి తెలియదు. ఒకవేళ విన్నాడో సరిగా గుర్తులేదు. 'తను వెళ్ళిందెప్పుడు? అరుణా, మూర్తీ రెండు మూడుసార్లు వచ్చేరు. ఒకసారి బజార్లో అరుణ బావగారు కలిసి యింటికి తీసుకెళ్ళాడు. అరుణ యెంత సంబరపడిందీ? ఎంత హడావిడి చేసింది....'

"మేమలా వెళ్ళొస్తాం అన్నయ్యా" అన్నాడు శేఖరం.

"ఆఁ బ్యాంక్‌నుండి అలా వస్తాను" అన్నాడు రాజేంద్ర.

శేఖరం, రెడ్డి వెళ్ళిపోయారు.

వాళ్ళలా వెళ్ళగానే భార్యమీద విరుచుకుపడ్డాడు రాజేంద్ర. "నీకీ జన్మకు బుద్ధిరాదు. వాళ్ళనొక్కసారి పలకరిద్దామన్న జ్ఞానం లేకపోయాక ఇంకెందుకూ?"

"బ్రతకటం అనవసరమంటారా? దండగంటారా!" తన మామూలు ధోరణిలో అంది కుసుమ. అసలే ఉడికిపోతోంది.

"ఛీ! ఛీ! ఇంకా బుద్ధి రాలేదూ? నా వాళ్ళూ నా వాళ్ళూ అంటూ మిడిసిపడ్డావు. చేసేడుగా! బాగా బుద్ధివచ్చేటట్టు చేసేడు—అయితే ఏంలే! నా కళ్ళు తెరిపించేడు."

కుసుమకి గొంతువరకూ వచ్చింది కోపం. ఎప్పుడూ యెంతో సునాయాసంగా తడుముకోకుండా మాట్లాడే కుసుమ యిప్పుడు చప్పున యేమీ మాట్లాడలేకపోయింది. విసురుగా అక్కడనించి వెళ్ళిపోయింది.

రత్న, రమేష్ హాల్లోకి పరుగెత్తి బల్లుల్లా గోడకి అతుక్కున్నట్లుగా నిలబడ్డారు భయంతో కళ్ళు వెడల్పు చేసుకుని.

శర్మమీద కుసుమకి చాలా కోపంగానే వుంది. 'వాడి మూలంగానే తనింత లోకువయిపోయింది'! అని బాధపడింది. రాజేంద్రకి తెలియకుండా అక్కగారికి టెలిగ్రాం యిప్పించింది. శర్మ చేసిన పని—వెంటనే వచ్చి రత్నని తీసుకెళ్ళమని. వాళ్ళు వస్తారని కుసుమకి నమ్మకంలేదు. నాలుగురోజులు సద్దుమణిగాక తనే రత్నని దించి నాలుగు దులిపి రావాలనుకొంటోంది.

మనసులో కూడా శర్మకి తనిచ్చిన లోకువేనని ఒప్పుకోదు కుసుమ. ఏమో! వాడిలా చేస్తాడని కలగందా? పోనీ ఏదో బాగుపడతాడు ఆ పెద్దకుటుంబానికి చేదోడు వాదోడుగా వుంటాడు అనుకుంది. ఎంత తన మాట విన్నా అంతంత డబ్బు యిస్తానంటే భర్త ఒప్పుకోడని తను నానా గడ్డి కరిచి డబ్బిస్తే—బాగానే చేశాడు. యెదురుగా శర్మ కనిపిస్తే యేం చేసేదో కుసుమ.

పైకి ముంగిలా వుంటాడు కాని శర్మ చాలా నేర్పు కలవాడే! ఎవర్ని యెలా మచ్చిక చేసుకోవాలో బాగా తెలుసు.

పుట్టింటి తరపు వాళ్ళంటేనే కుసుమకి వొళ్ళు తెలియదు. అలాంటిది శర్మ బుట్టలో చాలా తేలిగ్గా పడింది కుసుమ.

మొదట రెండువందలు పెట్టుబడి పెడితే చాలని ఆ స్నేహితుడు చాలా నమ్మకమైనవాడనీ—ఇలాంటిది మళ్ళీ మళ్ళీ రాదనీ ఈ ఉపకారం ఒకటి చేసి పుణ్యం కట్టుకోమని చాలా జాలిగా వేడుకున్నాడు శర్మ కుసుమని. "సర్లే" అని భర్తకు తెలవకుండా రెండు వందలూ యిచ్చింది. అదేం షాపో యేమిటో యేమీ వివరాలు అడగలేదు. 'శర్మ అమాయకుడు అబద్ధమాడడు' అనుకుంది.

నెలరోజులు గడిచేసరికి "పిన్నీ! అర్జంటుగా అయిదు వందలు కావాలి. సరుకు విడిపించుకోవాలి. నాలుగు రోజుల్లో నీ డబ్బు వువ్వుల్లోపెట్టి అప్పగిస్తాను" అన్నాడు శర్మ వస్తూనే హడావిడిగా.

రెండువందలంటే యిచ్చింది. దానికంత ఆరాలేదు. ఇప్పుడు అయిదువందలు ఆవిడ దగ్గర లేకకాదు. ఇచ్చినా రాజేంద్రకి అరా తెలియదు. ఇవ్వాలా వద్దా అని ఆలోచిస్తోంది. కుసుమ మౌనానికి అర్థాలు గ్రహించేడు శర్మ.

"పిన్నీ! సందేహిస్తున్నావా? నీ డబ్బు నీకు వువ్వులోపెట్టి అప్పజెప్పుతాను. నీ మీద ఒట్టు...."

"అంత మాట యెందుకురా" బంగారుగా అంది కుసుమ.

"నా కంత సహాయం చేసిన స్నేహితుడికి—యిలాంటి సమయంలో నాలుగు రోజుల

భాగ్యానికి సరదలేకపోతే....అదే నాకు,చాలా బాధగా వుంది పిన్నీ!"చాలా బాధగా అన్నాడు శర్మ.

ఏమనుకుందో కుసుమ. అయిదువందలూ పట్టుకొచ్చి యిచ్చింది.

"నీ ఋణం యెప్పటికీ తీర్చుకోలేను పిన్నీ!" కృతజ్ఞతగా అన్నాడు శర్మ.

శర్మ అన్నట్టుగా నాలుగు రోజుల్లో యివ్వకపోయినా వారంనాటికి వడ్డీతోసహా యిచ్చేడు శర్మ. శర్మ అన్నట్టు నాలుగురోజుల్లో యివ్వకపోవటంతో కుసుమ ఖంగారుపడిన మాట నిజం. అడగనా మాననా అని గుంజాటనపడుతోంది. అంతలో శర్మ వారంరోజుల వడ్డీకూడా యిచ్చేడు. దాంతో కుసుమ తబ్బిబ్బయిపోయింది. "ఇంకా నయం అడిగాను కాను" అనుకుంది. "నాకు వడ్డీ ఎందుకురా" అంది పైకి.

"ఏమో! అతనే యిమ్మన్నాడు. నేను అడగలేదు; నువ్వడగలేదు; వచ్చిందాన్ని యెందుకు కాదనాలి? సమాయనికి నువ్వు యిచ్చావు. అదే మహాభాగ్యం" అన్నాడు.

ఆ తర్వాత వెయ్యి అడిగాడు. పదిహేను రోజుల్లో యిస్తానన్నాడు.

కుసుమ సందేహించకుండా యిచ్చింది.

పదిరోజుల్లోనే తిరిగి యిచ్చేశాడు.

కుసుమకి శర్మమీద చాలా నమ్మకం ఏర్పడిపోయింది.

ఒకరోజు కుసుమ శర్మని అడిగింది. "ఏరా, శర్మా! నీకు ఏమైనా వాటా ఇస్తున్నాడా? నీ మెతకతనం చూసి...." సందేహంగా ఆగిపోయింది.

"ఎందుకివ్వడు పిన్నీ! అమ్మకి నెలనెలా పంపుతున్నాను" అన్నాడు. ఆ సాయంత్రం కుసుమకి, మంచిచీరా, జాకెట్టుబట్టా, పిల్లలకి బొమ్మలూ బట్టలూ—రాజేంద్రకి మంచి పెన్నూ తెచ్చి యిచ్చేడు. కుసుమ సంతోషం వర్ణనాతీతం. 'ఒక్కనాడు—అభిమానంగా ఒక్క జాకెట్టు బట్టన్నా తెచ్చి యిచ్చేడా శేఖరం! ఎలాగయినా తనవాళ్ళకున్న ఆపేక్షలు వాళ్ళకెందుకుంటాయి అనుకుంది. ఆ రోజు రాజేంద్రతో అంది కూడా శేఖరం యెప్పుడూ యేమీ సరదాగా తేలేదని.

ఇలాగే రోజులు చాలా నేర్పుగా లాక్కొస్తున్నాడు శర్మ. ఇన్ని రోజుల్లో యిస్తానని చెక్కు మారలేదని—బాంక్‌కి టైము అయిపోయిందని—సమయానుకూలంగా ఏదో ఒకటి చెప్పి కుసుమ దగ్గరనుండి డబ్బు పట్టుకెళ్ళటం నమ్మకంగా అన్నదానికి రెండుమూడు రోజులు ముందుగానే ఆవిడ దోసిట్లో పోయటం—

శర్మయందు బాగా నమ్మకం ఏర్పడిపోయిందేమో సమయానికి కుసుమ దగ్గర లేకపోయినా—శర్మ అడిగినంత మొత్తం తన దగ్గర లేకపోయినా తన స్నేహితుల దగ్గర తెచ్చి యిచ్చేది. కాస్త వడ్డీ ఎక్కువనేసరికి వాళ్ళు చాలా సంబరంగా యిచ్చేవారు; ఇలా కూడా నాలుగయిదుసార్లు జరిగింది.

ఈ మధ్య—అంటే పదిహేను రోజుల క్రితం—మధ్యాహ్నం రెండుగంటలకి చాలా హడావిడిగా వచ్చేడు శర్మ. వస్తూనే "పిన్నీ! నువ్వో సహాయం చేయాలి. ఇప్పుడు నువ్వు కాదన్నావంటే చాలా నష్టం! ఇలాంటి ఛాన్సు మళ్ళీ యీ జన్మలో రాదు" అన్నాడు.

"అయ్యో! ఏమిటో చెప్పు! చెప్పందే యెలా తెలుస్తుంది?" నవ్వుతూ అంది కుసుమ.

"రాత్రి ఎనిమిది లోపుగా పాతికవేలు కావాలి! అతను పదిహేనువేలు చూస్తానన్నాడు. నా వాటాకి పదివేలు చూడమన్నాడు."

"పాతికవేలా!? ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది.

"పైదేశాల నుండి రకరకాల వస్తువులు దిగుమతులు అవుతుంటాయి—అలాంటి అదృష్టవంతుల్లో—మాకూ చిన్న అవకాశం లభించింది. నేను పదివేలు యిచ్చేనంటే అతను పదిహేను-పాతికవేలూ యిచ్చి సరుకు తెచ్చుకోవటం-వారం నాటికి లక్ష! ఒకలక్ష మనచేతుల్లో వుంటుంది. ఇలాంటి అవకాశం కల్లోకూడా ఊహించలేదు పిన్నీ! నేను పదివేలు చూస్తే చెరిసగం వాటా

అహాఁ! దానికి మా అమ్మపేరెడతానంటే..నేనూరుకోను!!



యిస్తానన్నాడు....నీకెంత వీలుంటే అంతేలే! నీకు మాత్రం దొరకద్దూ! కానీ, ఒకటి! నెల రోజులని చెప్పు! నేను పదిరోజుల్లో యిచ్చినా నెలవడ్డీ యిచ్చేస్తాను—వాళ్ళిష్టమొచ్చిన వడ్డీ వేసుకోమను! సమయానికి ఆదుకుంటే చాలు."

ఆలోచనలో పడింది కుసుమ.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్" అని అడిగాడు శర్మ.

"అంత యెక్కడ దొరుకుతుందా అని" అంది.

"నీకెంత దొరికితే అంతే! ఇచ్చేవాళ్ళకి కూడా నమ్మకం వుండాలిగా మరి.

కుసుమ మాట్లాడలేదు.

మళ్ళీ శర్మే అన్నాడు "నేనిచ్చినదానినిబట్టి నాకు వాటా యిస్తాడు. లేకపోతే వాటా రాదంతే! కానీ, ఇలాంటి సువర్ణావకాశం నా జన్మలో రాదు పిన్నీ! నీ దయ! నీకెంత వుడితే అంతే! నువ్వేం బాధపడకు."

తనకి పరువు లేదనటం కుసుమ సహించలేద. తను రెండువేలు యివ్వగలదు. తనపేర వేరేగా బ్యాంకులో డబ్బుంది. 'చూద్దాం! వాడు అడిగినంత యివ్వకపోయినా సగమన్నా ఇవ్వాలి' అనుకుంది. "ఇప్పుడే వస్తాను కూర్చో!" అని బయలుదేరింది కుసుమ.

మొత్తానికి యెలాగయితేనేం శర్మకి ఏడువేలు యిచ్చింది. అదివరకు మామూలుగా ఇచ్చే వాళ్ళ దగ్గర మూడువేలూ, తనదగ్గరివి రెండువేలూ—మొత్తం అయిదువేలు. ఇంకా నలుగురయిదుగురు సందేహించేరు. హనుమాయమ్మగారి ద్వారా ఇద్దరి దగ్గర వాళ్ళకి భయం లేకుండా తనవి పెద్దగొలుసూ, నెక్లెసూ డబ్బు యిచ్చేవరకూ వుంచుకోమని యిచ్చింది. వాళ్ళు యెందుకెందుకంటూనే మొహమాట పడుతూనే నగలు వుంచుకుని డబ్బు యిచ్చేరు. మొత్తం ఏడువేలూ యిచ్చింది.

"నీ ఋణం పదిజన్మలెత్తినా తీర్చుకోలేను పిన్నీ!" అన్నాడు శర్మ.

లోలోపల పొంగిపోయినా "మాటలు నేర్చావులే" అంది నవ్వుతూ.

పదిరోజుల్లో యిచ్చేస్తాడు. ఆ గొలుసూ, నెక్లెసూ తను యెప్పుడూ వేసుకోదు. పెళ్ళిళ్ళకి

వెళ్ళినప్పుడు అదేనా తల్లి కేకలేస్తే వేసుకుంటుంది. వేరే రెండుపెటల గొలుసు-ముత్యాల సెట్లూ వున్నాయి. అందుకు రాజేంద్రకి కూడా తెలవవలసిన పని లేదనుకుంది.

పది పన్నెండు రోజులు గడిచిపోయినాయి. ఒకరోజు శర్మ వచ్చి, కాస్సేపయ్యాక కుసుమతో అన్నాడు "రేపుకాని ఎల్లుండికాని ఊరు వెళ్తాను. నాలుగు రోజుల్లో వస్తాను" అని.

"ఏ వూరు? ఆ విడిపించుకున్న సరుకు అమ్ముడయిందా?" అని అడిగింది కుసుమ.

"సగం అమ్ముడయింది — పట్టిగా అమ్మడానికి వీలులేదు."

"ఏం? మరెలా?" సందేహంగా అడిగింది.

"జాగ్రత్తగా పెద్దపెద్ద షాపుల్లో యిచ్చేయటమే! వాళ్ళు కళ్ళు మూసుకుని అమ్మేస్తారు."

"ఎన్ని నేర్చావురా" అంది కుసుమ 'శర్మ ఎదిగిపోయాడు' అనుకుంటూ.

"ఏం చేయమంటావమ్మా! ఈ జానెడు పొట్టకి ఎన్ని తిప్పలూ! ఈ కాస్త సవ్యంగా జరిగిపోతే అమ్మనీ నాన్ననీ ఈ వూరు తీసుకొచ్చేస్తాను. ఇదంతా నీ చలవే పిన్నీ" అన్నాడు.

కుసుమ మనసు గాలిలో తేలింది.

వాళ్ళలా చాలాసేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మాటల్లో "రాత్రి రాలేదేమిరా! ఎక్కడ పడుకున్నావ్?" అని అడిగింది.

"రెండో ఆటకి సినిమాకెళ్ళాం. ఇంట్లో చెప్పలేదన్నా వినలేదు. రెండింటికి వచ్చి మిమ్మల్ని లేపాలని రాలేదు" అన్నాడు.

"అదే అనుకున్నాలే! బాబయ్య అడిగితే అదే చెప్పాను. ఏ సినిమాకు వెళ్ళారు"

"అనార్కలి — హిందీ."

"హిందీ అనార్కలా! ఏ టాకీసులో?" సంభ్రమంగా అడిగింది. హిందీ అనార్కలి కుసుమ చూడలేదు. ఎన్నాళ్ళనుండో చూడాలని రాజేంద్రతో అప్పుడప్పుడు అంటూనే వుంటుంది. ఎక్కడేనా మార్నింగ్ షో ఆడుతోందేమో వాకబు చేస్తూండండి. ఆ సినిమా నాకు చాలా ఇష్టం అంటూ. "సరే" అంటాడతను.

ఏ టాకీసో చెప్పి, "ఈ రోజే ఆఖరురోజు" అన్నాడు.

కుసుమ గబగబా తయారయింది. భర్త వస్తూనే బయలుదేరడమే తరవాయిగా.

రాజేంద్ర ఆరవుతుండగా వచ్చేడు.

కుసుమ సినిమా సంగతి చెప్పి అతన్ని తొందరచేసింది.

"నేను రాలేను కుసుమా! నువ్వూ శర్మా వెళ్ళిరండి" అన్నాడు రాజేంద్ర.

కుసుమ బుంగమూతి పెట్టింది చంటిపిల్లలా "ఎన్నాళ్లగానో యెదురు చూస్తున్న నాకు ప్రియాతి ప్రియమైన సినిమా! ఇన్నాళ్ళకి చూస్తూ — మీరు పక్కన లేకుండానా! ఉహుఁ! మీరు రాకపోతే నేనూ వెళ్ళను. ఈ రోజే ఆఖరు రోజట! పోనీ రెండో ఆటకి వెడదామా?" అంది.

"నువ్వలా అంటే ఏం చెప్పను కుసుమా! నా గురించి ఎన్నాళ్ళనుంచో నువ్వు కలవరిస్తున్న సినిమా మానేయడం నాకు బాగుండదు" అంటూ అతను బాగ్ తెరిచి చూపిస్తూ అన్నాడు "ఇది కంపెనీ డబ్బు! బ్యాంక్‌కి టైము అయిపోయింది. ఇంటికి తీసుకొచ్చేను. ఇంత డబ్బు ఇంట్లోపెట్టి వెళ్దామా, చెప్పు!" అన్నాడు.

"బాగుంది! బీరువాలోపెట్టి తాళం వేస్తాను; శర్మ వుంటాడుగా! మనం లేకుండా ఎక్కడకీ వెళ్ళడు!"

రాజేంద్ర యెన్నివిధాల చెప్పినా కుసుమ వినలేదు. రాజేంద్ర రాకపోతే తనూ మానేస్తానంది. అతనికి యెక్కడికీ కదలాలని లేకపోయినా తప్పనిసరి అయి కుసుమతో బయలుదేరాడు.

వెళ్తూ శర్మతో అంది కుసుమ. "జాగ్రత్తరోయ్" గొంతు తగ్గించి అంది: "బీరువాలో డబ్బు పెట్టేను జాగ్రత్త! బయట కూడా వద్దు! లోపలే తలుపులు వేసుకుని కూర్చో!" అంది.

"అలాగే" అన్నాడు శర్మ కళ్లల్లో తేలిపోతూ. (సశేషం)



ఈ కథ సెప్టిక్ అయ్యింది

డి. నారాయణవర్మ.

బ్రతకడానికి యెంతకైనా తెగించే ఈ రోజుల్లో రామచంద్రం బడిపంతులు ఉద్యోగానికి సాహసించడం విడ్డూరంగాదు. దీన్ని వింతగా చెప్పుకోవాల్సిన పనేంలేదు. అతగాడు అర్జంటుగా తాలూకా హెడ్ క్వార్టర్స్ నుండి మారుమూల గ్రామానికి బదిలీ అయిన కారణం వింటే మాత్రం విడ్డూరంగానే వుంటుంది మరి!

ఏలుబడిలో ఎమర్జన్సీ లేకపోయినా సాగుబడిలో కావాల్సినంత దౌర్జన్యం వుందనేందుకు నిదర్శనంగా సమితి ప్రెసిడెంటు చర్యలను చెప్పుకోవచ్చు. అటువంటి శాల్తీకి. సారీ.... శక్తికి రామచంద్రం సకాలంలో సవినయంగా నమస్కారం చేయకపోవడం పెద్ద అపరాధం అయిపోయింది. ఇంకేముంది....నిమిషాలమీద బదిలీ ఉత్తర్వులు జారీ అయిపోయాయి. ఇక రెండు చేతులెత్తి వంద నమస్కారాలు చేసినా లాభం వుండదని రామచంద్రానికి అర్థమయింది. కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలినా బదిలీ ఆగదని రూఢీ అయింది. అఫ్‌రాల్ బదిలీ గురించి రామచంద్రం ఆత్మాభిమాన్ని చంపుకోదలుచుకోలేదు.

శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ అవతారం కాబట్టి వనవాసకాండను అత్యద్భుతంగా - అతి హృదయవిదారకంగా చిత్రించారు కవిపుంగవులు. వట్టిపేరులోనే గాకుండా పౌరుషం-త్యాగ గుణంలాంటి శ్రీరామచంద్రుని కోవకు చెందిన లక్షణాలున్నా, రామచంద్రం అఫ్టరాల్ మనిషైనందున, పూర్‌ఫెలో బండిపంతులై వున్నందునా, అందునా సమితి ప్రెసిడెంటుకు సకాలంలో నమస్కారం చేయకపోవడం మినహా మరే చరిత్రా లేనందున, ఆతగాడి బదిలీకాండను రాయడానికి ఏ రచయితా పూనుకోలేదు.


ఒంటెద్దు బండిలో సామానంతా యెక్కించాడు. ప్రాణాలున్న శాల్తీలుగా పెళ్ళాం పిల్లల్ని అందులో నొక్కాడు. తను బండి వెనక నడుస్తూ బదిలీయాత్రకు బయలుదేరేడు. సత్తరకాయ చంటిదాన్ని కాసేపు పెళ్ళాం వళ్ళోనూ మరి కాసేపు తన భుజాల మీదకు మార్చుకొంటూ అలా వాగులూ వంకలు, ఏళ్ళూ, వూళ్ళూ దాటి... దాటి... దాటి, మజిలీలు చేస్తూ; మాటిమాటికీ సమితి ప్రెసిడెంటు మీద వచ్చే కోపాన్ని, చీటికీమాటికీ పాల కోసం గీపెట్టే చంటిదాని మీద ప్రదర్శిస్తూ ఎట్టకేలకి గమ్యస్థానం చేరుకున్నాడు.

గవర్నమెంటు దృష్టిలో తప్పించి, రామచంద్రం బదిలీ అయిన వూరు వూరుగాదు. కనీసం పల్లెసీమ లక్షణాలుగూడా లేవు. పాలెం అనబడే ఆ వూళ్ళో లెక్కగా ఇరవై అంటే ఇరవై గుడిసెలే వున్నాయి. వసతులు లేవు. వనరులులేవు. మంచి వూరు కాదు గదా మంచి నీళ్ళు కూడా పాలెంలో దొరకవు దూరానున్న మోటబావిలో తప్పించి.

అటువంటి గుడిసెల పాలెంలోని రామచంద్రం ప్రవేశించగానే, మోచేత్తో బుంగను చంకనాన్చుకొని తవుగోలతో పరిమళ్ళ కడ్డం బడుతూన్న నల్లటి మనుష్యులు, గూటీబిళ్ళ ఆడుకొంటున్న కుర్రాళ్ళు, మోటబావి నుంచి మట్టికడవతో నీళ్ళు మోసుకొస్తున్న మోటు ఆడవాళ్ళు కనిపించారు. గోచి ఆ ప్రాంతపు యూనిఫారంలా, పెద్దా చిన్నా భేదం లేకుండా అందరి నగ్నశరీరాలమీద అలంకారంలా వుంది. ఆడవాళ్ళు రవిక తొడక్కుండా గుండెల్ని, గుండెలమీది బరువుల్ని పట్టి పట్టిచూద్దామన్నా వీలులేనంతగా కోకతో మానేజ్ చేసిన తీరు రామచంద్రాన్ని చకితుడ్ని చేసింది. వాళ్ళు మనుష్యులు అనుకోవడానికి ఆధారాలు అక్కడక్కడా వున్నా, మట్టివాసనతో అనాకారీగా కానవచ్చే పాలెం వాస్తవ్యులు రామచంద్రం రాకను విచిత్రంగా తిలకించారు. దారి తప్పాడేమో అనుకున్నారు. దగ్గరకు రాగానే చుట్టూ మూగి, ఎగాదిగా జంతువుని చూసినట్టు చూశారు. రామచంద్రం చెప్పిన మాటలు విని స్వాగతం పలకడానికి బదులుగా యెద్దేవాచేశారు.

"ఏం బావుకుందామని బాబూ, యిలా అరిజెంటుగా పెళ్ళాం బిడ్డలతో మా వూరు పారొచ్చేత్తన్నావు? వొచ్చి యిక్కడ్ని ఏం సేత్తావని? ఎవుల్ని వుద్దరిత్తావు? మమ్మల్నా! ఏటీ బడి సొబుతావా....మా బాటే? సదూకుంటే ఏటొత్తదట, నీలా పొట్ట చేత్తో బట్టుకొని దేశాలు తిరగడం తప్పించి! ఇదిగో నువు బడి సొప్పినా మా గుంటలు సదూకోరు. ఆళ్ళకెందుకురా సదువు, సంకనాకనా! ఇదిగో....నేలని నమ్ముకొంటే నోటికి ముద్దల్లి దినం గడుత్తాది" అనే అభిప్రాయాలు తొలిపలుకులలో పాలెం వాళ్ళు వ్యక్తం చేశారు. రామచంద్రం మౌనంగా బండిమీద సామాను దింపుతూంటే గుంపుగా మూగి "ఇదిగో బాబూ, నువ్వొట్టి పిచ్చోడి లాగున్నావే? గాలివానకి ముందబెడు మా పాలెంలో బడి పెట్టేరు. ఆయాల్టి నుంచి యియ్యాల్టదాకా సదువు సొప్పడానికి వొచ్చినోడూ లేడు. వొచ్చినా సదూకునేవోడూ లేడు. మాకెందుకు బాబూ సదువులు. మట్టిని నమ్ముకొన్నాళ్ళ నోట్లో మన్నుకొట్టడానికి తప్పితే!" అని హెచ్చరించారు.

రామచంద్రంలో శ్రీరామచంద్రుని లక్షణాలున్నాయి గాబట్టి వాళ్ళ మాటలకు నీర్సపడిపోలేదు. మొక్కపోని ధైర్యంతో "మిమ్మల్ని మారుస్తాను. మీలో విజ్ఞాన కాంతుల్ని వెలిగిస్తాను. సమితి ప్రెసిడెంటుకి నమస్కారం చేయకపోవడం ఒక విధంగా మంచిదే జరిగింది" అనుకున్నాడు. ఆ ధైర్యంతోనే ఒంటెద్దు బండిని వెనక్కి పంపేశాడు.



కాని గుడిసె బడిని చూశాక, అది పేరుకే బడి అని, చదువు మాత్రం గంగరావి చెట్టు క్రిందేనని తెలిశాక రామచంద్రం గుండెల్లో రాయి పడింది. దీనినిమించి తలదాచుకోవడానికి గుడిసె లేదుగదా, గూడూ-నీడా కూడా పాలెంలో దొరకదని అర్థమయాక 'అయితే నేనిప్పుడెక్కడుండాలి' అనే ఆందోళన కలిగింది. రామచంద్రం చేతులు తెగిన రచయితలా విలవిల్లాడిపోయాడు.

"లంజ....!" ఛ... ఛ యింకా లోతుకు వెళ్ళి సమితి ప్రెశిడెంటుని వట్టుకొని రామచంద్రం తిట్టిన తిట్లన్నీ యిక్కడ చెప్పడం అంత సభ్యతిగా వుండదుగాని, గుంభనంగా చెప్పాల్సివస్తే మాత్రం తిట్టిన తిట్టు తిట్టకుండా నిఘంటువులకు ఎక్కని నామవాచకాలుపయోగిస్తూ మరీ తిట్టుకున్నాడు.

దాంతో సమస్యలు పరిష్కారం కావుగా! బడితో సహా పాలెంలో వున్నవన్నీ గుడిసెలే! రామచంద్రం బడిపంతులుగా పాలెంలో వుండాలంటే, తనూ ఓ గుడిసె వేసుకోవడం తప్పించి మరో మార్గంలేదు. ఏం చెయ్యాలో పాలుపోని రామచంద్రం ఏడ్పుమొగం పెట్టాడు.

పాలెంవాళ్ళు అనాకారీ మనుష్యులే అయినా, సమితి ప్రెసిడెంటు వంటివాళ్ళు కారు గనక, నీడ చూపలేకపోయినా, కనీసం గుడిసెకట్టిస్తాం అని గూడా అనకున్నా, గూడుదొరికే చోటు చూపారు. దూరంలో క్రోసున్నరలో మినుకు మినుకుమంటూ కానవచ్చే మేడను చూపుతూ, అక్కడికి వెళ్ళి వరాలమ్మగార్ని అడిగి చూడమన్నారు. ఈ చుట్టుప్రక్కల వూళ్ళలో వుద్యోగాలు చేసుకొనే కొందరు పంతుళ్ళు వరాలమ్మగారింట్లోనే వుంటున్నట్టు కూడా తెలిపారు. "హారి ప్రెసిడెంటూ, ఎంత అవస్త కొనితెచ్చావురా!" అనుకుంటూ రామచంద్రం ఆ క్షణమే పొలాలకు అడ్డుబడ్డాడు.

ఆ చుట్టుప్రక్కల ఇరవై గ్రామాలకు మధ్యగానున్న ఆ మేడ పొలాలమధ్య కట్టని కోటలావుంది. కోటకు వరాలరాణంటూ యజమాని వున్నా, వరాలమ్మగారిని గురించి తప్పిస్తే, నామ మాత్రంగా కూడా రాజు గురించి

ఎవ్వరూ చెప్పుకోరు. అసలా రాజు ఎవరికీ తెలియదు గూడాను. వడ్డీకి అప్పులివ్వడం, తన ఖాలుపట్టడం దగ్గర్నుంచి, తగువులు పెట్టడం చేర్చడం, పెళ్ళిళ్ళు జరిపించడం, విడదీయడం వరకూ యిలా ఒక టేమిటి ఒకందుకేమిటి మంచికి చెడ్డకి వరాలమ్మగారుండాల్సిందే. ఆ ప్రాంతీయులు వరాలమ్మగారి సలహా సంప్ర దింపులు లేంది ఊపిరి గూడా పీల్చుకోరు. ఒక్క మాటలో చెప్పాలంటే, వందమంది సమితి ప్రెసిడెంటులకుండని పలుకుబడి ఆమెకు ఆ ప్రాంతంలో వుంది.

ఇకపోతే ఊళ్ళపెత్తనం, ఇంటిపెత్తనంతో సహా వొంటిపెత్తనం కూడా ఆమెదేనన్న వదంతి కూడా వుంది. అయితే యిందుకు ఆధారాలు, రుజువులు లేకున్నా తరుచు పట్నాల నుంచి వచ్చిపోయే కార్లు, జీపులు; రెండేసి మూడేసి రోజులు కోటలోనే తిష్టవేసే పెద్దపెద్ద మనుష్యులు. వాళ్ళకు జరిగే విందులు వినోదాలు, అరమరికలు లేకుండా వచ్చిన వాళ్ళతో వరాలమ్మగారు మెలిగే పద్ధతి చూసి ఓర్వలేని వాళ్ళు అలా వదంతులు పుట్టించి వుండొచ్చు! వీటికి తోడు ఆమె అందం అలాంటిదే మరి! పచ్చగా....మేలిమి బంగారంలాంటి వొంటి ఛాయ, వొంటిమీద నిత్యం ఒత్తుగా వుండే బంగారం నగలు. కళ్ళల్లో ఆకర్షణతోపాటు తీవి, సంతానం వున్నా జారిపోని బిగువు బింకం... యివన్నీ చూస్తే, ఇంత అందమైన ఆడది అంతమంది పెద్దపెద్దోళ్ళతో పరిచయం వున్నది, ఆ అనాకారీ మొగుడ్ని-రాత్రింబవళ్ళు మట్టి పిసుక్కున్నే మోటుమనిషిని దగ్గరికెలా రానిస్తుంది? తప్పకుండా వొంటిపెత్తనం కూడా వరాలమ్మదే అయివుంటుందని అనిపించక మానదు.

అంచెలంచెలుగా మేడ చేరేలోగా యీ వివరాలన్నీ తెలిసినా రామచంద్రం పెద్దగా పట్టించుకోలేదు. తనకనవసరం అనుకుంటూ విన్నది విన్నట్టే మర్చిపోతూ వచ్చాడు. గుండెలవిసేలా ఒగుర్చుతూ మేడలోకి జొరబడ్డాడు. ఈజీచైర్‌లో ఠీవిగా పడుకొని ఏదో ఆలోచిస్తూ గుండెలను చేత్తో రాసుకుంటున్న వరాలమ్మ రామచంద్రం రాకకు వులిక్కిపడింది. రామచంద్రం గుక్క తిప్పుకోకుండా విషయం అంతా వివరించి కాస్త నీడిచ్చి పుణ్యం కట్టుకోమని అభ్యర్థించాడు.

వరాలమ్మ ఆరడుగుల ఆడదైనా ఆ సమితి ప్రెశిడెంటు కాదు గాబట్టి రామచంద్రం నమస్కారం చేయకపోయినా అభ్యర్థన శ్రద్ధగా వింది. క్షణం దీర్ఘంగా ఆలోచించింది. ఆపైన సైగతో రామచంద్రాన్ని పెరట్లోకి తీసుకెళ్ళి గొడ్లచావిడి చూపించి ఇదే పోర్షన్ అంది. రామచంద్రం తెల్లబోయాడు.

"మరేం చేయమంటారు. ఇదే ఖాళీగా వుంది. పశువులకు మీకు మధ్య తడికలు కట్టిస్తాను. అసలు దీన్ని యిచ్చే వుద్దేశ్యం లేదనుకోండి. అయినా నిన్ను చూశాక పిల్లలతో అర్థంతరంగా వచ్చావని తెలిశాక యివ్వాలనిపించింది. ఇదిగో....మీకిష్టమైతేనే దిగండి. అద్దెమాత్రం నెలకి ముప్ఫయి" అంది వరాలమ్మ హుందాను వెళ్ళబోస్తూ.

రామచంద్రం మరి ఆలోచించే పరిస్థితి కొని తెచ్చుకోలేదు. అలాగే అంటూ తలూపి ఆ రాత్రికి రాత్రే గొడ్లపాకలో గృహప్రవేశం చేసేశాడు. ఆ తర్వాత అద్దె గురించి, దోమల రాగాలతో పేడ కంపుకొట్టే పోర్షన్ గురించి మథనపడిపోతూ, వరాలమ్మను ఏం అనుకోలేక పళ్ళు మండగా ప్రక్కనున్న పశువుని చూస్తూ ప్రెశిడెంటుని కీర్తించేశాడు.

భాగ్యవంతుడికి పట్టిన జబ్బులు మధ్యతరగతి వాడి సమస్యలు ఓ పట్టాన వదలవు. కష్టాలతో తప్పించి. నమస్కారాలు ఆశించే సమితి ప్రెశిడెంటు ప్రజలకు ఏ నమస్కారం కొట్టాడోగాని తపీమని ఎం.ఎల్.ఏ. అయిపోయాడు. ఈ రెండేళ్ళలోనూ రామచంద్రం ఎన్ని విధాల ప్రయత్నించినా బదిలీ రాలేదు. పైగా పాలెంవాస్తవ్యులు బదిలీ అయి వెళ్ళడానికి ఒప్పుకోలేదు.

"నువ్వు నిజంగా శ్రీరామచంద్రుడివే బాబూ! లేకపోతే నువ్వేటి....ఎ పంతులూ రాని మా



వూరు రాడమేటి? ఆయాళ నువు పెళ్ళాం బిడ్డలతో వత్తాంటే ఎద్దేవా చేసినాం! సదువెందుకు సంకనాకనా అని ఎగతాళి సేసినాం! మరి యియ్యాల మా కుర్రాళ్ళు సదువంటే ఎగబడుతున్నారు. పుత్తకాలు చదివేత్తన్నారు. మట్టి పిసుక్కునే మాకు సదువంటే ఏటో తెలిక గేనం లేకుండా ఏతో వాగేసినాం! నువ్వు దేవుడివి బాబూ దేవుడివి. నువు మమ్మల్ని ఇడిసిపోడానికి యీల్లేదు. ఈడ్నే వుండాలి" అంటూ పాలెం వాస్తవ్యులు ముందు జాగ్రత్తగా 'మాకి పంతులే వుండాలం'టూ ప్రభుత్వానికి వరాలమ్మ ద్వారా మహజర్లు పంపుకోవడంతో తనకీ జన్మకు బదిలీ వుండదంటూ నిశ్చయానికొచ్చేశాడు రామచంద్రం. అయితే వాళ్ళు వంగి వంగి రోజూ నమస్కారం పెడుతూన్నందుకు మాత్రం పొంగిపోలేదు.

సీత తప్పిపోయినందుకు శ్రీరామచంద్రుడు విలపించనట్టుగా మన రామచంద్రం ఏడ్వడం ఇక బదిలీ జరగదని మాత్రంకాదు. రూపురేఖలు మారిపోతూ పెళ్ళాం రోజురోజుకీ ఎండిపోతున్నందుకుగాదు. ఎదుగుతూన్న పిల్లలకు సరైన విద్యావకాశాలు లేక గూటీబిళ్ళ, కోతికొమ్మచ్చి ఆటలకు రుచిమరిగి అనాకారీలుగా తయారవుతూన్నందుకూ గాదు. మరెందుకంటే, మరో చంటిది పుట్టుకొచ్చి తల్లిపాలులేక-డబ్బాపాలు మరేపాలు తాగకుండా తల్లిపాలకోసమే నేలబడి పొర్లాడే పరిస్థితి చూసి, ఏం చెయ్యాలో తోచక గత్యంతరం లేక ఘోరున ఏడ్చాడు.

రామచంద్రం ఏడ్చినంత మాత్రాన చంటిది నోరు మూయలేదు. ఎండిన డొక్కలు యెగరేసుకుంటూ, అమ్మా అమ్మా అంటూ రోదిస్తూ ఏడ్వడానికి శక్తిలేనప్పుడు కళ్ళు తేలవేస్తూంటే రామచంద్రం గుండె చెరువైపోయింది. రాత్రింబవళ్ళు తేడా లేకుండా సాగుతూన్న ఈ రోదన కాంత మేడలోని వాళ్ళందరికీ విసుగు పుట్టించేసింది.

"ఏమిటి....ఏమిటా ఏడుపు....ఇక ఆ ఏడుపుకి రాత్రి పగలూ లేదా! మేం నిద్రపోవాలా లేదా! పెద్దవాళ్ళు ఏం చేస్తున్నారు, కాస్త ఊరుకోబెట్టక్కర్లేదూ. కనగానే సరా? అసలెందుకు

ఏడుస్తుందలా?"

ఓ అర్థరాత్రివేళ నిద్రపట్టని వరాలమ్మ కోపంగా కేకలు వేస్తూ వచ్చింది. గుమ్మానికి అంత దూరంలో నిలబడి చంటిదాన్ని చంక మార్చుకుంటూ వరాలమ్మ కోపంగానే రెట్టించే సరికి రామచంద్రం సమాధానం యీయలేక పోయాడు. నీర్సంగా గోడకు జేరబడి దీనంగా శూన్యంలోకి చూశాడు. మూడోసారి పురిమి చూస్తూ అడిగేసరికి రామచంద్రం పెళ్ళాం కీచు గొంతుకతో చెప్పింది.

"తల్లిపాలు లేకా!" అంది. వరాలమ్మ కళ్ల పెద్దవిచేసి నోరు నొక్కుకుంటూ అలా ఆశ్చర్య పడుతూనే లోనికి వచ్చి 'ఏమిటీ మరేపాలు తాగడంలేదా!' అని అడిగింది. రామచంద్రం దంపతులు తలలు అడ్డంగా ఆడించగా తటాలున చతికిలబడింది. అంతెత్తు మనిషి అలా కూర్చోవడంతో ఎందుకోగాని రామచంద్రం దంపతులు హడలిపోయారు.

వరాలమ్మ అలాగే కన్నార్పకుండా గిరగిర తిరుగుతూన్న చంటిదాని వంక చూసింది. అలా చూసి చూసి తన చంకలో చంటిదాన్ని ప్రక్కన కూర్చోబెట్టి రామచంద్రం చంటిదాన్ని ఒళ్ళోకి లాక్కొంది. రామచంద్రం ఎదురుగా వున్నాడని కూడా గుర్తించకుండా జాకెట్ తొలగించి స్తనం అందించింది. ఎండిపోయిన రొమ్ములతో పోట్లాడి పోట్లాడి అలిసిపోయి ఏడ్వడానికే బలి అయిపోయిన పసికందు కళ్ళకు బంతుల్లాటి స్తనాలు కనుపించగానే ముందుగా కాస్త బెదిరింది. ఆ తర్వాత తెప్పరిల్లి రెండుచేతులతో అందుకొని వెర్రి ఆనందంతో కరుచుకుపోయింది.

"మా అమ్మ తాగవే! నా బంగారు కొండా నీ బుల్లి కడుపునిండా తాగవే!" అంటూ వరాలమ్మ తన అక్కున చేర్చుకొని లాలిస్తూంటే చంటిది కేరింతలు కొడుతూ, గారంగుడుస్తూ, 'ఊ ఊ' అంటూ మత్తుగా మాట్లాడుతూ పాలు త్రాగసాగింది. ఈ దృశ్యం చూసిన రామచంద్రం భోరున యేడుస్తూ రెండుచేతులెత్తేశాడు.

"ఛ....ఛ....ఏమిటి మాష్టారూ-ఎందుకలా ఏడుస్తారు? మీరు మగాళ్ళు కాదా! ఈ మాత్రం దానికే యింత యిదైపోతే యెలా? సమస్యలు మనిషికి కాకపోతే మానుకి వస్తాయా. కాస్త గుండె నిబ్బరంగా వుండాలి. మీరీ విషయం చెబితే నేనే యిచ్చేదానిగా పాలు. ఇదిగో! నాకూ బిడ్డలున్నారు. పేగుతీపి నాకూ తెలుసండీ. మీకేం భయంలేదు. మీ పాపకు పాలు నే నిస్తాను. నా బిడ్డకిచ్చేంతవరకూ నాకు పాలున్నంత వరకూ యిస్తాను. సరేనా!" అని భరోసా యిచ్చింది. రోజూ మూడుపూటలా పాపను మేడమీదకు తీసుకురమ్మని వెళ్లే ముందు రామచంద్రం భార్యకు చెప్పింది.

అలా నెలరోజులు గడిచాక చంటిదానికిచ్చిన చనుబాల నిమిత్తం రోజుకి లీటర్ చొప్పున, లీటర్‌కి రెండురూపాయల రేటు చొప్పున అరవైరూపాయలు యిమ్మనమని నిష్కర్షగా కబురంపింది. ఇది రామచంద్రంకు విడ్డూరంగా కనిపించలేదు. అద్దెతోపాటు అరవైరూపాయలు కలిపి సంతోషంగా పంపించాడు.

కాలం యిలా జరిగిపోతే బావుణ్ను. కాని ఓ సుప్రభాతాన యిక పాలు యివ్వనంటూ వరాలమ్మ ఖచ్చితంగా చెప్పడంతో రామచంద్రం బాధపడ్డాడు. కాస్త కోపం కూడా వచ్చింది. రేటు యిస్తున్నాం కదా అనే ధీమా అలా కోపాన్ని కలగజేసింది. ఎందుకివ్వనంటూందో తెలుసుకోవాలని రామచంద్రం మేడెక్కాడు.


"అవునండీ. ఇవ్వనన్నాను. ఇవ్వను. ఇంత కాలం మీరు డబ్బిచ్చారే అనుకోండి. అయినా యిక యివ్వనన్నాను" అంది తాపీగా.

"ఇప్పుడు మరెలా?" అన్నాడు రామచంద్రం అయోమయంగా.

"ఎలా అంటే నేనేం చేయను" అంది.

"మీ కిది భావ్యంకాదు" రామచంద్రం అన్నదాని కామె చురచురా చూసింది.

"బాగుంది మీ వరస. అయితే యిలా ఇంత కాలం యివ్వాలని మీ వుద్దేశ్యం?" సూటిగా ప్రశ్నించింది.



"పాలున్నంతవరకూ మీ బిడ్డకు యిచ్చేంత వరకూ యిస్తానని మీరే అన్నారుగా! అందుకే అడుగుతున్నాను" అన్నాడు. వరాలమ్మ సమాధానం ఈయలేక మౌనం వహించడంతో "అసలెందుకు ఇవ్వనంటున్నారో దయచేసి చెబుతారా!" అని అడిగాడు.

"చెప్పాలా! నేను చెప్పను. చెప్పే అవసరం నాకు లేదు" అంది మొండిగా.

రామచంద్రం అదోలా నవ్వాడు "మీరు చెప్పకపోయినా కారణం తెలియదనుకున్నారా! నా కంతా తెలుసు" అన్న రామచంద్రం మాటలకు ఆమె వులిక్కిపడింది. మొగం రంగులు మారింది.

"మీకు తెలుసా?" అస్పష్టంగా గొణుక్కుంది.

"తెలుసు. నాకు తెలిసిందాన్ని మీ మొగం మరింత పటిష్ఠం చేసింది. కేవలం నా గురించి నా బిడ్డకు పాలు ఇవ్వననడానికి కారణం తెలుసు వరాలమ్మగారూ! నిజానికి యిది మీకు పుట్టిన బుద్ధికాదు. ఒకరి ప్రేరణవల్ల మీరీ నిర్ణయానికి వచ్చారు కదూ?" అని సూటిగా అడిగేసరికి వరాలమ్మ కంగారు పడిపోతూ మొగానికి పట్టిన చెమట తుడుచుకుంటూ "మాష్టారూ. మీరేం మాట్లాడుతున్నారో నా కర్థం కావడంలేదు. దయచేసి కాస్త వివరంగా చెప్పండి" అని ప్రాధేయపడింది.

"చెప్పడానికేముంది. ఆ సమితి ప్రసిడెంటు అదే ఎం.ఎల్.ఏ మీ ఇంటికొచ్చాడు గదూ! మూడురోజులు యిక్కడి తిష్ఠవేసి రాచమర్యాదలు పొందాడు గదూ! వాడు....వాడు చేసిందే యిదంతాను. ఆయనగారే యివ్వవద్దన్నారు గదూ పాలు"

"కాదు....కాదు" వరాలమ్మ తేలిక పడుతూ అంది.

రామచంద్రం నమ్మలేదు.

"నమ్మలేను. మీరా నిజాన్ని ఒప్పుకోరని నాకు తెలుసు. ఆయనకి సకాలంలో నమస్కారం చేయలేదని నన్ని మారుమూల ప్రాంతానికి అకారణంగా బదిలీ చేశాడు. ఇందుకు నే నెన్ని విధాల నష్టపోయానో మీకు తెలియదు. అయినా సహించాను! ఆయన ఎం.ఎల్. ఏ అయాక మీ యింటికి వచ్చాక

కూడా నేను నమస్కారం చేయలేదు. ఎందుకంటే ఇక నన్నేమి చేయగలడని? అయినా చేయాలనే చూశాడు. చిన్న వంక దొరికితే చాలు వుద్యోగం వూడబీకించాలనే ప్రయత్నంలో చేయాల్సినవన్నీ చేశాడు. నా స్కూల్ విజిట్ చేశాడు. పాలెంలో నా గురించి ఆరాలు తీశాడు, నన్ను ఇరికించడానికి పాలెం గ్రామస్థులను శతవిధాల హింసించాడు. వాళ్ళు మనసున్న మనుష్యులు వరాలమ్మగారూ! ఆయనగారి వుద్దేశ్యం గ్రహించిన గ్రామస్థులు ఎం.ఎల్.ఏ అనే గౌరవం కూడా యివ్వకుండా నిలబెట్టి కడిగేశారు. దాంతో యిక నన్నేం చేయలేక, యిక ఏ విధంగా కక్ష తీర్చుకోవాలో తెలియక నా బిడ్డకు పాలిచ్చే మిమ్మల్ని మానివేయమని చెప్పాడు. మీరూ, మీరు పెద్దలు కాబట్టి మీరు విన్నారు.

వరాలమ్మగారూ! నేను ఎం.ఎల్.ఏ అయిన సమితి ప్రశిడెంటుకి నమస్కారం చేయక పోవచ్చు. అది నా వ్యక్తిత్వానికి, ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం. కాని రెండు చేతులెత్తి మొక్కడంకాదు, మీ కాళ్ళు పట్టుకుంటాను. నా దీనపరిస్థితికి జాలిపడి, సాటి మనిషిగా కొన్నాళ్ళు అంటే చంటిది అన్నం ముట్టేవరకూ పాలివ్వండి ప్లీజ్....ప్లీజ్...."

రామచంద్రం యీ విధంగా విషయం అంతా విప్పి చెప్పినా వృధాప్రయాస అయింది. "ఆయనకీ మీకు లక్ష గొడవలుండొచ్చు. అవి నా కనవసరం. కాని పాలివ్వలేను....ఎందుకని ఎదురుప్రశ్న వేయొద్దు. నన్ను విసిగించకుండా దయచేసి వెళ్ళండి" అని వరాలమ్మ విముఖత ప్రకటించడంతో రామచంద్రం మరి చేసేదిలేక వేడి నిట్టూర్పుతో వెనక్కి తిరిగాడు.

ఎం. ఎల్. ఏ మీద ఏర్పడిన కోపాన్ని మించిన కోపం వరాలమ్మమీద రామచంద్రానికి కలిగినా, వరాలమ్మ తన బిడ్డకు పాలివ్వటం మానివేసిననాటి నుంచే, తన సొంత బిడ్డకు కూడా పాలివ్వడం మానుకుందని తెలిశాక కోపం కాస్త తగ్గించుకున్నాడు. కాని ఆమెలో వచ్చిన మార్పుకు విస్తుబోతూ కారణాలు వెదకజూసినా అవగతం కాలేదు. తన చంటిదానికి బలవంతంగా అన్నం అలవాటుచేసే ప్రయత్నంలో యిద్దరిమీద కోపాన్ని త్యజించాడు.

ఈ సంఘటన జరిగిన మూడవ రోజున వరాలమ్మ హఠాత్తుగా పట్నం వెళ్ళిపోయింది. ఇది మేడలో అద్దెకుంటూన్న వాళ్ళకు గొప్ప అవకాశంగా తోచింది. వారం రోజులు ఏకధాటిగా సమావేశమై వరాలమ్మ చరిత్ర అంతా తిరగతోడేశారు. ఆఖరికి ఎం. ఎల్. ఏతో గది విడిచి బయటకు రాకుండా గడిపిన సంఘటనలతో సహా అన్నీ చర్చించేశారు. ఈ చర్చలలో రామచంద్రం పాల్గొనకపోయినా సారాంశాన్ని శ్రోతగా విని "అయితే నా వూహ కరెక్ట్ అన్నమాట. ఎం. ఎల్. ఏ ప్రోద్బలంతోనే ఆమె మనసు మార్చుకుంది." అని నిర్ధారణ చేసుకున్నాడు. వెంటనే అతనికో సందేహం వచ్చింది. మరి తన బిడ్డకు కూడా యెందుకు పాలివ్వడం మానుకుంది? అనే ప్రశ్నకు. "ఆ ఏముంది ఒంటి బిగిపోతుందని ఎం.ఎల్.ఏ సలహా యిచ్చివుంటాడు, అందుకని మానేసింది" అని యెవరో అన్నారు. ఔరా అనుకున్నాడు రామచంద్రం.

పదిహేను రోజుల తర్వాత వరాలమ్మ పట్నం నుంచి తిరిగివచ్చింది. అమ్మలక్కలు వరాలమ్మ ప్రక్కప్రక్కగా చేరి పట్నం వెళ్ళడానికి గల కారణాలు ఆరాతీయగా తెలిసిందేమిటంటే ఆమె వైద్యంకోసం పట్నం వెళ్ళిందని. వైద్యం ఎందుకంటే స్థనాలు సెప్టిక్ అయాయని! సెప్టిక్ అవాల్సిన అసవరం ఏమొచ్చిందీ అనేదానికి ఎం. ఎల్. ఏ విడిది చేసినందుకని అమ్మలక్కలు సమాధానం చెప్పేసుకున్నారు.

ఈ వివరాలన్నీ భార్య చెబుతూంటే రామచంద్రం విని ఆశ్చర్యపోయాడు. వరాలమ్మ అందాన్ని కొరుక్కుతినే ప్రయత్నంలో ఎం. ఎల్. ఏ అలా ప్రవర్తించాడా, లేక తన మీదున్న కక్షతో చేశాడా అనేది అర్థంకాలేదు. ఏదో ఒకటి అనుకున్నాడు అన్నం మెతుకులు ఏరుకు తింటున్న చంటిదాని వంక తృప్తిగా చూస్తూ.

ఇప్పుడు రామచంద్రం ఎం.ఎల్.ఏని తిట్టుకోవడంలేదు. అయితే వరాలమ్మ తిట్టని రోజు లేదు. ☐



రిఫరీస్ ఫౌల్

వాసు

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి
భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానాం సృజా
మ్యహమ్॥"

ర ర ర

ఆ గుళ్ళో కొబ్బరికాయలు, ఊళ్ళో తలకాయలు తరచు పగులుతుంటాయి. కోనసీమ కనుక కొబ్బరికాయల్లోంచి నీళ్ళూ, సారాకైపు కనుక తలకాయల్లోంచి రక్తము కాస్త హెచ్చుగానే కారుతూంటుంది. ఆ ఊళ్ళో జరిగే రాజకీయాలకీ ఆ గుళ్ళోని గంట నిత్యమూ వంత పాడుతూంటుంది. ఆ గుడికోసం రాజకీయాలు, రాజకీయాల కోసం ఆ గుడీ వున్నాయి.

ఆ గుడి—అందరికీ పవిత్రంగా కనిపిస్తుంది. అందుక్కారణం అది ఆ ఊరి మొత్తానికి చెందినిది కనుక, అందుకు పర్యవసానంగా ప్రతివాడూ ఆ గుడి తనదేనని సంతోషించడంకన్నా పక్కవాడి కూడా ననే ఈర్ష్యే ఎక్కువుండడం. అందుకే ఆ గుడి మరమత్తులకి ఎవరు ముందుకు వచ్చినా రాక పోయినా ప్రసాదాల విషయంలో మాత్రం రోజుకో పితూరీ వస్తూంటుంది.

ఆ గుడియొక్క ధ్వజస్తంభం, అక్కడి వాళ్ళ అహంకారాన్ని ముల్లోకాలకీ చాటడానికి గాను పైకెగురుతున్నట్టుంటుంది. అక్కడుండే కోనేరు, అక్కడి ప్రజలు కడిగేసుకున్న పాపాల్ని మోయలేక బరువుగా బ్రతుకుతున్నట్టు, 'ఇంకా ఎందరు దిగుతారో!' అని జాలిగా చూస్తున్నట్టు, దీనంగా అరుస్తున్నట్టూ వుంటుంది. అక్కడి మంటపం చూడగానే 'రారా! పేకాడుకుందాం' అని పిలిచేలా వుంటుంది. పడగ విప్పి తలక్రిందులుగా వేలాడుతున్న పాములా వున్న ఆ కంచు గంట, 'నిన్న రాత్రివరకూ మీరు చేసిన పాపాల్ని దేవుడు క్షమిస్తాడ'ని ప్రతి ఉదయమూ గణ గణ గణమని మ్రోగుతూంటుంది.
ఆ ఆలయంలోని దేవుడు, బలవంతంగా తెచ్చి పాతేసినట్టు, ఇక తప్పదని కాస్త నవ్వుతున్నట్టూ ఉంటాడు. ఇంతచేసినా పారిపోతాడేమోనని భయపడి ఆ ఊరివాళ్ళు అతనికి నిలువెత్తు బంగారపు తొడుగులు వేయించి 'నిన్ను నమ్మకున్నందుకు వీటిని మోయలేవా?' అని మొహమాట పెట్టి అతని ముఖాన్ని చేతుల్ని తప్ప మిగిలిన విగ్రహాన్నంతటినీ ఆభరణాలతో కప్పేసారు. అతని నెత్తిమీద కిరీటం, 'మా కంటే ఎత్తుకి ఎదగకూడద'ని అక్కడివాళ్ళు శాసించినట్టుంటుంది. మొత్తం మీద ఆ విగ్రహం పదిహేనెకరాలకి ఏకైక వారసుడని చూడగానే చెప్పేలా వుంటుంది.

ఆ ఊళ్ళోని రాజకీయాల్ని, కుట్రల్ని ఒక్క మాటలోనో, ఒక్క వాక్యంలోనో చెప్పడం కష్టం. ఆ రాజకీయలకి కారణంగా ఒకొక్కసారి ఎంతో ఉన్నతకుటుంబంలోని వారి పెళ్ళిళ్ళు గప్‌చిప్‌గా [illegible]దప్పుడు కాకుండా జరిగిపోతూంటా[illegible]. పూటకి గతిలేని వాళ్ళ పెళ్ళిళ్లు అతి[illegible]వంగా జరుగుతూంటాయి! ఆ ఊళ్లో ఏదైనా పని చేస్తున్న చాలామందికి వాళ్ళా పనెందుకు చేస్తున్నారో వాళ్ళకే తెలీదు—చేయించేవాళ్ళకి తప్ప! ఆ ఊళ్లోకి పంచాయితీ ఎలక్షన్ ముందరే అర్జంటుగా సోమలారెండు కొచ్చారో చాలా మందికి తెలీదు. ఎలక్షనైన రెండో అర్ధరాత్రి అకస్మాత్తుగా యెందుకు మాయమయ్యాడో, వెంకటలక్ష్మి యెందుకు ఆత్మహత్య చేసుకుందో—ఎవరికీ తెలీదు. అక్కడి సారాబట్టీ ఎప్పుడు మూసేస్తారో, ఎందుకు మూసేస్తారో, అప్పుడప్పుడు సారా ఊరికే ఎందుకు పోస్తారో చాలా మందికి తెలీదు. ఎవరి గుడిసె ఎప్పుడు కాలుతుందో, ఎవరి తల ఎప్పుడు పగులుతుందో, ఎవరెప్పుడు ఆత్మహత్య చేసుకుంటారో, ఎవర్నెవరుంచుకుంటారో, ఎవర్నెప్పుడు వదిలేస్తారో, ఎవరు, ఎవరితో, ఎప్పుడు, ఎక్కడికి లేచిపోతారో—ఎవరూ చెప్పలేరు. అక్కడున్న ప్రతి ముగ్గుర్లో ఇద్దరు బద్ధవైరులు. పంచాయితీ బోర్డు ఆఫీసు వీధి అరుగుల్ని, న్యాయం, మంచితనం, దయ; కరుణలాంటి వాటిని పేడనీళ్ళల్లో కలిపి అలికేసారు. పొరపాటున అవి ఏ గాలికైనా కొట్టుకుని లోనికి రాకుండా ఆ ద్వారం దగ్గర ఎవరో ఒకరు ఎల్లప్పుడూ కాపలా వుంటారు. ఆ ఆఫీసుగదే అక్కడి రాజకీయాలకీ, రంకుతనాలకి మూలం. ఆటలో వున్నప్పుడు 'టోరీన్ స్పేస్కి.' బుర్రకి కూడా తట్టనటువంటి మతలబులు, మాయలు, కుట్రలు అక్కడి పెద్దలకి తడుతుంటాయి.

ఆ ఊళ్లో జరిగే ప్రతీ తగాదా గుడితో మొదలై మనుషుల్తో ముగిస్తుంది, లేదా మనుషుల్తో మొదలై గుడిలో ముగిస్తుంది.

ఆ ఊరి మొత్తం మీద మొగాళ్ళమని మీసంమీద చెయ్యేసి చెప్పుకోగలిగిన వాళ్ళూ, నలుగురిచేతా చెప్పించగలిగే వాళ్ళూ ఇద్దరే ఇద్దరు—ఒకరు రాజుగారు, రెండోది చౌదరిగారు. వీళ్ళిద్దరూ ఆ ఊరికి పెద్దమనుషులు. ఇద్దరూ హేమాహేమీలే! రాజుగారి ముత్తాతగారు ఆ ఊళ్ళోని గుడిని కట్టించేరు, చౌదరిగారి తాతగారు ఆ గుడికి పదిహేనెకరాలు రాసిచ్చేరు—అందుకే ఆ గుడిమీద వీరిద్దరికీ ప్రత్యేకమైన హక్కు సమానంగా వుంది. వీరిద్దవీ ఎదురెదురిళ్ళు. ఇద్దరూ ప్రతివిషయంలోనూ ఒకరికొకరు అడ్డు తగులుతూంటారు. ఆ ఇంటిమీది కాకి ఈ ఇంటిమీద వాలినందుకు

చౌదరిగారు ఇల్లంతటికీ వెల్లవెయిస్తే, రాజుగారు పెంకు పీకి డాబా వేయించారు. వీరిద్దరి మధ్యా పచ్చగడ్డే కాదు, పచ్చని కాపురాలు కూడా భగ్గున మండి (పోయాయి) పోతాయి. అక్కడి జనాన్ని వాళ్ళ పేర్లతో కాక 'రాజుగారి మనిషి' అనో 'చౌదరిగారి మనిషి' అనో పిలుస్తూంటారు. ప్రతిరోజూ అతని పార్టీలోని వ్యక్తి ఇతని పార్టీలో చేరడము, ఇతని పార్టీలో చేరిన అతని వ్యక్తిని ఇతనే చంపించి అతనిమీద ప్రజలకి అనుమానం వచ్చేలా చేయడంలాంటివి అక్కడ షరా మామూలే. పంచాయితీ ఎలక్షన్లొస్తే ఆ ఊళ్ళోని సగం జనం పనున్నట్టు హైదరాబాదుకో, విజయవాడకో పోతుంటారు. మిగిలిన వాళ్ళల్లో సగం మంది హాస్పత్రికి పోగా శేషించిన ప్రజ వేసిన ఓట్లతో ఇద్దరూ గెలవడమో, ఇద్దరి ఓట్లవల్ల గెలవడమో జరుగుతూంటుంది. అందుకే ఆ పెద్దలిద్దరూ తమ బాగుకన్నా రెండవవాడి పతనాన్నే కోరుకుంటారు — అందుకు చాలా ప్రాణాలు, శీలాలు బలైపోతుంటాయి. మొన్నసారి ఎన్నికల్లో రాజుగారు కేవలం రెండోట్ల మెజారిటీతో గెలిచారు. అతను గెలిచిన నాలుగో రోజున, రాజుగారికి చాకలి రత్తికి సంబంధమున్నట్టు పుకారు లేచింది. ఇది నిజం కాదని రత్తికి తెలుసు, ఇది చౌదరి పన్నాగమని రాజుకి తెలుసు. అందుకే అద్దైన ఆరో రోజున, చౌదరిగారమ్మాయి పట్నమెళ్ళింది గర్భస్రావం చేయించుకోడానికని, అందుకు కారణం మాలపల్లి వాసుడైన ఈరిగాడు అనే మరో పుకారు పుట్టింది. మొదటి పుకారుకి మల్లే యిది ఐదో రోజుకి మాయమైంది.


అన్ని తడవలకన్నా యీ తడవ వాళ్ళ శత్రుత్వం పతాకస్థాయిలో వుంది. ఒకరు ప్రళయరూపం మరొకరు ఉగ్రరూపం దాల్చారు. ప్రతి రెండోరోజు ఓ అరాచకం జరుగుతూంది. అందుక్కారణం—రాజుగారి అమ్మాయితో చౌదరిగారి మేనల్లుడు మాట్లాడం—అది చాలామంది చూడ్డం! మర్నాడు ఆ మేనల్లుడి కాలు విరిగింది. ఆ సాయంత్రమే! రాజుగారమ్మాయిని సానెకొంపలో అనుభవించానంటూ ఎవరో పట్నం నుంచి వచ్చారు. తెల్లారేసరికి వాడు మళ్ళీ కనిపించలేదు.... యిలా చిలికి చిలికి గాలివానై ఉప్పెనలా మారేలా వుంది ఊరి పరిస్థితి.

ఇలాంటి పరిస్థితుల్లో ఆ వూరి దేవుడి పండగొచ్చింది. వచ్చేవారమే దేవుడి కల్యాణం. ఆనవాయితీ ప్రకారం దేవుణ్ని రథంలో నది వరకూ తీసుకెళ్ళి అక్కడతనికి అన్ని హంగులతోను అభ్యంగన మొనర్చి, అలంకరించి, ఊరేగించి పిదప మళ్ళీ గుళ్ళో శాస్త్రీయంగా బంధిస్తారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని అక్కడ కథాకాలక్షేపాలు, తోలు బొమ్మలాటలు లాంటివి జరుగుతూంటాయి.

ఎన్ని గొడవలున్నప్పటికీ దేవుడి పెళ్ళవేసరికి అందరూ అన్ని మరచిపోయినట్లే మళ్ళీ మామూలుగా మెలుగుతూ దేవుడి పనిలో పడ్డారు.

ఆది పండగరోజు. ఊరంతా మావిడాకుల తోరణాలతో కళకళ్ళాడుతూ పవిత్రంగా కనిపిస్తూంది. దేవుణ్ని జాగ్రత్తగా రథంలోకి యెక్కించి నదికేసి రథాన్ని పోనిచ్చారు. దాదాపు వూళ్ళోని మొగాళ్ళందరూ రథంవెనకాలే వున్నారు. తిరుగుటపాలో వచ్చే దేవుడికి కొట్టాల్సిన కొబ్బరికాయల్ని, పెట్టాల్సిన నైవేద్యాలనీ సర్దడంలో ఆడవాళ్ళందరూ యిళ్ళల్లో బిజీగా వున్నారు. స్నానానంతరం శోభన ప్రాయంగా అలంకరించబడిన దేవుడు మళ్ళీ రథమెక్కాడు. ఆ రథం జనాల సంతోషంతో బాటు ప్రభంజనంలా పరిగెడ్తూంది. అలా ఉత్సాహంగా, ఉల్లాసంగా, వూగుతూ-ఉరుకుతూ, వురుకుతూ-వూగుతూ, ఉత్తేజంతో వెడుతున్న రథం, వూరి మధ్యలో కొచ్చేసరికి 'ఇక కదలను' అన్నట్టుగా ఆగిపోయింది. రాజు-చౌదరీల ఇళ్ళు ఎదాపెడా వున్నాయి. ఎవరింటి ముందు ఆగాలి? మొదటి నైవేద్యం ఎవరిది? యీ సమస్యలకి భిన్నంగా ఆ రథం అక్కడే ఆగిపోయింది.

"అట్టా సూత్తారేట్రా! రాజుగారింటికేసి



పోనిండెహే! పెసిడెంటూనేగా!"

"సర్లే వో పెద్ద సొప్పొచ్చావ్! సౌదరిగారింటిముందు ఆగడమే నాయం"

"ఏట్రా తలబిరుసు! ఒళ్ళెలా వుందే!"

"ఓసోస్! నీలాటోళ్ళని సానామందిని సూసాంలేహే! తిప్పంట్రా సౌదరిగారింటి కేసి."

"పుచ్చెలెగిరిపోతాయి లంజకొడుకుల్లారా! ఈడ గుడిని కట్టించీ, దేవుణ్నాడ పెట్టించీ మరి రాజుగారి తాతగారోళ్ళే గదెహే! అందుకనే ఆ బాబు యింటిదే మరి మొదటి పూజ!"

"పోరా పుస్కి! గుడికి, దేవుడికీ పొలం రాసిచ్చింది సౌదరిగారోళ్ళేరా! అందుకనే అల్లింటికి ముందు పోవాల!"

ఆ పార్టీవాళ్ళూ, ఈ పార్టీవాళ్ళూ అంతల్లా ఘర్షణ పడుతున్నా, అంతటినీ ఆఖరువరకూ సూద్దామనే ఓపికని కళ్ళల్లో నింపుకుని చూస్తున్నారు—రాజుగారు, చౌదరిగారు, వాళ్ళ వాళ్ళ అరుగుల మీద నిలబడి.

రథాన్ని మధ్యలో వుంచి అటు-ఇటూ రెండు జట్లల్లా పోగయ్యారు జనమంతా. ఆ సమస్య వాళ్ళవల్ల తేలదని తేల్చుకుని పూజారిని అడిగారు.

"నా దేముంది నాయనా! మీ రందరూ ఎవరిదంటే వారిదే! ఇద్దరిదీ అన్నా కాదనను" అంటూ నచ్చజెప్పబోయాడు.

"ఇద్దరి నైవేద్యమూ ఒకేసారి పెడ్తావా పంతులూ!" అంటూ హేళన చేసాడెవడో. పూజారి వంగి ఎవరికో ఏదో చెప్పబోతుండగా అవతలి పక్కవాడు—

"పూజారి అటు మొగ్గాడ్రో" అంటూ కర్ర విసిరాడు. ముసలి పూజారి నుదురు కమిలింది. రెండు వైపుల్నించీ జనం రథమెక్కబోతున్నారు. పూజారి సొమ్మసిల్లాడు.

"మీ అందరితో నాకేటెహే! దేవుణ్ని మా రాజుగారింటికే తీసుకెళ్ళి పూజ జరిపిస్తాను" అంటూ రాజుగారి పాలేరు దేవుణ్ని గట్టిగా పట్టుకుని, కిందికి దిగబోతుండగా

"మేమేం - గాజులు తొడుక్కున్నామట్రా లంజకొడకా!" అంటూ ఇవతలి పార్టీవాడూ దేవుడి మీదపడ్డాడు. ఇద్దరూ దేవుణ్ని వాటేసుకుని తమకేసి లాక్కోడానికి ప్రయత్నిస్తున్నారు.

దేవుడు మాత్రం చాలా లోతుగా నవ్వుతున్నట్టు, ఈ నాటక సూత్రధారుణ్ని నేనే అని గర్వంగా ఒప్పుకుంటున్నట్టు, ఈ మాత్రానికే కరిగిపోయేట్టయితే శిలగా ఎందుకుంటానని చిలిపిగా ప్రశ్నిస్తున్నట్టు, 'నా కోసం యెందుకీ తిప్పల'ని అమాయకత్వాన్ని అభినయిస్తు

న్నట్టూ వున్నాడు.

ఇద్దరూ హోరాహోరీగా దేవుడికోసం పోరాడుతూంటే మిగిలిన వాళ్ళు కేరింతలు కొడుతూ వాళ్ళని రెచ్చగొట్టసాగారు.

చివరికి రాజుగారి పాలేరు దేవుణ్ని పూర్తిగా ఆక్రమించుకుని క్రిందికి దిగుతూండగా చౌదరి గారి మనిషి లాగి ఓ దెబ్బేసాడు.

'ఇది ఘోరం' అన్నట్టుగా దేవుడు కింద పడ్డాడు.

'ఇదే సమయం' అన్నట్టుగా అన్ని కర్రలు పైకి లేచాయి.

కర్రకి మనిషి—

మనిషికి కర్ర—

ఎవరు ఎవర్ని కొడుతున్నారో యెవరికీ తెలీడంలేదు—

కర్రల ధ్వని ఆ వూరంతా చిక్కగా పాకుతూంది—

ఆవేశంతో ఊరు ఊరంతా కుతకుతా ఉడుకుతూంది—

వారి అవివేకానికీ, అజ్ఞానానికి చిహ్నంగా దేవుడు నేలమీద వాలుగా పడివున్నాడు. ఆ దెబ్బలాటలో దుమ్ము పైకిలేచి, మేఘాల్ని కిందికి దించినట్టు అనిపిస్తూంది.

చూపుని యెటు తిప్పినా, ఎటు ఆపినా—రక్తం!

కర్రలు విరుగుతున్నాయి!

బుర్రలు పగులుతున్నాయి!?

బూతులు వినిపిస్తున్నాయి!!!

కేరింతలు!

అరుపులు!!

ఆర్తనాదాలు!!!....

ఓహ్! నానా బీభత్సంగా తయారయిందా ప్రాంతం.

ఒళ్ళు తెలీని ఆవేశంలో, ఎంతో విలువైన తమ సొంత వస్తువు పోతున్నట్టు, పోరాడుతున్నారు అక్కడి వాళ్ళు.

దెబ్బతిన్నవాడు రెచ్చిపోతున్నాడు—

కొట్టినవాడు మరోడిమీద పడుతున్నాడు—

దేవుడి హారతిపళ్ళెం చక్రంలా తిరుగుతూంది. విరిగిన కర్రల్ని వదిలేసి దీపం సెమ్మాల్ని ఆయుధాలుగా వాడుతున్నారు కొందరు.

రాతి యుగంలో, తన ఆహారం కోసం ఓ వ్యక్తిని మరో వ్యక్తి ఒలుచుకు తింటున్నప్పుడు చిమ్మిన రక్తంకన్నా భయంకరంగా వుంది అక్కడ చిమ్ముతున్న రక్తం.

అంతంకాని, అంతర్జాతీయ సమస్యకు చేకూర్చిన అవిటి పరిష్కారంలాను,

ఇంకిపోయిన ఇతిహాసాలపై విసిరిన ఇనుప పరిహాసానికి పర్యవసానంలాను,

చరిత్రకారుడు, వీరుల బూతులకి 'శృంగార' అని అర్థమిచ్చిన అందమైన బొంకులాను,

పట్టపురాణి పడగ్గది రంకుకు పుట్టి, అడవుల్లోనో ఆశ్రమాల్లోనో పెరుగుతున్న

అసమర్థుడి రాజసంలాను, ఫుల్‌గా మందు కొట్టేసొచ్చి మద్యపానం నిషేధం గూర్చి

ఉపన్యసిస్తున్న నాయకుడి తడబాటులాను,

కడుపునిండా భోంచేసి

ఇంపోర్టెడ్ బట్టలు తొడిగి, ఖరీదైన క్రీములు, సెంటులు పులుముకొన్న మన

సినీహీరో ఆకలి నటనలానూ—

ఉన్నాడా దేవుడు—తన కాళ్ళు పట్టుకోవలసిన మనుషుల కాళ్ళకింద నలుగుతూ!


రాజుగారి పాలేరు విసిరిన దీపపు సెమ్మా చౌదరిగారి మనిషికి తగలకుండా పక్కనుంచి దూసుకుపోయి దేవుడి విగ్రహానికి తగిలింది. సెమ్మా వొంకరపోయింది, దేవుడి విగ్రహంలోని ఓ ముక్క వూడొచ్చింది — ఊడిన ముక్కలో దేవుడి కన్నుంది!

ఆ పడున్న విగ్రహానికిప్పుడు ఒకటే కన్నుంది.

'ఇది మాత్రం ఎందుకు?' అని సూటిగా ప్రశ్నిస్తున్నట్టుందా కన్ను.

ఆ రాతివిగ్రహానికే ప్రాణంవస్తే అది నేరుగా కంటి హాస్పత్రికి వెళ్ళాలి.

ఇదే అదనని చెవులపోలిగాడు దేవుడి హారాన్ని బొడ్డులో దోపుకుని పొరుగూరికేసి దౌడుతీశాడు.



ప్రజల మూర్ఖత్వం మూర్తీభవించిన వంకరపోయిన సెమ్మా ఇసుకలోనూ, రక్తంలోనూ మునిగివుంది.

రాజుగారి పాలేరు బుర్రపగిల కిందపడ్డాడు. అతన్ని కొట్టిన చౌదరిగారి మనిషిని తరుముతూ రాజుగారి మనుషులు, వాళ్ళని తరుముతూ చౌదరిగారి మనుషులూ ఎటో దూరంగా పరిగెత్తారు.

సొమ్మసిల్లిన వ్యక్తులు,

చిమ్మిన రక్తం,

విరిగిన కర్రలు,

రేగిన దుమ్ము మధ్యలో—

దేమేజీ దేవుడు!

దుర్యోధనుడి మరణానంతరం మరుభూమిగా మారిన రణభూమిలాను, అశోకుడికి జ్ఞానోదయమవడానికి ముందు జరిగిన కళింగ యుద్ధంలో మృతకళేబరాలతోటి నిండిన మహాప్రస్థానంలాను, ఉప్పెన భయంకరంగా సీ[illegible]రం చేసి, అన్నిటినీ ధ్వంసంచేసి, అలిసిపోయి, చివరికి ఏర్పడ్డ ప్రశాంతమైన వాతావరణంలో, ప్రవహిస్తున్న నీటిలో తేలుతున్న శవాల్ని చూస్తూ బ్రతికున్నవాళ్ళకి కలిగే చావుభయంలానూ—వుందా ప్రదేశం.

తనకోసమని యింత హంగూచేసి, చివరికి సాటిమనుషుల గొడవల్లోపడి తనని మరచిపోయి ఏదో తెలియని 'తన్మయత్వంలో' కొట్టుకు(ంటూ)పోయిన ఆ ప్రజల అమాయకత్వానికి జాలిగా నవ్వుతున్నట్టు—

మీ రాజకీయాలకి, కుట్రలకి నన్ను యికమీదనైనా వాడుకోకుండా, ఒకేసారి పూర్తిగా ధ్వంసం చేయండని బతిమలాడుతున్నట్టు—

ఇన్నాళ్ళూ మీ వంటివారిచేత పూజలందుకున్నందుకు మంచి శాస్తే జరిగిందని తెలుసుకున్నట్టూ—వుందా విగ్రహం.

ఆ దృశ్యం—

రాజుగారు చౌదరిగారూ రాజీ పడుతున్నది కాదు—

పూజారి పిచ్చెక్కి దేవుణ్ని మరో రాతికేసి ఎత్తి కొడుతున్నదీ కాదు—

నేనే దేవుణ్నని చిత్తుగా తాగేసిన మాలదాసు మఠం వేసుకుని రథంలో కూర్చున్నదీ కాదు—

దీనంగా కిందపడివున్న దేవుణ్ని 'అప్పుడెప్పుడో నీ ప్రసాదాన్ని దొంగతనంగా తిన్న ఋణాన్ని తీర్చుకునే అవకాశం ఇన్నాళ్ళకిలా ఇచ్చేవా దేవా!' అన్నట్టుగా ఆ శిధిల దేవుడి చుట్టూ వాసన చూస్తూ తిరుగుతున్న శునకానిది!?

జగత్క్రీడలోని అన్యాయాన్ని ఆపలేకపోతే ఆ ఫౌల్

క్రీడాకారులది కాదు—రిఫరీదే మరి! □

మినీ కథ

పెళ్ళాం మాట

ఎస్. అగ్వల్

"ఏమండీ, వాడి విషయం మీకు పట్టనట్టే వుంటారేం?" చాటలో బియ్యం యేరుతున్న శాంత గొంతులో విషాదం వినిపించింది.

రామ్మూర్తిలో ఏ మాత్రం చలనం కన్పించలేదు. యధావిధంగా పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

"పాతికేళ్లు కళ్ళలో పెట్టుకు పెంచి పెద్ద చేసిన అమ్మా నాన్నా పోయారు. నిన్నకాక మొన్న వచ్చిన పెళ్ళాం ఎక్కువయిపోయింది!" శాంత చెమ్మగిల్లిన కళ్ళు చీర కొంగుతో తుడుచుకుంది.

"శాంతా!" రామ్మూర్తి మాట వినగానే శాంత ముఖంలో వెలుగు కన్పించింది.

"ఎన్. టి. ఆర్‌తో మంచి సిన్మా తీస్తున్నారు...."ఇంకా యేదో చెప్పబోతుండగానే శాంత నీరసంగ పక్కకు తప్పుకొంది. వంట గదిలో భూకంపం వచ్చినట్టు పాత్రలన్నీ క్రింద పడ్డాయి.

"చూశారు కదా, దాని పొగరు!" శాంత రామ్మూర్తికి విన్నవించుకుంది.

"పొగరంటారేమిటి చెయ్యి జారింది!" లోపలినుంచి కోడలు గొంతు వినిపించింది.

గేటువరకు వచ్చి విసుగ్గా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు రామ్మూర్తి కొడుకు శేఖరం. రామ్మూర్తికి ఇవేమీ పట్టనట్లు మళ్ళీ పేపర్‌లో తల దాచుకున్నాడు.

లోన అత్తా కోడళ్ల మధ్య యుద్ధం జరుగుతుందని రామ్మూర్తికి తెలుసు. అది కోడలు ఈ గుమ్మం తొక్కిన మరుక్షణం నుంచే ప్రారంభమయింది.

"ఏమండీ విన్నారా? ఎంతేసి మాటలంటోందో!" శాంత ఏడుస్తూ రామ్మూర్తి దగ్గర కొచ్చింది.

రామ్మూర్తి పక్కనున్న చుట్టపీక నోట్లో పెట్టుకొని "శాంతా! కాస్త ఆ అగ్గిపెట్టె ఇలా పారెయ్యి!" అన్నాడు.

శాంత ఓ అడుగు ముందుకేసి ఆగి "అంతా నా ఖర్మ మీకే విషయాలు పట్టవు. వాడు చూస్తే విని ఊరుకుంటాడు...." అంటుండగా

"ఊరుకోపోతే ఉరేసుకోమంటారా?" కోడలు అడ్డుతగిలింది.

శాంత రామ్మూర్తికి అగ్గిపెట్టె అందిస్తూ "అంతా ఆ శేఖరంగాడిలో వుంది.మన బంగారం మంచిది కానప్పుడు...."

అత్తామామల మాటలు వినిపించకుండా రేడియో సౌండ్ పెద్దగా పెట్టి కూర్చుంది కోడలు.

"పెళ్ళాం మాట విన్నవాడు గాడిదతో సమానమండీ. అది ఎలా చెబితే అలా ఆడితే వాడికీ గాడిదకీ తేడా ఏమిటి?" శాంత ఇంకా గొణుగుతూనే వుంది.

"ఇంతకీ ఏం చెయ్యమంటావు?" రామ్మూర్తి విసుగ్గా అన్నాడు.

"నా మాట విని...."

శాంత మాటకు అడ్డుతగిలి "నన్ను గాడిదని కమ్మంటావు" అన్నాడు రామ్మూర్తి.

"అలా అంటారేమిటండీ?"

"ఇప్పుడే అన్నావు కదా పెళ్ళాం మాట విన్నవాడు గాడిదని."

రామ్మూర్తి మాటలకు శాంత ముఖం చిన్నబోయింది. □

కొండంత దీపం

పి. యస్. నారాయణ

వ్యాపారరీత్యా హైద్రాబాద్‌లో వారంరోజుల పని తగిలింది రామానికి. అటు యిటు తిరగాలి. బస్సులు టైంకు దొరకవు. ఆటో లంటే ఖర్చు యెక్కువ. అందుకే స్కూటరు తీసుకుని వెళితే హాయిగా వుంటుందనిపించి నల్లగొండ నించి ఉదయం ఎనిమిది గంటల కల్లా—బ్రీఫ్‌కేస్‌లో రెండుజతల గుడ్డలు పెట్టుకొని బయల్దేరాడు స్కూటర్ మీద రామం.

వాతావరణం చల్లగా వున్నది. ఆకాశానికి పట్టిన మబ్బులు సూర్యుణ్ణి కనబడనీయటం లేదు—ఎక్కడా ఆగకుండా వెళితే మూడు గంటల ప్రయాణం.

ఎలాగూ రామం పెద్దన్నయ్య హైద్రాబాద్ లోనే వున్నాడు. అక్కడ వుండవచ్చు.... వదిన యెప్పుడూ అంటూ వుంటుంది—శారదను తీసుకురాగూడదా అని....శారద బయల్దేరే....పిల్లలకు పరీక్షలవ్వటంతో యింట్లో వుండక తప్పలేదు....

ఇరవై నిముషాల్లోనే నార్కెట్‌పల్లికి వచ్చాడు రామం. అసలే చల్లటి వాతావరణం. ఆపైన రోడ్డు పక్కగా గుబురుగా పెరిగిన చింతచెట్లు.

నార్కెట్‌పల్లిలో ఆగి ఒక కప్పు చా త్రాగి రామ్‌ప్యారీ వేసుకొని ఫోర్ స్క్వేర్ ముట్టించి మళ్ళా స్కూటర్ ఎక్కాడు రామం. సీటు క్రిందగా బ్రీఫ్‌కేస్ వేలాడుతుంది-వెనుక శారద కూర్చుని కబుర్లు చెబుతుంటే—నడుం మీద చేయివేసి మరీ—యెంత బాగుండేది!

ఆలోచనలు భార్య శారద చుట్టూ తిరుగుతున్నాయి. రామం స్కూటర్‌ని విశాలమైన రోడ్డుమీద వేగంగా పోనిస్తున్నాడు. పైన మబ్బులు ఎవ్వరికీ అందగూడదన్నట్లుగా పరుగెడుతున్నాయి. రోడ్డుపక్కన రాళ్ళ గుట్టలు....పలచబడ్డ చెట్ల గుబుర్లు....

పడమటి గాలి ఈదురోమంటోంది. వాన వస్తే....గాలి మరింత ఎక్కువయితే తుఫానుగా మారితే....

రావటానికి వీల్లేదు....తెల్లటి మబ్బులు వానకు సూచన గాకపోవచ్చు....వీస్తున్న గాలి మబ్బుల్ని తరిమివేయవచ్చు....ఏదైనా ఇంకా రెండు—మూడు గంటలు తనవి కావు అనుకుంటే తను హైద్రాబాద్‌లో వుండిపోతాడు.

శారదను తీసుకురానందుకు వదిన విసుక్కుంటుంది.

కొండలాంటి గుట్ట... స్కూటరు ఎత్తు మీదకు ఎక్కుతుంది....కొండ మలుపు తిరిగితే పల్లం....ఆపైన ఓ గ్రామంగూడా వుండాలి. అక్కడ....బాగా ఎత్తుకు వచ్చేసింది స్కూటరు. మలుపు తిరిగింది.

ఓ ఆర్టీసీ సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సు రోడ్డు పక్కగా ఆగివున్నది. దాని పక్కన ప్రయాణీకు లంతా దిగి నిల్చొని వున్నారు.

యాక్సిడెంటా? .... ఈ మధ్య యాక్సిడెంట్సు ఎక్కువవుతున్నాయి....

గేదె చచ్చిందో....మనిషి చచ్చాడో.... డ్రైవర్ ఉద్యోగమంత ప్రమాదకరమయిన ఉద్యోగం ఈ ప్రపంచంలో మరొకటి వుండదనిపించింది....అతడిది తప్పున్నా లేకపోయినా అతడంటే ఎవ్వరికీ జాలివుండదు....

బస్సు దగ్గరకు వచ్చి స్లో చేశాడు రామం. జనం దిగాలుబడి నిల్చొని వున్నారు.

"ఏమైంది?"

ఒక కుర్రవాడు నవ్వాడు...."మా అదృష్టం. దేనికీ పెట్టకముందే బ్రేకులు ఫెయిలయినయ్యని ఆపేశాడు డ్రయివర్ బాబూ!" అన్నాడు.

పక్కకుతిప్పి ముందుకు వచ్చాడు రామం.

"ఎక్స్యూజ్ మీ...." ఓ ఆడగొంతు. కాలు

బ్రేకును నొక్కేసింది.

మెడ వెనక్కు తిప్పాడు.

ఓ అందమైన అమ్మాయి అతడివైపుకే చూస్తూ "మీరు హైద్రాబాద్ వెళుతున్నారా?" అన్నది.

జనం అప్పటికే నలుగురయిదుగురు మూగారు స్కూటర్ చుట్టూ....

"అవును!"

"లిఫ్టు యివ్వగలరా?" ఆశగా అడిగింది.

ఒక్క క్షణం తడబడ్డాడు రామం. అందమయిన ఆడకూతురు అంత యిదిగా అడుగుతోంటే యెలా కాదనాలో అతడికి అర్థం కాలేదు....

"రండి!" చిన్నగా గొణుక్కొంటున్నట్లుగా అన్నాడు.

అక్కడ జనంలో నిశ్శబ్దం—ఆవిడ ధైర్యానికి వాళ్ళ నోళ్ళు పడిపోయినయ్యా అన్నట్లుగా.

"ఒక్క నిముషం....నా బ్యాగ్ తెచ్చుకుంటాను!" అంటూనే బస్సెక్కి—ఎయిర్ బ్యాగ్ తీసుకొని పరుగెత్తుకుంటూ వచ్చింది.

వెనక కూర్చుంటూ రామంకూ తనకూ మధ్యలో బ్యాగ్ పెట్టింది.

"థాంక్సండీ!"

"దట్సాల్ రైట్....అర్జంటుగా వెళ్ళాలా ఏఁవిటి?" అన్నాడు స్కూటర్ను ముందుకు దూకిస్తూ రామం.

"అవునండీ...రెండు గంటలకు ఇంటర్వ్యూ వున్నది....సరిగ్గా వెళ్ళివున్నట్లయితే ఈ బస్సు పదకొండు గంటలకు జేరివుండేది....అనుకోకుండా ఈ అవాంతరం వచ్చిపడింది ఇప్పుడు. డ్రైవర్ నార్కెట్‌పల్లి వెళ్ళి రిలీఫ్ తేవాలిట. ఎప్పుడు వెళతాడు....ఎప్పుడు తెస్తాడో ఆ భగవంతుడికే తెలియాలి....ఆ బస్సుకోసరం కూర్చుంటే అక్కడ యింటర్వ్యూ హుళక్కే!"

"దేనికి?"

"ఒక కంపెనీలో రిసెప్షనిస్టుగా!"

—నిజమే!....ఆ అమ్మాయి రిసెప్షనిస్టుగా చాలా బాగుంటుందనిపించింది రామానికి.

సన్నగా పొడుగ్గా పెద్దపెద్ద కళ్ళతో — చూచిన ఆ ఒక్కసారే— చెవులకు వూగుతున్న గాజుల్లాంటి రింగులు ఆ అమ్మాయి అందాన్ని మరింత పెంచినయి అనిపిస్తోంది.

తనది కారయితే యెంత బాగుండేది— పక్కనకూర్చోపెట్టుకొని ఆ అమ్మాయి మొఖంలోకి చూస్తూ డ్రైవ్ చేసేవాడు.

"మీరు ఒక్కరే బయల్దేరారు....ఒకరోజు ముందు బయల్దేరితే ఈ హడావుడి వుండేది కాదు గదా!"

"మొదటిదానికి సమాధానం [illegible] ఒక్కదాన్నయినా వెళ్ళగలనననే ధైర్యం వున్నది. రెండోది....రెండు గంటలకుగదా యింటర్వ్యూ అని ఉదయాన్నే బయల్దేరాను .... మళ్ళీ ఇంటర్వ్యూ అవ్వగానే రాత్రికి బయల్దేరితే తెల్లవారేటప్పటికి మా ఇంట్లో వుండిపోతాను!" నవ్వినట్లే అనిపించింద.

పక్కనే వున్నా ఆ నవ్వుల్ని చూడలేని తానెంత దురదృష్టవంతుడో అనుకున్నాడు రామం.

"హైద్రాబాద్‌లో మీకు తెలిసిన వాళ్ళెవరూ లేరా?"

"ఉన్నారుగాని....వాళ్ళిళ్ళకు వెళ్ళటం నాకంత యిష్టముండదండీ!"

"పోనీయ్....హోటల్లోనైనా వుండవచ్చు గదా?" స్కూటర్ మ్రోతలో తన కంఠం తనకే వికృతంగా వున్నట్లనిపించింది.

ఫక్కున నవ్వింది ఆ అమ్మాయి "హోటల్ గదుల్లో ఒక్కదాన్నే వుండాలంటే చచ్చేభయం బాబూ...."

"అన్నట్లు మీ పేరు అడగనేలేదు. నా పేరు రామం!"

"సౌమ్య!"

"హౌ స్వీట్!"

"థాంక్యూ!"

జీవితంలో అందంగా హాయిగా ఆకాశవీధుల్లో తిరగడం కంటే మించిన ఆనందం ఇంకెక్కడ వున్నది?....అందునా స్కూటర్ మీద వెనక కూర్చున్నది అందమైన అప్సరసే అయితే కావాల్సిందేఁ వున్నది.. ఆ పైన ఆ అమ్మాయి భార్య గాకుండా మరో మనిషయితే ఇంకా చెప్పేదేఁవున్నది!



"దేఁవుడూ! నీకిదే నా కృతజ్ఞతలు!"

"మీరు....?!" ఆ అమ్మాయి అర్ధోక్తిలో ఆగినట్లుగా వున్నది.

"నేను బిజినెస్ మీద నల్లగొండ నుంచి హైద్రాబాద్ వెళుతున్నాను. ఒక వారం రోజులు పని....అటూ యిటూ తిరగడానికి వీలుగా వుంటుందని స్కూటర్ తీసుకొని బయల్దేరాను. నాకూ బంధువులు వున్నారుగాని వాళ్ళిళ్ళకు

వెళ్ళి స్వేచ్ఛను పోగొట్టుకొని మర్యాదల వడుమ బిగుసుకు కూర్చోవటం నా కిష్టంలేదు. స్వేచ్ఛగా హోటల్ గదుల్లో గడిపేస్తే జీవితాని కదో థ్రిల్లు—డబ్బు పోయినా!" గర్వంగా అన్నాడు.

"నిజం!" ఆ అమ్మాయీ నవ్వింది.

—అన్నీ వడ్డించిన విస్తరి ముందు చేతులు కట్టేసి కూర్చోబెట్టినట్లుగా వున్నది రామం పని....

రోడ్డుపక్కన తుప్పలు గిరగిరా తిరుగుతూ వెనక్కి వెళ్ళిపోతున్నాయి....ఎర్రని రాళ్ళ గుట్టలమీద గొర్రెల్ని కాస్తున్న కుర్రవాళ్ళు కర్రలు పట్టుకు పరుగెడుతున్నారు.

సౌమ్యను చూడాలి....

ఎలా?....

—అంత అందమయిన అమ్మాయిని ఎదురుగ్గా కూర్చోబెట్టుకొని కబుర్లు చెప్పుకుంటుంటే యెంత బాగుంటుంది?....

షడన్‌గా కాలితో—స్కూటరుకు అడ్డం వచ్చిన గొర్రెల్ని ఆసరాగా తీసుకొని—బ్రేక్‌ను నొక్కాడు....

సౌమ్య చటుక్కున అతడి బుజం పట్టుకొని వీపుకు అనుకుపోయింది.

అతడి కదే కావల్సింది.

"జాగ్రత్తండీ....వెధవ గొర్రెలు!"

"భయమేసిందండీ బాబోయ్ .... తిన్నగా పోనీయండి!" వెనక్కి కూర్చుంటూ అన్నది సౌమ్య.

రామం నసుగుతున్నట్లుగా, "మీరు జాగ్రత్తగా కూర్చోండి!" అన్నాడు-మెడ పక్కకు తిప్పి....బుజంమీద చేయివేసిన ప్రదేశాన్ని ఆప్యాయంగా చూచుకుంటూ.

పక్కకు జరిగిన హ్యాండ్‌బాగ్‌ను సరిగ్గా పెడుతూ "హైవేస్‌మీద ప్రయాణం చేయటంలో ఇదే భయం...." అన్నది.

"మీరేం భయపడబోకండి. నేను ఐదేళ్ళ బట్టీ ఈ స్కూటర్‌ను నడుపుతున్నాను—యాక్సిడెంట్ ఫ్రీ!" అన్నాడు రామం ఆమెకు ధైర్యం చెబుతున్నట్లుగా.

పక్కగా లారి దూసుకుపోతోంటే రోడ్డు మీదనుంగి క్రిందకు దింపాడు స్కూటరును.

"మీరు ఉద్యోగం చేయాలని ఎందుకనుకుంటున్నారు?"

"అలా అనుకోవటం తప్పా?"

"అని గాదు....కారణం వుండాలి గదా.... మీకు వివాహం అయిందిగదా!" అది నిజమనే సంగతి అతని ఉత్సాహంమీద చన్నీళ్ళు చల్లుతున్నా అన్నాడు.

"నా జీవితానికి పడ్డ వివాహమనే సంకెళ్ళను—విడాకులనే కత్తెర్లతో త్రుంచివేసే రోజులు చాలా దగ్గర్లోనే వున్నాయి!" చాలా బాధగా అన్నట్లనిపించింది.

"అదేంటి?" హఠాత్తుగా బ్రేకునొక్కుతూ అన్నాడు.

"నిజం అది!"

"ఎందుకని?"

"నాకు భర్త అయిన ఆ మొగమహారాజు నా కాలేజీ జీవితం గురించి ఏదో విన్నాడట.... అందుకని ఆయన నాతో సుఖంగా జీవితం వెళ్ళబుచ్చలేడట!" అన్నది దిగులుగా.

'ఎవ్వడా మొగమహారాజు....అంత అందమయిన సౌమ్యను కాదనే బలహీనత అతడికెలా కలిగింది? అలాంటి కధలు అందమయిన అమ్మాయిలకు లేకపోతే అమ్మమ్మలకుంటాయా!'

"సంకుచిత మనస్తత్వ మన్నమాట!" అన్నాడు—కవ్విస్తున్నట్లుగా.

క్రింది పెదిమను పంటితో నొక్కిపట్టి గట్టిగా సీటును పట్టుకు కూర్చున్నది సౌమ్య.


"దిగండి!" స్కూటర్ ఆపుతూ అన్నాడు రామం పక్కగా బస్‌స్టాపులో.

"దేనికి?"

"కాస్త యేదైనా డ్రింకు త్రాగి వెళ్దాం.... వేడి శరీరానికి చల్లని పానీయం యెంతైనా అవసరం!"

కూల్‌డ్రింక్స్ షాపు నుండి రెండు గోల్డు స్పాట్ తీసుకువచ్చాడు—స్కూటర్ దగ్గర నిల్చున్న సౌమ్య దగ్గరకు.

"యూ ఆర్ గివింగ్ ఎ గుడ్ కంపెనీ....



ఏ నైస్ డే ఫర్ మీ!" అన్నాడు కళ్ళలో మెరుపును చిందిస్తూ—ఆమె అందాన్నే సిప్ చేస్తున్నట్లుగా గోల్డు స్పాట్‌ను స్ట్రా ద్వారా సిప్ చేస్తూ.

"టు మీ ఆల్సో....థాంక్యూ!"

"మీరు హైద్రాబాద్‌లో ఎన్నాళ్ళుంటారు?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ—రాత్రికే వెళ్తున్నానని వొకసారి చెప్పింది గుర్తున్నా.

"రాత్రికే వెళ్ళవచ్చు!"

"అంటే డిసైడ్ చేసుకోలేదా ఇంకా!"

—ఆకాశం మీద మబ్బులు క్రిందగా వస్తున్న గాలుల్ని చల్లబరుస్తున్నాయి—వాన వస్తుందా?

'సన్నటి తుప్పర పడితే బాగుండు!' అన్నట్లుగా ఒక్కసారి అకాశంలోకి చూశాడు రామం.

"అక్కడ ఇంటర్వ్యూనిబట్టి వుంటుంది!"

గోల్డుస్పాట్స్ అయిపోయాయి....రామం బాటిల్స్ తీసుకువెళ్ళి డబ్బులతోపాటు యిచ్చేసి వచ్చాడు.

స్కూటర్‌మీద కూర్చోబోతూ "ఆ బ్యాగ్ యిలా యివ్వండి....నా కాళ్ళదగ్గర పడేస్తాను!" అన్నాడు రామం—తమ మధ్య అదో పెద్ద కొండలా [illegible] పీలవుతూ....అది తీసేసిన తరువాత పోతుండగా రెండు జర్కులిస్తే అంత అందమయిన ఆడపిల్లా తనని బల్లిలా అంటుకుపోతుందనేది ఖాయం.

"థాంక్స్....అక్కర్లేదండీ!"

"ఫరవాలేదండీ....యివ్వండి!" అంటూనే—లాక్కుంటున్నట్లుగా తీసుకొని బ్రీఫ్‌కేస్‌తో పాటు తగిలించేశాడు. "నాకేం యిబ్బందిలేదు. అనవసరంగా యిరుక్కు కూర్చోవటం దేనికి? తరువాత సడన్ బ్రేక్ వేసినప్పుడు యెగిరి క్రింద పడితే రాబోయే ఉద్యోగం ఎలా వున్నా కాలో చేయో విరగటం మాత్రం ఖాయం!" నవ్వుతూ అన్నాడు.

"జీవితంలో అలా రాసిపెట్టివుంటే చేయగలిగిందేం వున్నది చెప్పండి!...." అన్నది నవ్వుతూ.

"సరే....అలా అయితే....ఇంకేదైనా అనుకోనిది జరిగిందే అనుకోండి—అప్పుడూ అలా జరగాల్సి వున్నది గాబట్టి జరిగింది అనుకుంటారా?" అన్నాడు రామం — తను సౌమ్యతో ఓ వారం రోజులు హోటల్లో ఒకే గదిలో గడిపేస్తే—ఆ అమ్మాయి అలా అను

కునే వూరుకుంటుందా?

—అలా అనుకొంటే యెంత బాగుంటుంది....?

"అఫ్‌కోర్స్....అన్నిటికీ అలా చెప్పుకో లేకపోవచ్చు....!" కలవర పడుతున్నట్లుగా అన్నది.

"మరి—" స్పీడెక్కించాడు రామం.

కళ్ళు తిప్పుతూ తనని కవ్విస్తున్న సౌమ్యను చూస్తుంటే ఇక్కడకు హైద్రాబాద్ ఒక జీవిత కాలం దూరం అయితే యెంత బాగుంటుంది అనుకొన్నాడు రామం!

"మీవారు యేం చేస్తుంటారు?" అన్నాడు మొఖం కాస్త వెనక్కు తిప్పి.

"గవర్నమెంట్ జాబ్!"

"ఐనీ....హైద్రాబాద్ మీరింతకు ముందు ఎప్పుడైనా వచ్చారా?"

"ఒకటి రెండుసార్లు వచ్చాను!"

"అన్నీ చూచారా?"

"లేదండీ!"

ఒక్కక్షణం మనస్సులో మాటల్ని కూడ గట్టుకుంటున్నట్లుగా ఆగాడు.

"నేనూనూ...." అతడు మాట్లాడుతున్నది అబద్ధమని అతడి కలవరపాటే చెబుతున్నది.

"నిజమా?"

"అవునండీ!"

"వారం రోజులు వుంటానంటుంటిరి గదా! ఇంకేం...."

"ఒక్కణ్నే చూడాలంటే బోరండీ బాబు!"

"పోనీయ్....మీ శ్రీమతిని తీసుకురాలేక పోయారా!"

నిట్టూర్పు విడిచినట్లుగా మూలిగాడు రామం. గబగబా అబద్ధాల భవంతులకు పునాదులు వేయసాగాడు. "నాకు జీవితంలో కావాల్సినవన్నీ వున్నాయి....కావల్సినంత డబ్బు వున్నది. లేనిదల్లా ఒక్క సుఖమే. దాని ఆరోగ్యం ఏమీ బాగోదండీ. అసలు మంచంలో నుంచి లేవలేదు...."

"సారీ!"

"నా జీవితానికి మరొకరు విచారిస్తున్నారంటే నాకు చాలా బాధగా వుంటుంది!"

"దానితో ఉపశమనం గూడా కలగవచ్చు గదా!"

"నో!"

సౌమ్య మాట్లాడలేదు.

దూసుకొంటూ ఓ గడ్డి లారీ వెళ్ళిపోయింది.

"పోనీయ్....ఒక పని చేద్దామంటారా?"

"చెప్పండి!"

"మీరు యేమంటారో నని భయంగా వున్నది!"

"మనిషికి భయమే ఆయుక్షీణం—భయ పడేదేమున్నదండీ. నా కిష్టమయితే 'ఊఁ' అంటాను. లేకపోతే సారీ అంటాను. నేను ఎమ్ ఎస్సీ చదివాను తెలుసా!"అన్నది సౌమ్య గర్వంగా.

"మీ మాటలు నాకు ధైర్యాన్ని కలిగిస్తున్నా పూర్తి భయాన్ని పోగొట్టటంలేదు...."

"ఏం ఫరవాలేదు చెప్పండి!"

"—ఎలాగూ మీకు జీవితంలో అంతగా సుఖం వున్నట్లు కనబడటంలేదు. నా సంగతి సరేసరి. మీ రేమీ అనుకోనంటే ఓ వారం రోజులు హైద్రాబాద్‌లో సరదాగా గడిపేద్దామా?"

ఎదురుగ్గా ఆవు దూడ అడ్డంపడి పరుగెత్తుకొచ్చేటప్పటికి సడన్‌గా బ్రేకు నొక్కాడు కాలితో. సౌమ్య ఊగిపోయి చటుక్కున అతడి నడుం పట్టుకొని, 'అమ్మో' అన్నది.


రామం స్కూటర్ని ఆపి పక్కకు తోశాడు. పక్కగా వంతెన, వంతెన పక్కగా చెట్లు, సగం ఎండిన చెరువు.

రామం కాళ్ళు రెండు క్రింద పెట్టి—నెర్వస్‌గా చూస్తూ, "పది నిముషాలు రెస్టు తీసుకుందామా?" అన్నాడు వెనుతిరిగి సౌమ్య మొఖంలోకి చూస్తూ.

"సరే....కానీయండి!" పలువరస తళుక్కుమనేలా నవ్వి, అతడి నడుంమీద నుండి చేయి తీసేసింది "యింటర్వ్యూ టైంకి జేర్చే బాధ్యత మీదే!"

"తప్పకుండా....జస్టు టెన్ మినిట్స్!"

యిద్దరూ రోడ్డు దిగి గడ్డి మీదగా నడిచి వంతెన పక్కగా చెట్ల క్రిందకు వెళ్ళారు. చల్ల



గాలి హాయిగా వున్నది....చెరువులో నుంచి ఒక్కసారిగా కొంగలన్నీ—కాగితాల్ని బర బరా చింపుతున్నట్లుగా మ్రోత చేస్తూ లేచాయి ఆకాశంలోకి.

"ఇక్కడ కాస్త బాగున్నది. కూర్చుందామా!" అన్నాడు రామం.

"అలాగే...."

ఇద్దరూ కూర్చున్నారు.

సౌమ్య రామం ఎదురుగా కూర్చున్నది ఎడంచేత్తో గడ్డిపీకుతూ. "మీకు హైద్రాబాద్ చూడాలని వున్నదా?" అన్నది అతడి మొఖంలోకి చూస్తూ.

రామం హుషారుగా ఓ చిల్లపెంకు తీసుకొని చెరువులో నీటిమీదకు విసిరాడు.

రోడ్డుమీద రెండు లారీలు పోటీ పడుతున్నట్లుగా ముందుకు పరుగెడుతున్నాయి.

"యస్ మేడమ్!"

"చూద్దామా మరి....మరి బిజినెస్ మీద వచ్చారు గదా....టైం స్పెండ్ చేయగలరా!" అన్నది గడ్డిని మునవేలిమీద అనించి చూస్తూ.

"విత్ ప్లజర్!" అన్నాడు రామం ఆనందంతో....అతడి గుండెలు సంతోషంతో యెగిరెగిరి పడుతున్నాయి.

ఎంత సుదినం ఈ రోజు?

ఎంత అదృష్టం తనది?

"వారం రోజులు వుంటావా సౌమ్యా నువ్వు. హోటల్లో వుందామా మరి?" గాలిలో తేలిపోతున్నట్లుగా లేస్తూ అడిగాడు.

"అబ్బే వారం రోజులెక్కడండీ. మీరు కాదూ కూడదూ అంటే రెండు రోజులు!" అన్నది మొఖం పక్కకు తిప్పుకుని తన్నూ లేస్తూ "వెళ్దామా....పెంద[illegible] కాస్త రిలాక్స్ అయితేనేగాని యింటర్వ్యూకి వెళ్ళలేను మళ్ళా!"

"ఓ.కే వెళ్దాం .... ముందు వెళ్ళగానే హోటల్లో రూం తీసుకుందాం. ఓ గంట పడుకుందువుగాని స్నానం చేసి. ఆ పైన నువ్వు యింటర్వ్యూకి వెళ్ళవల్సిన కంపెనీకి వెళ్దాం. అవును..నాకు తెలిసిన ఒకళ్ళిద్దరు స్టేట్‌గవర్నమెంటులో మంచి పొజిషన్లో వున్నారు. వాళ్ళకెవరికైనా ఈ కంపెనీకి సంబంధించిన వాళ్ళు తెలుసేమో కనుక్కుంటాను!"

"థాంక్యూ!"

"వెళ్దామా!"

"ఓకే!"

"ఓకే!"

"మీరు దేవుడిలా కలిశారన్నమాట నాకు!"

"నో....నో....అంత గొప్పగా చెప్పుకో నక్కర్లేదు!" సిగ్గుపడుతున్నట్లుగా నసిగాడు రామం.

మరల 'రంయ్' అంటూ స్కూటర్ బయ ల్దేరింది.

సన్నని తుప్పర పడుతోంది గాలిని పూర్తిగా చల్లబరుస్తూ.

"వాన వచ్చేలా వున్నదిగాని గట్టిగా పట్టుకు కూర్చో సౌమ్యా....స్పీడుగా వెళ్ళిపోదాం!" అన్నాడు రామం—తన నడుం మీద చేయివేసి పట్టుకోమన్నట్లుగా.

"పోనీయండి....ఫరవాలేదు....నాకు అలవాటే లెండి!"

స్కూటర్ స్పీడందుకుంది.

ద్రాక్షతోటలు హైద్రాబాద్ వచ్చేవారికి స్వాగత గీతాలు పలికేటందుకుగాను కట్టిన మామిడితోరణాల్లా కనబడుతున్నాయి.

'ఈ రెండురోజులూ తన స్వంత పనులకు పంగనామాలు పెట్టేయాలి!' అనుకున్నాడు హాయిగా రామం. "అంతగా అయితే ఇంకో రెండురోజులు యెక్కువ వుంటే సరిపోతుంది ఇక్కడ."

ఆలిండియా రేడియో వారి ట్రాన్స్మిటింగ్ టవర్స్ అంతపెద్ద పట్టణానికి •కావలాదారుల్లా నిలబడివున్నాయి.

'విడిపోయేముందు జీవితాంతం జ్ఞాపకం వుండేలా—దాన్ని చూచినప్పుడల్లా ఈ మధుర క్షణాలే గుర్తుకువచ్చేలా-ఏదైనా ప్రజంటేషన్ యివ్వాలి సౌమ్యకు!'

మనుష్యుల కదలికలు ఎక్కువయినయి.... రిక్షాలు....ఆటోలు .... ఇంకాస్త ముందుకు వెళ్ళేటప్పటికి పొగలు గక్కే ఆర్టీసీ బస్సులు.

"హైద్రాబాద్ వచ్చేసింది సౌమ్యా!" హాయిగా అన్నాడు.

అతడి స్కూటర్ గాలిలో గజం ఎత్తున పోతోంది. దానిమీద అతడు పదడుగుల ఎత్తున మరీ కూర్చున్నాడు.

ఇక ఎంత హాయి! ఎంత హాయి!

సన్నని తుంపరపోయి చల్లని గాలే మిగిలింది.

సౌమ్య మాట్లాడలేదు.

మలక్‌పేట వచ్చేటప్పటికి రద్దీ యెక్కువయింది. బ్రేకు ఎక్కడ వేయాల్సివస్తుందో అన్నంత జాగ్రత్తగా వున్నాడు.

"జాగ్రత్త సౌమ్యా! గట్టిగా పట్టుకో!" ఆప్యాయంగా అన్నాడు.

"అలాగే."

స్లో చేస్తూ "ఏ హోటల్‌కు వెళ్దాం"అన్నాడు కాస్త వెనక్కు వంగి మెడ పక్కకు తిప్పుతూ మురిపెంగా.

"దేనికి వెళ్దామంటారు!" పెదాలు బిగించి చిన్నగా నవ్వింది.

"కాంటినెంటల్....న్యూ కాంటినెంటల్ తాజమహల్....న్యూ తాజమహల్ ....శ్రీదేవి సిద్ధార....ద్వారకా ....అయోధ్య....మధుర.... మహామాయా నీ యిష్టం ఏది కావాలో కోరుకో" అని చిన్నగా హుషారుగా అని, "పేరులో ఏమున్నది. మనకు ఏదైనా స్వర్గమే!" అన్నాడు నవ్వుతూ. బాదర్‌ఘాట్ బ్రిడ్జిని ఎండిపోయిన మూసీని చూచుకుంటూ దాటింది స్కూటర్.

"ఎటు పోనివ్వమంటావ్ చెప్పు అటువైపా యిటువైపా....ఎటువైపు!"అన్నాడు స్లో చేస్తూ ముందున్న మూడు రోడ్లవైపు చూస్తూ.

"ఒక్కక్షణం ఆపుదురా!"

"దేనికి."


"ప్లీజ్!"

"ఓకే!"

సౌమ్య స్కూటర్ మీద నుంచి దూకినట్లుగా దిగింది. కాస్త ముందుకు వంగి అతడి కాళ్ళ దగ్గరున్న హ్యాండ్‌బ్యాగును చటుక్కున చేతిలోకి తీసుకొని, "థాంక్యూ మిస్టర్ రామం. థాంక్స్ ఎలాట్!" అంటూనే—ఆమె చేస్తున్నదేమిటో అర్థంగాక బిత్తరపోయి—కోలుకుండేలోగానే పక్కన నిలబడివున్న ఖాళీ ఆటోలో కూర్చుని, "థాంక్యూసర్!" అంటూనే ఒకసారి ముత్యాలు వెదజల్లుతున్నట్లుగా హాయిగా నవ్వేసి "పోనీయ్!" అన్నది తల ఎగరేస్తూ, ఆటో, డ్రైవర్‌తో.

సౌమ్య అలా తల ఎగరవేసిన తీరు—మిస్టర్ రామం నీలాంటి వాళ్ళను ఇంతవరకూ లక్షమందిని చూచాను....నన్ను నేను ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు....దానికోసరం ఎన్ని కథలైనా చెప్పి మిమ్మల్ని డింకీలు కొట్టించగలదని గుర్తుంచుకో ఈ సౌమ్య—అన్నట్లుగా వున్నది!! □

సిల్లీ



'రాజ్‌కుమార్ మెహ్రా'

"హాయ్ హాయ్! ఈ రోజాదివారం"అన్నాడు రావునాధం నిద్దర్లో పలవరిస్తున్నట్లు.

"అయితే ఈవేళ మనకు వంట పనిలేదన్న మాట. హాయ్......హాయ్......ఆదివారం" అన్నది పద్మావతి కాఫీ కప్పుతో మంచం పక్కనే నిలబడి.

"మైగాడ్! ఆదివారాన్ని సోమవారంగా మార్చకు" అన్నాడు రామనాథం లేచి కూర్చుని కాఫీ కప్పు అందుకొంటూ.

"అయితే ఈ రోజు నా కన్ని పనుల్లో మీరు సాయం చేయాలన్న మన ఒప్పందాన్ని మర్చిపోగూడదు" అంది పద్మావతి.

"అలాగే. కాని, నా సహాయాన్ని నువ్వు తిరస్కరించగూడదు" బాత్రూంవేపు నడుస్తూ అన్నాడు రామనాథం.

"నాన్న ఈజ్ ఎ గుడ్ బాయ్" అన్నాడు ఓ మూల కూర్చొని చరిత్ర పాఠం చదువుకొంటున్న సుపుత్రుడు చిరంజీవి.

టిఫిన్ తీసుకోడం పూర్తయ్యేక, పద్మావతి బాత్రూంవేపు నడుస్తూ, "నే స్నానం చేసొస్తా, కాస్త వాడి చదువు సంగతి చూడండి" అంది.

"సారీ పద్మా! నువ్వు చేయబోయే ప్రతి పనికి నేను సాయం చేయాలన్న విషయం మర్చిపోతున్నావ్" అన్నాడు రామనాథం సీరియస్‌గా.

"వాడ్డూ యూ మీన్?" పద్మావతి ఆశ్చర్యంగా చూసింది.

"నీవు రుద్దాలి గదా నేను" చిలిపిగా అన్నాడు రామనాథం.

"షటప్!" చిన్న చిర్నవ్వుతో బాత్రూం తలుపు భళ్ళున మూసుకొంది పద్మావతి.

ఆ క్రితం రోజే పోస్టుల్లో వచ్చిన కొత్త మాసపత్రికలో రావిశాస్త్రి రాసిన గెస్ట్ ఎడిటోరియల్ చదువుతూ తన్మయత్వంలో మునిగిపోయాడు రామనాథం.

ఎ....క్క....డో వున్న హైద్రాబాదును రాజధానిగా చేసుకొని, ఆ ఊరు బతుకుతోంది. ఆ ఊళ్ళో పేదలు పనిజేయడానికో పంచదార మిల్లుంది. అ పంచదారను కూలీలకు బ్లాకులో అమ్మడానికి చాలా దుకాణాలున్నాయి. ఎగ్రికల్చర్ వాళ్ళ ఆఫీసులు మైన్ రోడ్లోను, గోడౌన్లు ఊరికి ఉత్తరంగా మారుమూలల్లో అన్నిటికీ అనుకూలంగానూ వున్నాయి. ఫారెస్టర్ వారి కార్యాలయం మాంచి జనసమ్మర్దం కలిగిన ప్రాంతంలో, అతి పకడ్బందీగా కట్టిన భవంతిలోనూ, ఫారెస్ట్ మాత్రం ఆ ఊరికి పదిమైళ్ళ దూరంలోనూ వుంది. పాలప్రాజెక్ట్ ఆఫీసరు నోట్లోనే కాకుండా ఆ ఊళ్ళోనూ బూతులున్నాయి. 'భవనాలు, రహదారుల' వారి ఆఫీసు సరైన రోడ్డులేని ప్రాంతంలో, తనమీద పడిన మంచు బిందువుల్ని సైతం వృథాపోనీక, లోపలికే ఇంకించుకొనే ఉదారబుద్ధి కలిగిన ఓ భవనంలో అతి పదిలంగా వుంది. ఆ ఆఫీసు ఫైల్సన్నీ ఎండాకాలంలో చెరువునుండి బయటపడిన చేపల్లా ఆ భవనపు పైభాగంలో ఎండుతూ వుంటాయి, వర్షాకాలంలో గొడుగుల్లా తడుస్తూ వుంటాయి. ఆ భవనం పక్కనే ఏంటీకరెప్షన్ వారి ఆఫీసుంది. దానికెదురుగ్గా ఓ ఖరీదైన హోటలూ, మరింత ఖరీదైన ఓ లాడ్జింగ్ వున్నాయి. ఆ లాడ్జి కింది భాగంలో ఓ పెద్ద బారుంది. అంచేత 'మద్యనిషేధం మంత్రులూ', కార్యకర్తలూ తరుచూ అక్కడే సమావేశ మవుతుంటారు. ఆ ఊరికి మరో మూల ఎస్పీ దొర వారి కార్యాలయం మరేవో కొన్ని అవసరమైన ఆఫీసులూ వున్నాయి. కలెక్టరు వారి కార్యాలయం కూడా ఆ ఊళ్ళోనే వుంది. అవేకాక, పెద్దపెద్ద కాలేజీలు, వాటికొక్కారణమైన హైస్కూళ్ళు వీటికి పునాదులు వేసే ఎలిమెంటరీ స్కూళ్ళు క్లబ్బులు, వైన్ షాపులూ, సినిమా హాళ్ళు, బ్రోతల్ హౌసులూ, యింకా చాలా చాలా ఉన్నాయి.

అంచేత....అయ్యో....! సారీ! అది ఊరు కాదు, పట్నం.

ఆ పట్నంలో ఓ పెద్ద ఆఫీసులో చిన్న గుమాస్తాగా పన్చేస్తున్నాడు రామనాథం. అతన్ది ఊరు కాదు. అందువల్ల పది సంసారాలు మూకుమ్మడిగా కాపురం చేస్తున్న ఓ పెద్ద ప్రహరీలో ఓ చిన్న వాటాకి వందకి మరో ముప్పై తగ్గించుకొని అద్దెకడుతూ కాపురం చేస్తున్నాడు రామనాథం, తన బరువు బాధ్యతల్తో. (బరువు: భార్య: బాధ్యత: కొడుకు)

ఆ పది సంసారాల ప్రహరి ముందు విశాలమైన వందడుగుల రోడ్డుంది. అది సిమెంటు రోడ్డు కావడాన, మంత్రులు తమ ప్రయాణాలను ఆ రోడ్ల మీదే చేస్తారు. తరచు మంత్రుల



కాకిముక్కుకి దొండపండులా నా? చభా - నీకొడ్రస్సు బాలా బావుందోయ్ - కాకపోతే - వీధికుక్కలుంటాయనే నాబాధ!!

తాకిడివల్ల ఆ రోడ్డు అతిశుభ్రంగా, ఆల్విన్ ఫ్రిజ్‌లా వుంటుంది, కాని చల్లగా వుండదు. ఆ రోడ్డుమీదకు వంగిచూసే ట్యూబ్‌లైట్లు, ఎప్పుడో పోగొట్టుకున్న పాతరూపాయి కోసం దిగులుగా వెతుక్కొనే దరిద్రుడి కళ్ళలా ఉంటాయి. ఆ రోడ్డు మధ్య గీసిన తెల్లటి గీతలు, సిద్ధాంతాలకీ, ఆచరణకీ మధ్య గీసిన గీతల్లా వుంటాయి. ఆ రోడ్డు అన్ని వేళలా జనసమ్మర్దంగా వుంటాని క్కారణం అటు చివరున్న సినిమా హాళ్ళు, ఇటుచివరున్న రైల్వేస్టేషనునూ. రిక్షాలు ఒదిగొంగి కూలీల్లానూ బస్సులు భయంకరంగా పోలీసుల్లానూ, కార్లు గవర్నర్లలా గంభీరంగానూ ఆ రోడ్డు మీద పోతుంటాయి.

అన్నట్లు ఆ రోడ్డుపేరు పంచశీలా రోడ్.

ఆ పదిసంసారాల ఇంటిముందున్న విశాలమైన వందడుగుల రోడ్డుకు ఆ వేపు చాలా ఖరీదైన భవంతులున్నాయి. అన్ని భవంతుల కంటె ఎక్కువ ఎత్తుగా నిల్చున్నా ఆ భవనం ఎమ్.ఎల్.ఏ. రావుగారిది. ఆ రావుగారి పూర్తి పేరు మల్లెపొదల సంపెంగ నాసిక శంఖారావ్. ప్రస్తుతం వారు హైద్రాబాదులో వుంటున్నారు. వారి పెద్దబ్బాయ్ డెహ్రాడూన్లోనూ, వారి చిన్నమ్మాయ్, ఋషీవాలీలోనూ చదువుకొంటున్నారని రావుగారు చెబితే తెలుస్తుంది. చదువు తప్ప అన్నీ చేస్తారన్న విషయం ఆ పిల్లల గురువుల్నడిగితే తెలుస్తుంది. హైద్రాబాదులో రావుగారి సతీమణి గొప్పలు చెప్పుకుంటూ బతికేస్తున్నారని వారి బంధువులవల్ల తెలుస్తుంది. రావుగారు మంచినీళ్ళు తాగరని, స్కాచ్ మాత్రమే పుచ్చుకుంటారని, తిండి తినరని మనుషుల్ని మాత్రమే తింటారని, వారి సర్కిల్లో వారి స్నేహితుల్ని విచారిస్తే తెలుస్తుంది. ఆయన్ని ఎంయల్యేగా ఎన్నుకొన్న తర్వాత, ప్రజలెంత విచారించారో, విచారిస్తున్నారో ఆ ప్రజల్నడిగితేనే తెలుస్తుంది.

ప్రస్తుతం ఆ ఎంయల్యేగారింట్లో ఓ జిల్లా ఆఫీసరుగారు కాపురముంటున్నారు. వారి తండ్రిగారు అదేదో జిల్లాకి పరిషత్తు చైర్మన్. వారి మామగారు మాత్రం ఉద్యోగంతో విసిగి వేసారి, ఇచ్చి పుచ్చుకోవడం మీద నమ్మకమూ గౌరవమూ వున్న మనిషి కావడాన ప్రజలకు నోట్లిచ్చి, ఓట్లు పుచ్చుకొని ఎంపీగా మారేరు. ఆ యంపీగారికి, ఈ ఎంయల్యేగారికి చచ్చేంత దోస్తీ కావడాన ఎంపీగారి అల్లుడిగారికి ఆ భవనం ఎంయల్యేగారు అతి చవకగా అయిదు వందలకే అద్దెకిచ్చారు. ఆ అద్దెను ఎంపీగారే చాల రకాలుగా ఎడ్జస్టు చేయిస్తారు. ఆ ఇద్దరికి

ఒకరిమీద ఒకరికి గౌరవ ముండటంవల్ల వారి వారి గౌరవ మర్యాదల మధ్య అల్లుడుగారు అతిహాయిందాగా ఆ భవంతిలో బ్రతికేస్తున్నారు.

అలాని అల్లుడుగారు తక్కువ తరగతి ఆఫీసరువారు కాదు. వారు ఉద్యోగాలు వేస్తారు తీస్తారు. వేయించనూగలరు, తీయించనూ గలరు. వారికి ఉత్కళ యూనివర్సిటీలో ఎం.ఏ చదివిన భార్యా, స్థానిక లిటిల్‌ఫ్లవర్‌లో అతి సీరియస్‌గా కలెక్టరు ఉద్యోగానికి పునాదులు వేసుకొంటున్న ఏడేళ్ళ కొడుకూ వున్నారు. తల్లి సన్నగా, నాజుగ్గా వుంటుంది గనుక, కొడుకూ సన్నగా, తెల్లగా, నాజుగ్గానే వుంటాడు. తల్లి అందంతోపాటు, తండ్రి గాంభీర్యాన్ని ప్రసాదించిన ఆ దేవుడు తాత గారి ధైర్యాన్ని, మొండితనాన్ని కూడా పోసి గాడు చినబాబులో. అల్లుడుగారు పెదబాబుగారు కాబట్టి, వారి కుమారరత్నం చినబాబుగారు.

చిత్రం! చినబాబుకి, చిరంజీవికి స్నేహం. పెదబాబుగారు లేనపుడు చినబాబు తన కాంపౌండుగేటు కవతల విశాలమైన లాన్లో నిలబడి, వీధి వరండాలో నిల్చున్న చిరంజీవిని పిలుస్తాడు. చిరంజీవి చిన్నగా నవ్వి, చేయూపి ట్రాఫిక్‌ని తప్పుకొంటూ చినబాబింటికి వెళ్తాడు. చినబాబు ఇంగ్లీషులోనూ, చిరంజీవి తెలుగు లోనూ పలకరించుకొని, కబుర్లు చెప్పు కొంటారు, ఆడుకొంటారు. చినబాబు నవ్వులు కూడా ఇంగ్లీషులోనూ, చిరంజీవి ఫీలింగ్స్ తెలుగులోనూ వుంటాయి. చినబాబుకి తెలుగు తెలుసు, కాని మాట్లాడరు. చిరంజీవికి చిన బాబు ఇంగ్లీషు అర్థమౌతుంది కాని సమా ధానం చెప్పలేడు తిరిగి. వాళ్ళిద్దరి స్నేహం అలానే పెరిగి పెద్దదయింది. కాని చినబాబుకి, చిరంజీవిని యెలా 'ట్రీట్' చేయాలో తెలుసు. ఎంత స్నేహితుడైనా అంతస్థుల తారతమ్య ముంది. అవును మరి! చినబాబు రెండంతస్థుల భవంతిలోనూ, చిరంజీవి ఎత్తరుగుల పెంకు టింట్లోనూ వుంటున్నారు మరి.

ఎడిటోరియల్ చదివి పూర్తయ్యాక, తృప్తిగా తల పంకించి, సంతృప్తిగా వెనక్కి వాలేడు, రామనాథం. అతశక్తివంతమైన రచ యిత రావిశాస్త్రి అని మరోసారి అనుకోకుండా వుండలేకపోయాడు.

ఆలోచనా మేఘాల్లో మైమరచిపోయిన రామనాథం, చిరంజీవి పలకరింపుతో తేరు కొని, అమాయకంగా నిల్చున్న చిరంజీవి న్చూసేడు. చిరంజీవి, "నాన్నా! ఈ రోజు ఆది వారం, కాసేపు చినబాబింట్లో ఆడుకొంటా నాన్నా!" అన్నాడు.

"చినబాబా! వాడెవడు?" అడిగాడు రామ నాథం.

"ఆ పెద్దిల్లుంది చూడు నాన్నా! వాళ్ళ బాబు" అన్నాడు చిరంజీవి చేయి చాచి అక్క డెక్కడో వున్న భవంతిని దివ్యదృష్టితో చూడ మన్నట్లుగా హెచ్చరిస్తూ.

"ఎవరూ! ఎంపీగారి మనవడా?" అడిగాడు రామనాథం.

"కాదు, పెదబాబుగారి చినబాబు నాన్నా!" జవాబిచ్చేడు చిరంజీవి.


"అదేలేరా బాబు! సముద్రంలో నీరు, ఏ ప్రాంతంలోనైనా ఉప్పగానే వున్నట్లు, పోలీసుల బుద్ధి ఏ రాష్ట్రంలోనైనా ఒకేలా వున్నట్లు, నువ్వన్నది, నే చెప్పింది కూడా ఒకటే" అన్నాడు రామనాథం.

"పో నాన్నా! నాకు తెలియనివన్నీ ముందుగా నేర్చేసుకుంటావ్" అన్నట్లు నిలబడిపోయేడు చిరంజీవి.

"సరేపో! నువ్వేదో చదువుకొంటుంటే చూడమని ఆదేశించింది మీ అమ్మ. నిన్నేమో చిన్నబాబు ఆవహించాడు. పో....పోయి ఆడుకో" అన్నాడు రామనాథం పేజీ తిప్పుతూ.

చిరంజీవి వెనక్కి తిరిగి వేగాన్ని పెంచి సినిమాలో కృష్ణుడిలా అదృశ్యమైపోయాడు.

నవ్వుతూ వచ్చిన చిరంజీవిని, సీరియస్‌గా రిసీవ్ చేసుకొన్నారు చినబాబు. పలకరింపు కార్యాలయం అయ్యేక, లాన్లోనే చిరంజీవిని నిలబెట్టి "ఒన్ మినిట్" అంటూ లోపలికి పరుగెత్తారు చినబాబు. అలా పరుగెత్తి, నడిచి, మారుమూల గదిలో, విశాలమైన గదిలో, విశాలమైన మంచంమీద, అతివిశ్రాంతిగా పడు



కొని, ఛేజ్ నవలని రేప్ చేస్తున్న మమ్మీతో, "మమ్మీ! చిరంజీవి హాజ్ కం" అన్నారు.

మమ్మీ విసుగ్గా కనుబొమలు విరిచి, కళ్ళెత్తకూడదని మెదడుకు ఆదేశమిచ్చి, చిన బాబు చెప్పింది విన్నానన్నట్లుగా మేను విరిచి, "సో వ్వాట్, గో....ఎండ్ ప్లే" అన్నారు చిరాగ్గ.

పద్మావతి బాత్రూంలోంచి బైటికొచ్చి, అలంకరణ ముగించుకొని బైటపడేసరికి అర గంట పైనే పట్టింది.

షికారు వెళ్ళాల్సిన రామనాథం, పుస్తకాన్ని అతిసీరియస్‌గా చదువుతూండటం, చదువుకో వాల్సిన చిరంజీవి షికారెళ్ళడం గమనించి నవ్వుకొంది పద్మావతి. కాని—

చిరంజీవి ఏడుస్తూ ఇంట్లో కొచ్చాడు. రామనాథం ప్రశ్నార్థకంగానూ, పద్మావతి ఆశ్చర్యంగాను చిరంజీవిన్చూచి, "ఏఏంమైందు దిరాకురా?" అడిగారు ఒకేసారి. చిరంజీవి సమాధానం చెప్పలేదు.

"ఏమైందిరా?" అడగాడు రామనాథం.

"ఎందుకురా?" ఓ అరక్షణం ఆగి పద్మావతి అడిగింది.

చిరంజీవి అతికష్టంగా కన్నీళ్ళని ఆపు కొంటూ "చినబాబు కొట్టేడు" అన్నాడు.

"ఎందుకు?" అడిగేరిద్దరూ ఒకేసారి.

"మరేమో, అక్బరు గొప్ప రాజటగా?"

"నువ్వు కాదన్నావా?"

"....ఉహుఁ... తాజమహల్ అక్బరు కట్టిం చాడని అన్నాడు చినబాబు. కాదన్నాను...."

"....అందుకని?"

"అందుకని కొట్టేడు."

రామనాథం ఆలోచనలో పడ్డాడు. చీడ మొఖం ఆఫీసరు పీడకలలుగనే కళ్ళతో అతి భయానకంగా తను చెప్పిన సరైన జీవోలను ఖండించటం గుర్తొచ్చింది. సూపర్నెంటుకు తను రూల్సు చెప్పాల్సిరావడం గుర్తొచ్చింది. ఈ రెండు కారణాలవల్ల తను సీటు మారడం గుర్తొచ్చింది. స్టేషన్ మారడం గుర్తొచ్చింది. అక్కడ్నుంచి జిల్లా మారడం గుర్తొచ్చింది. కాదన్నందుకు, వాళ్ళు చెప్పినదానికి 'చెంచా' కొట్టనందుకు తనిన్ని బాధలు పడాల్సివచ్చింది. ఇక్కడ కూడా అవే పోలికలున్న ఆఫీసర్ను, సూపర్నెంటును చూసి నోరు నొక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినందుకు విచారమేసింది. అయినా తనకు ధైర్యముంది తనను మెచ్చే ఆఫీసర్ను తను రిటైర్ అయ్యేలోపల తారసపడకపోతాడని.

అందుకే ఆఫీసు వ్యవహారాల్లో గంగిరెద్దులా తలూపడం మానేశాడు. ఇతరులకు జరుగుతున్న అన్యాయాల్ని ఖండించటం అదీ చేస్తున్నాడు. అందుకు ఎదురు దెబ్బలు తగులుతూనే వున్నాయి. అయినా తను భయపట్టంలేదు. అలాటి తన కడుపున పుట్టి, తనకు తెలిసిన నిజాన్ని చెప్పి, ఎదుటివాడి తప్పును పట్టిచ్చి దెబ్బతిని....అది తను విని మౌనం వహించితే, యింకెప్పుడూ తప్పుల్ని ఖండించడం మానేసి పిరికివాడై పోతాడేమోనని తట్టి భయంవేసింది రామనాథానికి .అందుకే చిరంజీవిని దగ్గరకు పిలిచాడు రామనాథం.

"చూడు నాన్న! చినబాబు నిన్నెందుకు కొట్టాడు?"

"అందుకే" అన్నాడు చిరంజీవి మళ్ళీ చెప్పే ఓపిక లేక.

"అంటే....అదే ఎందుకు?"

"అక్బర్ గొప్ప రాజట, తాజమహల్ కట్టించాడట. నేనేమో....అబ్బర్ గొప్ప రాజే గాని, తాజమహల్ కట్టించలేదన్నాను.... అందుకు."

"నిజంగా అందుకేనా?"

తలూపాడు చిరంజీవి.

"నో....నువ్వబద్ధం చెబుతున్నావు గదూ? అందుక్కాదు గదూ?"

చిరంజీవి క్రోధం, ఉక్రోషం, యేడ్పూ వచ్చాయి. అవి అన్ని రకాలుగా బైట కొచ్చాయి. కోపం గొంతులోంచి, ఉక్రోషం మొఖంలోంచి, ఏడ్పు కళ్ళలోంచి. "అందుకే అందుకే కొట్టాడు. ఒట్టు....నీ తోడు....అమ్మ తోడు....దేవుడితోడు.... సరస్వతీదేవుడితోడు" గబగబా అర్చాడు చిరంజీవి హఠాత్తుగా.

"నోర్మూయ్ ఇడియట్! ఇంకెప్పుడన్నా తోడు గీడు అన్నావంటే తోలు తీస్తాను, ఫూలిష్ ఫెనేస్...." ఆవేశపడిపోయాడు రామనాథం. కాని ఓ అరక్షణంలో తమాయించుకోగలిగాడు.

మనిషిని నమ్మని మనిషి కనిపించని దేవుడిని నమ్మడం బుద్ధి తక్కువంటాడు రామనాథం. మనిషి సృష్ట్యాది నుండి మరో మనిషితో నిజం చెప్పడం జరిగితే, ఈ దేవుళ్ళ తోళ్ళుపెట్టి నమ్మింపజేయాల్సిన అవసరముండకపోను గదా అన్న ఆలోచనతోపాటు, నమ్మించడానికి తనో దేవుడిని తోడు తెచ్చుకోవడంలో ఆ మనిషి బలహీనత కనిపించితే నమ్మడంలో ఎదుటి మనిషి బలహీనత కూడా కనిపించుతుందంటాడు రామనాథం. అంతేక, ఇలాటి మూఢనమ్మకాలకు అలవాటైన ఆ ఇద్దరూ పరస్పరం దేవుడిమీద ఒట్లు పెట్టుకుంటూ, వీలైనన్ని యెక్కువసార్లు మోసగించుకోడానికే ప్రయత్నిస్తుంటారని అతగాడి నమ్మకం. అందుకే రామనాథం అబద్ధం చెప్పడు. ఒట్లువేయడు. వేసేవాడి మీద గౌరవం చూపడు.

రామనాథం తమాయించుకొన్నాడు. పద్మావతికేసి చూసి, చిరంజీవివేపు తల తిప్పి, "చూడు బాబు! అక్బరు గొప్పరాజే! తాజమహల్ అతను కట్టించలేదు నిజమే. నువ్వన్నది నిజమే. మరైతే ఎవరు కట్టించారో తెలుసా?" అడిగాడు రామనాథం.

మాట్లాడలేదు చిరంజీవి. మౌనంగా తలొంచుకొని, తనకు దొరకాల్సిన గుప్పెడు సానుభూతి దొరకనందుకు నిరాశగా, నిర్లిప్తంగా ఉండిపోయేడు.

"చెప్పు....తెలుసా....తెలీదా?"

తెలుసన్నట్లు తలూపాడు చిరంజీవి.

"ఎవరు?" ఆత్రంగా అడిగేడు రామనాథం.

పద్మావతికి రామనాథం ప్రసంగం అసందర్భంగా, అన్నేచురల్‌గా అనిపిస్తోంది. భర్త మీద, భర్త సిద్ధాంతాల మీద, భర్త ఆదర్శాల మీద నమ్మకముంది, గౌరవముంది. అందుకే ఓపిగ్గా ఆలోచిస్తుంది. ఎందుకు అడుగుతున్నట్టివన్నీ? చిన్నవాడు చిరంజీవి, తెలియనివి చెప్పడంకోసమా? అయితే, ఇది సందర్భంకాదు. ఇప్పుడు విచారించాల్సింది చినబాబు చిరంజీవినెందుకు కొట్టాడని? ఓదార్చవలసింది చిరంజీవిని, చినబాబుచేతిలో దెబ్బ తిన్నందుకు. అంతేకాని, తాజమహల్ నిర్మాణానికైన ఖర్చు క్కాదు విచారించాల్సింది. తాజమహల్ నిర్మా

ణంలో శ్రమించిన కూలీల్ని కాదు ఓదార్చాల్సింది. పద్మావతి బుర్రనిండా ఆలోచనలున్నాయి.

"ఎవరు?" మళ్ళీ అడిగాడు రామనాథం మౌనంగా నిల్చున్న చిరంజీవిని.

"ఔరంగజేబు తండ్రి, షాజహాన్" కళ్ళు తుడుచుకొంటూ జవాబిచ్చాడు చిరంజీవి.

చటుక్కున కావలించుకొని ముద్దెట్టుకొన్నాడు రామనాథం, చిరంజీవిని. అతని పితృహృదయం ఆనందంతో గంతులు వేసింది. గర్వంగా పద్మావతికేసి చూసేడు రామనాథం.

చిరంజీవి ఆనందంతో అవమానాన్ని మరిచిపోయేడు. తండ్రిని మరింత బలంగా చుట్టుకుపోయేడు.

రామనాథం వేసిన సాధారణమైన ప్రశ్నకు అతిసాధారణమైన జవాబు, 'షాజహాన్' అని మాత్రమే. అసాధారణమైన జవాబు ఔరంగజేబు తండ్రి షాజహాన్ అని. చిరంజీవి చదువు మీద రామనాథానికి నమ్మక మేర్పడింది. "వెరీగూడ్ మై సన్! వెరీగూడ్! గో ఎండ్ టెల్ హిమ్....పో....పోయి తాజమహల్ షాజహాన్ కట్టించేడని ఆ చినబాబుగాడికి మరోసారి చెప్పు. విన్నాడా .... తప్పు దిద్దుకొన్నవాడౌతాడు. లేదా తప్పు చెప్పే, ఒప్పు చెప్పిన నిన్ను కొట్టినందుకు శిక్షనుభవిస్తాడు. చూడూ నువ్వు రైటు చెప్పావు. నీకు తెలిసింది సత్యం. నువ్వు చెప్పింది నిజం. రాజ్యాంగాన్ని మార్పించగలిగే వాడి తాతసైతం, తాజమహల్ కట్టించిన వాడిపేరు మార్చలేడు. పో....పోయి మరోసారి చెప్పు. అన్నట్లు నిన్ను కొట్టేడన్నావు కదూ....వాడు నిన్ను కొడితే ఏడ్చుకొంటూ వచ్చేవు కదూ....అది తప్పు. నువ్వూ వాణ్ణి కొట్టు—ముందా పన్చేయ్. వెంటనే వెళ్ళి వాడిని కొట్టిరా—దెబ్బకు దెబ్బ— అంతేకాదు—భవిష్యత్తులో నువ్వు గుర్తుంచుకోవాల్సిందీ, ఆచరించాల్సిందీ ఇప్పుడే చెబుతాను విను, మళ్ళీ సందర్భం రాకపోవచ్చు, అవకాశమూ రాకపోవచ్చు. అందుకే జాగ్రత్తగా విను. నువ్వు తప్పు చేస్తే, నువ్వు చేసింది తప్పని రుజువైతే, నీ తప్పు నీకు తెలియచేస్తే, ఎదుటివాడితో వాదించకు. ఎదురు తిరగకు. నీ తప్పును రుజువు చేసినవాడిని గౌరవించు. అతను విధించిన ఏ శిక్షకైనా, షరతుకైనా, తలవంచు—సిద్ధపడు. కాని, నీ నిజమైన సిద్ధాంతాన్ని, నీకు తెలిసిన నిజాన్ని, ఖండించినవాడిని, శారీరకంగా ఖండించడానికూడా వెనుకాడకు. నిన్ననవసరంగా ఎవరైనా కొడితే వాణ్ణి క్షమించి దేవుడిపై బోవడానికి ప్రయత్నించకు. వాణ్ణి తిరిగికొట్టి తిప్పికొట్టి, శిక్షించి అతిమామూలు మనిషిగా మాత్రమే బతుకు, బ్రతకడానికి ప్రయత్నించు. అంతే....అర్థమైందా?" ఆవేశంగా, ఉద్రేకంగా అన్నాడు రామనాథం. తనకంటె ఎంతో చిన్నవాడితో మాట్లాడుతున్నానన్న ఆలోచన లేకుండా చెప్పాడు రామనాథం. తన భావాలన్నీ వాడి మెదడులోకి చొప్పించగలిగితే, ఒక్కటీ అరా అయినా తప్పకుండా అర్థమవుతాయని, మిగతావాటిని వాడు గుర్తుంచుకొని, వయసు పెరిగాక అర్థంచేసుకొంటాడని మాత్రమే ఆలోచించాడు రామనాథం.

పద్మావతికి సందేహం నివృత్తి అవడంతో లోపలికి వెళ్ళిపోయింది చిర్నవ్వునవ్వుకొంటూ. రామనాథం అంచనా తప్పు కాలేదు. చిరంజీవికి రెండే రెండు వాక్యాలు అర్థమయ్యాయి. ఒకటి తను చెప్పింది రైటు. రెండు—చినబాబు తన్ననవసరంగా కొట్టాడు కాబట్టి, తను చినబాబును కొట్టాలి. బైటికి నడిచాడు చిరంజీవి, ఏడుస్తూ కాదు. ఏడ్పించేందుకు సిద్ధపడి.

స్థిరనిశ్చయంతో బైటికి నడిచిన చిరంజీవికి చినబాబు కనిపించలేదు. కాని గేటు మూసేసి ఉండటం కనిపించింది. భోజనాల వేళవరకు కాపు కాసేడు వీధివరండాలో నిల్చుని, చినబాబుకోసం. భోజనమైందనిపించి, చిరంజీవి, చినబాబుకోసం ఎత్తరుగుల చిరంజీవి ఎత్తింటి చినబాబుకోసం యెదురుజూస్తూ వున్నాడు.

రెండు....మూడు .... నాలుగు....నాల్గున్నరైంది. సూర్యుడు ఎలక్షన్లు దగ్గరపడిన ఎంపీలా

గందరగోళంగా వున్నాడు. ఎన్నికల మీటింగ్‌కు వెళ్ళబోయే నాయకుడిలా హడావుడిగా ఉన్నాడు. వాడి, వేడి కిరణాలను ఉపసంహరించుకొన్న సూర్యుడు, అసలు రూపాన్ని దాచుకొని ప్రజలముందుకు వెళ్ళడానికి సిద్ధమవుతున్న దేశనేతలా వున్నాడు.

అపుడు.... సరిగ్గా ఆ సమయంలో, ఎత్తిల్లు చినబాబు ఎత్తైన తన తండ్రితో, అందమైన తన తల్లితో, ఎత్తింటి ముందున్న లాన్లో, నీట్‌గా అమర్చిన కుర్చీలో, కూర్చుని స్నాక్స్ తింటూ, టీ తాగుతున్నారు.

చిరంజీవి ధైర్యంగా గేటు తీసుకొని, మూయకుండానే విసురుగా ముందుకు నడిచేడు. పెదబాబుగారు, భార్య అందాన్ని ఆస్వాదిస్తూ ఛేజ్ నవల్లోని పాత్రలకు భార్య పెదాలిస్తున్న అపురూపమైన రూపకల్పనకు ఆశ్చర్యపోతు నట్లు నటిస్తూ, కాఫీ మాత్రమే తాగుతున్నారు. వారి మనసులో కొత్తగా చేరిన హైపిస్టూ, ఆమె ఎత్తైన గుండెలమీద కదిలే లాకెట్టూ, అందాల్ని దాచలేక సతమతమయ్యే ఆవిడ ధరించిన అతీ చిన్న జాకెట్టు కదులుతున్నాయి.

నిశ్చింతగా టీ ఎంజాయ్ చేస్తున్నది, చిన బాబుగారు మాత్రమే. చిరంజీవి రాకని పెద బాబుగారుగాని, వారి భార్యగానీ గమనించలేదు. చినబాబుగారు చూసేరు బిస్కెట్ల కోసం తన తాతగారి కుక్క తన దగ్గర కొచ్చినపుడు, తను చూసే మామూలు చూపులాటి చూపుతో. చిరంజీవి కూడా చినబాబుని చూసేడు, అతి తెలివైన అతి గురిగల వేటగాడు చేతిలో తుపాకి ఉన్నప్పుడు, అతిసమీపంలోవున్న సింహాన్ని అతినిర్లక్ష్యంగా చూసినట్లు.

"వాడ్డూయూ వాంట్?" తలెగరేసి అతి నిర్లక్ష్యంగా అడిగేడు చినబాబు, తనకు అతి దగ్గరగా విల్చున్న చిరంజీవిని చీదరించుకొన్న ట్లుగా చూస్తూ.

"తాజమహాల్‌ని షాజహాన్ కట్టించాడు" పిల్లమేఘంలా గర్జించాడు చిరంజీవి.

"నో....అక్బర్...." చినబాబు వాక్యం పూర్తిచేయలేదు.

చిరంజీవి చేయి చినబాబు చెంపను అదర గొట్టింది.

ఆ దెబ్బకు చినబాబుగారు నిర్లక్ష్యంగా వది లేసిన తలవెంట్రుకలు ఒక క్రమపద్ధతిలో దువ్వినట్లుగా సర్దుకొన్నాయి. చిరంజీవి బాణంలా గేట్లోంచి దూసుకొచ్చాడు.

పెదబాబుగారి కళ్ళు అశ్చర్యంగా చూసి, క్రోధంగా మారాయి. అమ్మగారి కళ్ళు పెద బాబుగారి కళ్ళతో కలిసాయి, ఏకీభవించాయి.

చిరంజీవి మెట్లెక్కి యింట్లోకి నడిచి, వంటింట్లోకి వెళ్ళి ఓ గ్లాసెడు మంచినీళ్ళు తాగి, తన కప్‌బోర్డు తెరిచి, ఓ బిస్కెట్ తీసు కొని నములుకొంటూ, తన టేబుల్ కెదురుగా వున్న కుర్చీలో కూర్చుని, పుస్తకంలో తల దూర్చాడు.

ఉదయం నుండి చిరంజీవిని గమనిస్తున్న రామనాథం చిరంజీవి రావడం, మంచినీళ్ళు తాగడం, కుర్చీలో కూర్చుని పుస్తకం తెరవడం చూసి హాయిగా ఫిలయ్యేడు. చిరంజీవిని గొప్పవాడిగా-ఓ నిర్దుష్టమైన వ్యక్తిగా తీర్చిదిద్ద గలనన్న నమ్మకం అతనికి కొండంత ధైర్యాన్ని అంతులేని తృప్తినీ ఇచ్చింది.

అరుగుమీద అడుగుల చప్పుడవడం విని కూడా చిరంజీవి కదల్లేదు. కాని చెవులు రిక్కిం చాడు. ఆ వచ్చినవాడు పెదబాబుగారింట్లో చాలా కాలంగా పనిచేస్తున్న అతిచిన్న నౌకరు. రామనాథాన్ని అతిగర్వంగా—

"రామనాథం రామనాథం" అని పిల్చేడు.

రామనాథం అతివిసురుగా బైటికొచ్చి, "ఎవరు కావాలండి డబ్బా సుబ్బారాయుడు గారు?" అని ప్రశ్నించేడు కఠినంగా.

నౌకరు తెల్లమొఖం వేసి, తమాయించు కొని, "నిన్ను పెదబాబుగారు రమ్మంటుండారు, రా పోదాం" అని సందేశాన్ని ఆజ్ఞని రామ నాథంపైకి విసిరి భుజాలమీద బరువు దిగి పోగా, నిట్టూర్చాడు.

"పెదబాబా! ఎవడికిరా పెదబాబు? నీకా, నాకా?" తీక్షణంగా అడిగాడు రామనాథం.

గుక్కతిరగలేదు నౌకరుకు. ఊపిరి పీల్చు

కోవడం మరిచిపోయి, హఠాత్తుగా గుర్తొచ్చిన వాడిలా గట్టిగా ఊపిరి పీల్చి, బైటికి పోనివ్వ కుండా జాగ్రత్తలు తీసుకొంటూ, "మాకే.... నిన్నే.... పిల్చుకరమ్మన్నారు" అన్నారు.

"నీకు పెదబాబా! అయితే నాకేమిటి గొప్ప. పో... పోయి మీ పెదబాబునే రమ్మన్నానని చెప్పు. ఇదో....యింకో చిన్నమాట. ఈ సారి ఈ యింటిముందుకొచ్చి, 'రామనాథం' అని గాని 'నువ్వు' అనిగాని అన్నావో, ఇంకోసారి ఆ అవసరం రాకుండా నీ నాలుక కత్తిరించే స్తాను జాగ్రత్త" అన్నాడు రామనాథం.

నౌకరు స్పృహలో కొచ్చాడు. 'నేనెల్లగానే ఎనకాతలే వచ్చేత్తాడనుకొన్నాను. నయం తన్నాడు గాదు' అనుకొని బెదురు చూపులు చూసుకొంటూ, వెనక్కి తిరిగి చూసుకొంటు వెళ్ళిపోయేడు అతిచిన్న నౌకరు.

వారంరోజుల తర్వాత—

రామనాథానికి ఆంధ్రదేశంలోని ఓ మారు మూల పల్లెకు, ఆంధ్రరాష్ట్ర రాజధానికి ఇంకా దూరంగా, కాకులు దూరని కారడవికి పక్కగా చీమలు దూరని చిట్టడవికి సమీపంగా వున్న ఆ పల్లెకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు ఆర్డర్సొచ్చాయి. రామనాథంతోపాటు, చీడమొఖంతో పీడకలలు గనే అఫీసరువారు, ప్రధానమంత్రి పదవి తర్వాత తనదే అతికీలకమైన పదవిగా గర్వ పడుతూ, జూనియర్స్‌చేత రూల్సు చెప్పించు కొనే సూపర్నెంటుగారు కూడా సంతో షించారు.

రిలీవింగ్ ఆర్డర్స్ తీసుకొని, ఆ సాయంత్రం ఎత్తరుగుల తనింటి మెట్లెక్క బోతూ, వెనక్కి తిరిగి చూసేడు రామనాథం. ఎత్తింటి ముందు లాన్లో, భార్యతో, చినబాబుతో, చిర్నవుతో ముచ్చట్లాడుతూ, కాఫీ తాగు తున్నారు పెదబాబుగారు.

రెండడుగులు వేసి వందడుగుల రోడ్డును దాటి, ఎత్తులో అతిచిన్నదిగా వున్న గేటును తెరుచుకొని, గంభీరంగా ముందుకు నడిచాడు రామనాథం. పెదబాబుగారు కాఫీ సిప్‌చేసి రామనాథం రాకను గుర్తించేడు. వారికి చెమట్లు

పోసేయి, చల్లగాలిలో. అప్పుడే గుర్తించేరు గాలిలోను, తన నోట్లోను తేమ లేదని. కాఫీ మాత్రం గొంతు దిక్కుండా ఆగిపోయింది. కొడుకొచ్చి తన కొడుకు చెంపను అదర గొట్టాడు. తండ్రొస్తున్నాడు, తన్ను వాయిం చడు గదా!

చినబాబు నములుతున్న బిస్కెట్ ముక్కను పళ్ళు నమలడం మరిచిపోయేయి. అమ్మగారి చేతిలోని క్రీం బిస్కెట్, సిగలోని గులాబీమొగ్గ నేలమీద జారిపోయేయి.

రామనాథం ఆ ముగ్గుర్నీ, ముగ్గుర్లోనూ దాగిన, రేగిన భయాన్ని గుర్తించేడు, రామ నాథం సగటుమనిషి. మనిషి, మనిషికి అప కారం చేసినపుడు అపకారం జరిగిన మనిషి ఎదురైనపుడు, అపకారం చేసిన మనిషిలో కలిగే సంఘర్షణని గుర్తించగలడు.

"నా పేరు రామనాథం" అన్నాడు రామ నాథం, పెదబాబుగారికి అతిదగ్గరగా వచ్చి.

పెదబాబుగారు లోపల పనిచేస్తున్న నౌకర్లని సహాయంగా పిలిచేందుకు లేచినిల్చున్నారు. రామనాథం పెదబాబుకారు ఖాళీచేసిన కుర్చీలో అతి సహజంగా కూర్చొని, "థాంక్స్" అన్నాడు.

పెదబాబుగారు, అమ్మగారు, చినబాబుగారు భయంగానూ, ఆందోళనగానూ, ఆశ్చర్యం గానూ చూసారు రామనాథంకేసి. రామనాథం నిబ్బరంగానూ, సూటిగానూ, సహజంగాను, చెప్పడం ప్రారంభించేడు.

"ఈ రోజే రిలీవయ్యాను నేను. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. అది చెప్పేందు కొచ్చిన నాకు, మీరు చేసిన మర్యాద కూడా, మర్యాదస్తుల మర్యాదని, మన్ననని చూపు తోంది. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే, మీ చినబాబుకి, మా చిరంజీవికి అతిచక్కటి స్నేహం వుంది. ఆ స్నేహాన్ని పురస్క రించుకొని, మా చిరంజీవి, మీ చిన్నబాబుతో ఆడుకోడానికి తరచు ఇక్కడికి వచ్చేవాడు. పోయినాదివారం అలానే వచ్చాడు. చినబాబుకి డబ్బుంది. అందుకని అహంకారం కూడ

వుంది. అందువల్ల తనమాట చెల్లాలన్న పట్టు దల వంశపారంపర్యంగానే వచ్చుంటుంది. చిరంజీవి మామూలు గుమాస్తా కొడుకు. అందువల్ల ధైర్యంతో కూడిన నిజాయితి, జ్ఞాపకశక్తితో కూడిన ధైర్యమూ వున్నాయి. వీళ్ళు పరస్పర విరుద్ధమైన స్వభావం గల పిల్లలు. మీ చినబాబు తాజమహల్‌ని అక్బరు కట్టించాడని అన్నాట్ట. కాదన్నందుకు చిరంజీవిని కొట్టాడు. తాజమహల్ నిర్మాత గురించి తప్పు చెప్పినందుకో సారి, అకారణంగా తన్ను కొట్టినందుకు, మరోసారి వెరసి రెండుసార్లు చిరంజీవి, చినబాబును కొట్టుండాలి. కాని సగటు మనిషికి వచ్చే సగం కోపంవల్ల, మా చిరంజీవి సగంసారి మాత్రమే మీ చినబాబును కొట్టేడు. ఎందు కొట్టాడో మీ చినబాబు, మీకు సరైన కారణం చెప్పండడు. మా బోటివాళ్ళకు తమ తప్పును ఒప్పుకొనేంత ఆత్మస్థైర్యం, నిజాయితీ వుండని కారణంచేత, తరతరాలుగా వస్తున్న విరికితనంచేత మీరు కూడా అడిగుండరు, సహజంగా జీర్ణించుకొనిపోయిన అహంకారంవల్ల, అజ్ఞానంచేత. కాని, అవమానాన్ని, అభిమానాన్ని దాచుకోలేని సగటు మనిషి రక్తంగనుక చిరంజీవి నిజాయితీగా జరిగింది చెప్పాడు. ఆ నిజాయితీ ఫలితం మీరు చూసేరు. మీరు చూపిన ఆ నిజాయితీ ఫలితం, నాకీ ట్రాన్స్‌ఫర్ చేయించడం ద్వారా మీరు చూపించేరు. అందుకే ధన్యవాదాలు చెప్పడానికొచ్చాను.

బురదలో పుట్టిన పద్మం, బురదను అసహ్యించుకోదు. అది దాని జన్మస్థానం కనుక. జన్మభూమి అతిపేదది, అతివికృతమైనది, అతి నిరూపయోగమైనదీ కావచ్చు. కాని అక్కడ పుట్టిన ప్రాణికి అది అపూర్వమైనదనిపిస్తుంది. అక్కడి అణువణువు సత్యాన్ని చూపుతుంది, స్పందింపజేస్తుంది. చలింపజేస్తుంది. అందుకే కవులు 'జననీ జన్మభూమిశ్చ' అన్నారు.

మీరు అతిసునాయాసంగా, అతిక్లిష్టమైన ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్చేయించిన ఆ ఊరు, నా స్వంత ఊరు. అలాటప్పుడు, ఇక అదేలాటిదైనా పర్వాలేదని, నిశ్చింతగా జీవితాన్ని వెళ్ళమార్చగలనవి, కొంతకాలమైన మా ప్రాంతంలో మా వాళ్ళతో కాలం గడిపే అవకాశం కలిపించినందుకు సంతోషంతో పొంగిపోతూ, ఆ సంతోషాన్ని మీ కూడ పంచుదామని, కృతజ్ఞతలు చెప్పుకొందామని వచ్చాను. నా కంటె ముందుగా ఈ సంతోష వార్తను విని, ఆ సంతోష వార్తని, మీ భార్యా పిల్లలతో పంచుకొంటున్నందుకు సంతోషిస్తున్నాను.

అన్నట్టు మరో విషయం. ఎంతోకాలంగా నే నీ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నాను. కాని ఆఫీసర్లవారి అనుగ్రహం కలగలేదు. మా వాడు, మీ వాణ్ణి కొట్టిన వెంటనే ఈ ట్రాన్స్‌ఫరార్డరు చెట్టుకు పండిన పండులా తప్పున రాలింది. గుర్తుంచుకొంటాను. ఇక ముందు అవసరమైనపుడు 'నేనే' స్వయంగా మిమ్మల్ని కలుస్తాను. వస్తాను.... గుడ్‌బై"

రామనాథం గంభీరంగా లేచి తాపీగా నడుస్తూ గేటుదాటి రోడ్డుమీదికి నడిచాడు.

పెదబాబుగారు నోట్లో కాఫీని పుక్కిలించి ఊసేసి, ఫోన్వైపు పరుగెత్తారు. □

వచ్చేనెల నవలానుబంధంలో

నవలల పోటీలో మూడవ బహుమతి పొందిన నవల

'కడలి అంచు కాపురం'

పాలకోడేటి సత్యనారాయణరావు రచన

చదవండి

మి నీ క థ

ఈ దేశంలో జనం

ఆత్మకూరి కామేశ్వరరావు

"ఛీ ఛీ, వెధవ జనం, వెధవ జనం."

డబ్బిచ్చి టోకన్ కొన్నా వెంటనే తన ఆకలి తీరనందుకు దేశంలో జనాన్ని తిట్టుకుంటూ, హోటల్‌లో చాలినంత ఎకామిడేషన్ ప్రొవైడ్ చెయ్యనందుకు హోటల్ మేనేజిమెంటును కోప్పడుతూ హోటలంతా కలయ తిరిగాడు రమణమూర్తి.

ఒక్కో టేబుల్ పైన ఒక్కో కుర్చీముందు రెండేసి టోకన్లు అడ్వాన్సుగా బుక్ అయిపోయున్నాయి. ఉసూరుమంటూ నిట్టూరుస్తూ మరో వైపుకు చూసేసరికి ఆ వరసలో మూలగా ఆపద్బాంధవుడిలా అప్పుడే పప్పుకూర కలుపుకుంటున్న ఓ హిప్పీకుర్రాడు కనిపించాడు రమణమూర్తికి.

అతని విస్తరిముందు ఒక టోకన్ కూడా లేదు. నాలుగు టేబుల్స్ కవతలగా ఆ కుర్రాడి టేబుల్ దగ్గరికి వడివడిగా నడిచి టోకన్ పడేసి గాఢంగా గాలి పీల్చుకున్నాడు రమణమూర్తి.

"ఫరవాలేదు. మరో అయిదు నిమిషాల్లో చెయ్యి నోట్లో పెట్టుకోవచ్చు" అనుకుంటూ అతని కుర్చీ ప్రక్కన్నే నిలబడ్డాడు అసహనాన్ని సహనంగా మార్చుకొని, హోటలు వాళ్లు డాల్డాను నెయ్యిగా మార్చుకున్నట్లు.

ఐదు నిమిషాలు అయిపోయాయి. హిప్పీ కుర్రాడు పప్పుకూరతో కానిచ్చి పచ్చడితో, ఆ తర్వాత సాంబారుతో తింటున్నాడు.

"ఛీ వెధవమనిషి! ఎంతసేపు గతకడం! తిండిగాడులా వున్నాడు అటిక మొహం ఎలుగ్గొడ్డుబొచ్చు వీడూను" గొణుక్కుంటూ కాళ్ళముందు చూశాడు రమణమూర్తి. హిప్పీ కుర్రాడి చేతిగుడ్డ కాబోలు వుండగా చుట్టుకొని నేలమీద పడివుంది.

"సోంబేరి వెధవ! చేతిగుడ్డ క్రిందపడింది కూడా చూడకుండా ఆవురావురుమంటూ తింటున్నాడు బకాసురుడు బండ్రెసు తిన్నట్టు. తిననీ! తిననీ! ఈ చేతిగుడ్డ కొట్టేస్తాను" అనుకుని చేతిగుడ్డ అతనికి కనిపించకుండా కాలు అడ్డంగా పెట్టాడు రమణమూర్తి.

హిప్పీ కుర్రాడు భోజనం ముగించి లేచి వెళ్లాడు చేతులు కడుక్కోవడానికి వాష్ బేసిన్ దగ్గరికి. రమణమూర్తి తటాలున కుర్చీలో కూర్చుని చేతిగుడ్డ అతనికి కనిపించకుండా కాలును మార్చుకున్నాడు.

రమణమూర్తి అన్నం తింటున్నాడన్న మాటేకాని అతని ధ్యాసంతా తన కాలు చాటునవున్న చేతిగుడ్డను హిప్పీకుర్రాడు తిరిగొచ్చి తీసుకెళతాడనే.

ఇంతలో ఆ కుర్రాడు వాష్‌బేసిన్ దగ్గర చేతిగుడ్డతో అవసరం కలిగేసరికి తిరిగి లోపలికొచ్చాడు. దూరంనించే చేతిగుడ్డ కుర్చీదగ్గర పడివుందేమోనని పరకాయించి చూశాడు. అతని చూపులను అడ్డుకుంటూ రమణమూర్తి కాలు మాడుస్తూనే వున్నాడు. ఆ కుర్రాడి ప్రతి చూపూ రమణమూర్తి గుండెల్లో స్కైలాబ్ ముక్కలా తగుల్తూనే వుంది.


అతడు చేతిగుడ్డ అక్కడ పడిపోలేదని నిర్ధారించుకొని భారతదేశాన్ని వదలి హిందూ మహాసముద్రంలోకి వెళ్ళిపోయిన స్కైలాబ్‌లా వెళ్ళిపోయాడు.

ఇంతలో మరో టోకెనుడు రమణమూర్తి కుర్చీ దగ్గరకొచ్చి నిలబడి టేబుల్ మీద టోకన్ పెట్టాడు. ఆ చేతిగుడ్డ అతను తీసుకుంటాడేమోనని భయపడ్డాడు రమణ.

"సార్! మీ చేతిగుడ్డ క్రింద పడిపోయినట్టుంది. తీసుకోండి" అన్నాడు వచ్చినవాడు ఆపద్బాంధవుడిలా.

"హమ్మయ్య!" అనుకుని రమణమూర్తి సదరు తనది కాని-మరొకరు తనదిగా గుర్తించిన చేతిగుడ్డను తీసేసుకొని జేబులో కుక్కేసుకుని మజ్జిగన్నం తినకుండానే లేచి వెళ్ళిపోయాడు "పరవాలేదు! ఈ దేశంలో జనం మంచివాళ్ళే" అనుకుంటూ. □

సరికొత్త సైంటిఫిక్, రొమాంటిక్ సీరియస్ సీరియల్



యుగాంతం!

యండమూరి వీరేంద్రనాథ్

శైలజ వడివడిగా బైటికి వెళ్ళిపోయింది. సంభాషణ వింటున్న ఒక స్వీపరు అక్కణ్ణుంచి తప్పుకొన్నాడు.

గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

ఒక మూలగా పడిపోయిన వృద్ధుడు మోచేతుల మీద బలహీనంగా లేవటానికి ప్రయత్నం చేస్తూ, "ఎంత పని చేశావురా మూర్ఖుడా!" అన్నాడు. "ఈ విషయం అందరికీ తెలిస్తే....ఎంత కల్లోలం!! ఇది మిగతా సైంటిస్టులకి తెలియకపోయినా వాళ్ళు పూరుకొన్నది—ఈ పదకొండురోజులూ ప్రపంచం అల్లకల్లోలం అయిపోతుంది! భగవంతుడా... ఎలా ఇప్పుడు!!"

పదిహేను రోజులు వెనక్కి.

శాన్‌ఫ్రాన్సిస్కో:

"ఈ విషయం అందరికీ తెలిస్తే...." అన్నాడు. విలియమ్ రోగర్స్. యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెంట్.

ఎవరూ మాట్లాడలేదు.

మెక్ లోపలికి వచ్చి కూర్చొన్నాడు. జాన్ కళ్ళతోనే విష్ చేసేడు. అతడే అందర్లోకి యువకుడు.

తెలతెలవారుతోంది.


"ఏమిటీ సంగతి—" కంఠం తగ్గించి అడిగాడు మెక్.

అందరి మొహాలూ సీరియస్‌గా వున్నాయి. జాన్ మౌనంగా ఓ కాగితాలకట్ట అందించేడు. దాదాపు పదిపేజీలున్న రిపోర్ట్ అది. ఒక మూలగా 'మౌంట్ పలామోర్ అబ్జర్వేటరీ, కాలిఫోర్నియా' అని వుంది. తొందర తొందరగా కళ్ళతో చదవసాగేడు.

పూర్తి చెయ్యటానికి అయిదు నిమిషాలు పట్టింది.

ప్రాక్సిమా సెంక్చువరీ అన్న నక్షత్రం భూమివైపుకు వస్తుంది అన్న విషయాన్ని ముందు కనుక్కున్నది రాయల్ అబ్జర్వేటరీ. వెంటనే గ్రీన్‌విచ్‌ని కాంటాక్ట్ చెసేరు వాళ్ళు. రేడియో అస్ట్రోలాజికల్ పరికరాల ద్వారా అది ఎంత వేగంతో వస్తున్నదీ, ఏ దిశగా వస్తున్నదీ కనుక్కోబడింది.

ఈ విధంగా, ప్రొఫెసర్ [illegible]



ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం క్రోక్విల్, సభ్యులు క్రోక్విలర్స్.

కనుక్కొన్న విషయం అంతకు పదిహేను రోజులముందే సరి అయిన తేదీ, సమయంతో సహా గ్రహించబడింది.

ఆగస్టు పదిహేడు పదకొండు గంటలా పది సెకన్లకి ఆ గ్రహం భూమి ఆకర్షణ పరిధిగుండా మూడు సెకన్ల కాలం పయినిస్తుంది. భూమి అడుగుపొరల్లో వుండే ఇనుము, లావా దాని ఆకర్షణశక్తికి లోనై పెల్లుబుకుతాయి!

మిలియను సంవత్సరాల వయసున్న ఈ భూమ్మీద చరాలన్నీ గుర్తుకూడా మిగలకుండా నాశనమైపోతాయి. విశ్వంలో వున్న కోట్లకోట్ల గ్రహాల మాదిరిగానే భూమికూడా నిస్తేజమైపోతుంది.

సముద్రాలు ఇంకిపోయి వాటి మీద లావా గట్టిపడుతుంది.

రెండు పరమాణువులున్న ఆక్సిజను మూడో దాన్ని చేర్చుకొని ఓ జోనుగా మారుతుంది.

భూమ్యాకర్షణ పరిధిలోకి ఆ నక్షత్రం రాగానే ఆ కుదుపుకి భూకంపం కలుగుతుంది. అగ్నిపర్వతాలు బ్రద్దలవుతాయి....

ఇక చదవలేదు. అతడికి పరిస్థితి అర్థమయింది. అయితే అది నిజమని నమ్మటానికే కొద్దిసమయం పట్టింది. ఎక్కడో లాస్ ఏంజిల్స్‌లో వెచ్చటి రగుకింద పడుకున్నవాణ్ణి లేపి ఇంకో రెండు నెలల్లో ప్రపంచం నాశనమైపోబోతూంది అని చెప్తే—అంత తొందరగా నమ్మబుద్ధి కాదు. కల అయితే ఎంత బావుణ్ను అన్న భావన.

"ఇదంతా నిజమా—నిజంగా యిలాగే జరుగుతుందా? ఆ నక్షత్రం తన దారి మార్చుకొనే వీలే లేదా?—ఈ ప్రశ్నలన్నీ రిపోర్టు చదవగానే నా కొచ్చినయ్" అన్నాడు రోగర్స్. "దీనికి సమాధానం ఆగస్టు ఆరో తారీఖున తేల్తుంది. ఎలా అని ప్రశ్నించకండి. ఈ ఒక్క విషయమూ రహస్యంగా వుంచబడింది. అయితే అంతకన్నా ముఖ్య సమస్య—ప్రెస్. ఈ విషయం బైటకు పొక్కగానే పత్రికలు దీన్ని తమ సర్క్యులేషన్ పెంచటానికి సాధనంగా ఉపయోగించుకొంటాయి."

"అందరికీ తెలిస్తే ఏమవుతుంది!" ఫిన్చ్ అడిగేడు.

అప్పటివరకూ మౌనంగా కాగితాలు పరిశీలిస్తున్న కాస్టనోవా తలెత్తి నెమ్మదిగా అన్నాడు. "ఏమవుతుంది అని అడుగుతున్నారా మిస్టర్ ఫిన్చ్? ఈ నలభై రోజుల్లోనూ ఘాతుకాలు జరుగుతాయి. ప్రాణం యెలాగూ పోతున్నదని తెలిసినప్పుడు మనిషి పని చెయ్యటం మానేస్తాడు. ఎఫ్. బి. ఐ. వుండదు. ప్రాణమే పోతున్నప్పుడు నైతిక విలువలెందుకని మనిషి వాటినీ వదిలేస్తాడు. పోలీస్ వుండదు.

గత పదకొండు సంవత్సరాలుగా వాషింగ్టన్‌లో అయిదువందల శాతం నేరాల సంఖ్య పెరిగింది. ఈ నలభై రోజుల్లో అవి పదిహేను వందల శాతం అవుతాయి. రోజుకి ఎనభై రాబరీ లవుతున్నాయి. అవి ఎనిమిది వందలవుతాయి. రేప్‌లు మనం అంచనా కట్టలేనంతగా పెరిగిపోతాయి. ఏం అవుతుందని అడక్కండి. ఏం అవదని అడగండి. మనుషుల బలహీనతలు మనకి తెలుసు. వచ్చే ప్రళయం ఎలానూ తప్పనప్పుడు దాన్ని ముందుగా వెల్లడించి మరింత కల్లోలం సృష్టించటం అవివేకం. ఆపటానికి శాయశక్తులా కృషిచేద్దాం. కాని ఆపగలమని అనుకోను. ప్రకృతిముందు మనిషెంత?.... మనం చెయ్యగల్గిందొక్కటే. మన ప్రయత్నాలు మనం చేస్తూ, ప్రపంచానికి ఈ విషయం తెలియకుండా ఆపుచెయ్యటం. అబ్జర్వేటరీస్ అన్నీ మూసెయ్యాలి. ఏదో మిషమీద అస్ట్రానమిస్ట్‌ల నందర్నీ అరెస్టు... నా ఉద్దేశ్యం జైలుకాదు....అరెస్ట్ చెయ్యాలి. రాబోయే చావుని తల్చుకొని మనిషి చచ్చిపోవచ్చు—లేదా మనిషిలో రాక్షసుడు విజృంభించవచ్చు. ఈ రెంటినీ మనం సాధ్యమైనంత కాలం ఆపుచెయ్యాలి....రాక్షసుడు పుట్టకుండా మనిషి చావకుండా మనం ఆపుచెయ్యాలి."

అందరూ లేచారు.

సమావేశం ముగిసింది.

II

కొన్ని దినపత్రికలు ముఖ్యమైన ప్రదేశాల్లో రోజువారీ కూలీమీద మనుష్యుల్ని తమకి సమాచారం అందించే పనిమీద నియమిస్తాయి. వీరందించే సమాచారాన్ని బట్టి పారితోషికం నిర్ణయింపబడుతూ వుంటుంది. ఉదాహరణకి ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో 'టీ' లందించే కుర్రవాడు ఒక ముఖ్య దినపత్రికకి ఇన్‌ఫార్మర్. ఎవరెక్కడ కొట్టుకొని చచ్చినా, చావబోతున్నా అక్కడికే రావాలి కదా, అప్పటికప్పుడు ఫస్ట్‌హ్యాండ్ ఇన్ఫర్మేషన్-సేకరించి పత్రిక్కి అందిస్తూ వుంటాడు. అలాగే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మూటలెత్తే ఒక కూలీ.

దినపత్రికల్లో పడాల్సిన వార్త గంట ఆలస్యం అయితే చచ్చిపోతుంది. మరుసటి రోజుకు ఏ విధంగానూ పనికిరాదు.


ఇండియన్ టైమ్స్ సబెడిటర్ శైలజ తనకు దొరికిన సమాచారాన్ని తన పత్రికకి పంపుతున్న సమయంలోనే నౌకర్ రూపంలో గెస్ట్ హౌస్‌లో వున్న ఇన్‌ఫార్మర్ ద్వారా యీ సమాచారం మిగతా పత్రికలకి తెలిసిపోయింది. ప్రపంచంలో అన్ని అబ్జర్వేటరీసూ మూయబడివుండటం, అస్ట్రానమిస్ట్‌లతో ఇంటర్వ్యూ దొరక్క సమాచారం నిజం అన్న నిర్ధారణకి వచ్చేయి పత్రికలు.

పత్రికల వాళ్ళకి మోరల్స్ వున్నమాట నిజమే కానీ, మిగతా వాళ్ళందరూ ప్రచురించి, తాము ప్రచురించకపోతే ఎలా-అన్న ఉద్దేశ్యంతో అందరూ ప్రకటించేరు:

కొన్ని పత్రికలు తాటికాయలంత హెడ్‌లైన్స్‌తో "చంద్రుడు శాశ్వతంగా అస్తమించబోతున్నాడా?" "చంద్రుడిక లేడా?" అని వేస్తే మరికొన్ని పత్రికలు—మరొక పదిరోజుల్లో భూమికి రాబోతున్న విపత్తు గురించి వర్ణించేయి. పగులుతున్న అగ్నిపర్వతాల ఫోటోలూ, హృదయ విదారకంగా యేడుస్తూన్న పిల్లల ఫోటోలూ వెసేయి.

నిజంగా పదిరోజుల్లో ఇదంతా జరగబోతుందని అందరికీ పరిపూర్ణంగా నమ్మకం చిక్కటం లేదు. ఆ ఆత్మవంచన ఆనందాన్ని యిస్తున్నప్పుడు దాన్ని ఎవరూ వదులుకోవటానికి ఇష్టపడటంలేదు.

ఎక్కడ చూసినా ఆ కబుర్లే, దాని గురించి



ప్రసక్తే. అవుతుందని కొందరు. కాదని కొందరు. వాదనలు. మనసు అట్టడుగుపొరల్లో భయం. పైకిమాత్రం నవ్వు. నవ్వు వెనుక ఆందోళన. 'అలా కాదులే' అన్న ధైర్యం. మళ్ళీ ఏమవుతుందో అన్న దిగులు.

సమయం గడుస్తూనే వుంది.

సాయంత్రం అయింది.

రాత్రయింది.

ఆఫీసుల్లో యెవరూ ఆ రోజు పని చెయ్యలేదు.

అందులో ప్రధాని స్వయంగా చూసిన వింత ముఖ్యాంశం—దానికి తోడు కొన్ని కల్పనలు. భూమి బీటవారింది వగైరా.

పదకొండయింది.

ఈ విషయాన్ని నమ్మనివారు హాయిగా నిద్రపోతున్నారు.

లోపల నమ్మి, పైకి నమ్మనట్టు నటించే వారు ఏదో పనున్నట్టు బైటకొచ్చి ఆకాశం వైపు చూసి వెళ్తున్నారు.

వివిధ దేశాల శాస్త్రజ్ఞులు శ్రీలంక చేరుకున్నారు.

పావుతక్కువ పన్నెండు....

అందరి మనసుల్లోనూ టెన్షన్.

టెలిస్కోప్ పక్కన ప్రొఫెసర్ మొహంలో ఏ భావమూ లేకుండా నిలబడి వున్నాడు.

మోచేతుల్లో మొహం దాచుకొని మౌనంగా కూర్చొని వున్నాడు రమణ. అతడెంత తప్పు చేశాడో అర్థమైన తర్వాత—అప్పటివరకూ మాట్లాడలేదు అతడు.

ఐదునిముషాలు తక్కువ పన్నెండు.

పదినుంచి ముప్పై లాంగిట్యూడ్ మీద—పన్నెండు గంటలా మూడు నిమిషాలకి....

పన్నెండు కావస్తూవుండగా జనం. ఎక్కడ చూసినా జనమే. తలలు ఆకాశానికెత్తి....నిశ్శబ్దంగా....ఆత్రంగా....నమ్మకానికీ, అపనమ్మకానికీ మధ్య ఘర్షణతో.

పన్నెండు.

రాజయ్య తలెత్తి చూసేడు.

ముసలాయన కిటికీలోంచి చూస్తున్నాడు.

ప్రకాశరావు పాలిపోయిన మొహంతో నిలబడి వున్నాడు.

పన్నెండు గంటల రెండు నిమిషాలు. నాలుగు నిముషాలు. అయిదు నిముషాలు....

రమణ ఆనందంతో అరిచేడు. "చంద్రుడు కదల్లేదు" అని. "ది మూన్ హేజ్ నాట్ మూవ్డ్—" అతడి గొంతు గాలిలో ప్రతిధ్వనించింది.

ప్రొఫెసర్ మాట్లాడలేదు. దూరం నుంచి జనం నవ్వులు! ఆనందం. రిలాక్సేషన్ కలిసిన నవ్వులు. రమణకే అనుమానం వేసింది. మళ్ళీ ఆకాశంకేసి చూసేడు. చంద్రుడు అలాగే వున్నాడు.

కానీ....కానీ....పెద్ది ఫుట్‌బాల్ బంతిలా నిండుగా వుండవలసిన వాడు చిన్న టెన్నిస్ బంతిలా అయిపోతున్నాడు. ఇంకా, ఇంకా కుదించుకుపోయి....క్షీణమవుతున్నాడు.

రమణకి విషయం అర్థమయింది.

పక్కకి కాకుండా వెనక్కి, వెనక్కి వెళ్ళిపోతున్నాడు....ఆ నక్షత్రంవైపు....చంద్రుడు వెళ్ళిపోతున్నాడు!

దాదాపు ఇరవై అయిదు మిలియను సంవత్సరాల్నుంచీ, భూమిని అంటిపెట్టుకుని తిరిగిన చంద్రుడు....ఎంతోమంది ప్రపంచ కవులకీ, గాయకుల భావాలకీ ఊపిరి పోసిన చంద్రుడు... ఎంతోమంది పాపలకి తల్లులు ఆటబొమ్మలుగా చూపెట్టిన చంద్రుడు—నెమ్మది నెమ్మదిగా అనంత విశ్వంలోకి అదృశ్యమైపోతున్నాడు.

హాహాకారాలు.

ఎవరో భయంతో అరుస్తున్నారు.

పోలీస్‌వ్యాన్ సైరన్ మోగిస్తూ తిరుగుతూంది.

పత్రికా విలేఖరులు విదేశాలకి వార్తల్ని పంపుతున్నారు.

జనం మొహాల్లో భయం, వేదన.

ఒక స్త్రీ మూర్ఛపడిపోయింది. ఒక కుర్రవాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. చూసిన దృశ్యాన్ని నమ్మలేక చాలామంది స్థంభించిపోయేరు.

ఆకాశం చీకటిని పులుముకొంది. బొట్టులేని స్త్రీ మొహంలా కళావిహీనమైంది. కళకళలాడే చంద్రుడిక లేడు,

పదిరోజుల్లో భూమికూడా వుండదు.

ఎవరో బిగ్గరగా రోదిస్తున్నారు.

ప్రళయం ప్రారంభమైంది.

రెండో భాగం


ఆగస్టు ఆరో తారీకు రాత్రి పన్నెండు గంటలకి చంద్రుణ్ణి ప్రాక్సిమా సాంక్చువరీ ఆకర్షిస్తున్న సమయాన, భూమ్మీద ఒక ప్రదేశంల్లో, బ్రహ్మాండమైన విస్ఫోటనం జరిగింది. మిండనోవా డీప్‌లో. అయితే అది మరుసటి రోజు కానీ వెలుగులోకి రాలేదు.

ఒక థియరీ ప్రకారం చంద్రుడు ఒకప్పుడు భూమిలో ఒక భాగమే. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రం వున్న ప్రాంతం నించి విడిపోయేడు. ఆ ప్రదేశాన్నే మిండనోవా డీప్ అంటారు. చంద్రుడిలో వున్న ఆర్మాల్ కొలైట్ అన్న పదార్థం పసిఫిక్ సముద్రాంతర్భాగంలో ఇంకా కొద్దిగా వుంది కాబోలు. అదే సమయానికి చంద్రుడితోపాటు అదీ ఆకర్షితమై పైకి లేచింది. ఫలితంగా ఆ సముద్రగర్భంలో కనీ వినీ ఎరుగనంత పెద్దప్రేలుడు సంభవించింది.

'మౌంట్ విసాలిస్' అన్న అగ్నిపర్వతం పేలినప్పటి ప్రమాదం కన్నా యిది రెండు రెట్లు పెద్దది. ఎర్రమంటలు సముద్రం మధ్య లేచినయ్. ఆ ధ్వని కొన్ని వందలమైళ్ళ దూరంవరకూ వినిపించింది. ఆ రాత్రంతా, పొంగే లావాకీ, సముద్ర జలాలకీ మధ్య ఘర్షణ జరుగుతూనే వుంది.

ప్రేలుడు సంభవించగానే నీరు ఆవిరై మేఘంగా పైకి లేచింది. జలచరాలు చచ్చి తెప్పలా పైకి తేలాయి. ఆవిరైన నీరు మేఘంలా మైళ్ళదూరం వ్యాపించింది. ఆ ఆవిరి వేడి ఆస్ట్రేలియా వరకూ సోకింది. చచ్చిన జలచరాలు న్యూజిలాండ్ తీరం వరకూ కొట్టుకొచ్చేయి.

అన్నిటికంటే హృదయ విదారకమైన దృశ్యం ఏమిటంటే — ఆ అగ్ని పర్వతపు విస్ఫోటనానికి టహుటీ, హనలులూ, హవాయి సాలమన్ ద్వీపాల్లో వున్న ప్రజలు కనీసం



కెవ్వున కేక వేయటానికి కూడా సమయం చిక్కనంతటి వ్యవధిలో శలభాల్లా మాడిపోయేరు.

ఈ వార్త మరుసటిరోజు కార్చిచ్చులా ప్రపంచం అంతా వ్యాపించింది. ప్రజలు నిర్వీర్యులయ్యేరు. ప్రళయం అనివార్యం.

ప్రాక్సిమా సాంక్చువరీ భూమివైపు దూసుకువస్తూనే వుంది....

ఇంక పదిరోజులు....పదిరోజులే!

మరణం తప్పదని తెలిసిన మనిషి ఏం చేస్తాడు?

ఆగస్టు ఏడు: ఇల్లు:

రేడియోలో వార్తలు రావటం పూర్తయింది. ముఖ్యంగా చంద్రుడి గురించీ, పసిఫిక్‌లో జరిగిన ప్రళయం గురించీ విని—"ఇంతకీ దాన్ని ఆపటానికి మనవాళ్ళేం చేస్తున్నారో చెప్పరేం" అన్నాడు ముసలాయన — విసుగూ ఆత్రం నిండిన కంఠంతో.

"మన వాళ్ళేం చేస్తారు? అదేమన్నా రోగం అయితే మందు కనుక్కొంటారు. యుద్ధం అయితే శాంతి సంప్రదింపులు పెడ్తారు. కానీ వస్తూన్న బ్రహ్మాండమైన నక్షత్రాన్ని ఎలా ఆపగలరు? అసలా నక్షత్రం భూమికంటే కొన్ని వందలరెట్లు పెద్దదట...." అన్నాడు ప్రకాశరావు. అతడి మొహం భయంతో పాలిపోయి వుంది. నిద్రలేక కళ్ళు పీక్కుపోయాయి.

ఇంతలో లోపల్నుంచి జానకి వచ్చింది.

కట్టెలు మండి ఆమెకళ్ళు పొగకి ఎర్రగా వున్నాయి. మాసిన చీరె. అలసిన మొహం.

"పనిమనిషి రాలేదా?" ముసలాయన అడిగేడు. లేదని చెబ్తూ బైటికి వెళ్ళింది. "అసలే ఛస్తుంటే ఇదొకటి" ముసలాయన గొణుగుతున్నాడు. ఏదో ఒకటి మాట్లాడకపోతే నిశ్శబ్దం మరింత భయంకరంగా వుంది.

ఎప్పుడూ సైకిళ్ళతోనూ స్కూటర్ శబ్దాలతోనూ నిండివుండే రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

"ఓ సారి అష్టగ్రహ కూటమి అని, నీ చిన్నప్పుడు వచ్చింది" అన్నాడు ముసలాయన. ఇంతలో రమణ వచ్చేడు. చేతిలో సంచినిండా

సామాన్లు-బియ్యం.

"ఎందుకివ్వన్నీ—"

"ముందు ముందు దొరుకుతాయో లేదో" అన్నాడు రమణ.

ఎవరూ మాట్లాడలేదు.

పక్కిల్లు ఖాళీ చేస్తున్నారు పుట్టింటికి వెళ్ళటం కోసం. వీధిచివర ఎవరో వస్తున్నట్లు కనబడి, కళ్ళకి చేతులు అడ్డం పెట్టుకొని చూసింది జానకి. పనిమనిషి మంగి.

దాటుకొని వెళ్తుంటే ఆపింది.

"ఏమే; పనికి రాలేదు?"

"ఇంకా పనేటి అమ్మగారూ. పదిరోజుల్లో పెళయం వస్తూంటే—" అందది.

"అందుకని—రావా?"

"అప్పుడు చూసుకుందాం లెండి. బతికుంటే."

దాని మాటకి నవ్వొచ్చింది జానకికి. "ఇదిగో ఇది చూసేరా" అంటూ లోపలికి వెళ్ళింది ఇంట్లోవాళ్ళకి చెప్పటానికి.

అది అంత నవ్వుకోవలసిన విషయం కాదనీ—

పనిచేయటానికి పనిమనిషి తిరస్కరించడం మనిషి తన వ్యవస్థ కట్టుబాట్లని ఛేదించే మొదటి ప్రయత్నం అని జానకికి ఆ క్షణం తెలీదు.

పల్లె:

స్వామీ బుద్ధుధానంద బాబా నవ్వేరు.

"ఈ ప్రపంచాన్ని నేను రక్షిస్తాను" అన్నారు.

"...మొన్న భగవాన్ నా కలలో కనబడి, ప్రపంచం అంతం అవటం గురించి చెప్పేరు. 'అప్పుడే యెందుకు స్వామీ' అన్నాను. 'పాపాలు ఎక్కువైపోయేయి. కల్కి పుట్టే సమయం ఆసన్నమైంది' అన్నారు. ఆ కల్కి ఆకాశంలోంచి దిగుతాడట. నీళ్ళని శంఖంగా-చంద్రుడిని చక్రంగా ధరిస్తాడట. అందుకే ఆ రోజు సముద్రం పేలిపోయింది. స్వామివారి చక్రంగా మారటానికి చంద్రుడు వెళ్ళిపోయేడు. ఇక కల్కి రావడమే ఆలస్యం...."

భక్తులు భయంతో వణికిపోయేరు.

"ఎలా స్వామీ" అన్నది హైమవతి.

"నాకీ సంగతి అంతా సంవత్సరం క్రితమే తెల్సు. అయినా ప్రజలు భయపడ్తారని చెప్పలేదు" స్వామివారు నవ్వేరు. "నేను మిమ్మల్ని రక్షిస్తాను."

"శ్రీ బుద్ధుధానందస్వామి బాబాకీ—"

అరచింది హైమవతి భక్తిపారవశ్యంతో.

"జై" అన్నారు భక్తులు ముక్తకంఠంతో.

పల్లె పల్లె అంతా అక్కడుంది. కరణం, మున్సబు, రాజయ్య, రంగారావు, కరణంగారి కోడలు హైమవతి, తల్లి భాగీరథి—అందరూ.

బాబాగారు బూడిదని అందరికీ పంచుతూ అన్నారు. "నేనే భగవంతుణ్ణి. భగవత్ స్వరూపాన్ని. నేను మిమ్మల్ని రక్షించటానికే పుట్టేను. నిజంగా నన్ను నమ్మిన వాళ్ళని నేను రక్షిస్తాను. మీ చేతులకి తాయెత్తు కడతాను. ఇంకో నాలుగు రోజుల్లో నా నిజమైన భక్తుల చేతులకి తాయెత్తు కట్టబడుతుంది."

"ఇదంతా మోసం" అని బిగ్గరగా అరవాలన్న కోర్కెని బలవంతంమీద ఆపుకొన్నాడు డాక్టర్. ఆ వూరికి కొత్తగా వచ్చినవాడు.

అరిస్తే పల్లె మొత్తం యేకమై తనని హాస్పిటల్‌కి పంపిస్తుంది. అజ్ఞానం రాజ్యమేలుతున్న దేశంలో జ్ఞానం గురించి మాట్లాడటం కన్నా మౌనంగా వుండటమే మంచిది.

లేచి బైటికి వచ్చేడు.

"....స్వామి అయ్య సన్నిది — అదే మాకు పెన్నిధి" అని సినిమా స్టైల్లో పాడుతున్నారు భక్తులు.

డాక్టరు మౌనంగా సాగిపోతున్నాడు.

"ఎల్లిపోతున్నారే సామీ" వెనుక నుంచి రాజయ్య అరిచేడు.

"ఉండి చేసేది ఏముంది?" కోనేటి పక్క చీకట్లో కలిసిపోయేడు.

వర్షంపడి పదిరోజులైనట్టుంది.

నాలుగు నీటిచుక్కలు పడగానే లేచిన కుక్క గొడుగులు. (ఇంకా వుంది)




ఒప్పుకున్న తప్పు

ఎమ్.హరా

ఇంటికి వేసివున్న తాళాన్ని చూసి ఆశ్చర్య పోయాడు శంకరం. అంతలో యింటి వోనరు అతనికి తాళంచెవులు ఇస్తూ అన్నాడు. "ఇప్పుడే క్యాంపునుంచి వస్తున్నారా? మీ మిసెస్ బెజవాడ వెళ్లారు."

తలుపులు తెరిచి యింట్లోకి వెళ్తూ 'సుమ బెజవాడ యెందుకు వెళ్ళింది చెప్మా—' అని ఆలోచిస్తున్న శంకరం చూపులు టేబిల్ మీది ఉత్తరంపై బడ్డాయి.

అతని గుండె గుభేలుమంది. ఏదో కీడు శంకిస్తూ ఆ ఉత్తరాన్ని చదవసాగాడు. పునః పునః చదివాడు. అది సుమతి రాసిన ఉత్తరం.



"చలపతీ" అంటూ కోపంగా పిడికిళ్ళు బిగించాడు. "సుమా" అని మూగగా రోదిస్తూ పిచ్చిగా ఒకసారి జుత్తుని పీక్కున్నాడు. ఉన్మాదిలా ఆ గదిలో రెండుక్షణాలు తచ్చాడి కిటికీ లోంచి బయటికి చూడసాగాడు కింకర్తవ్య మూఢునిలా.

మామిడి చెట్టు కొమ్మమీది కాకి వుండి వుండి వికారంగా అరుస్తున్నది. మల్లె పందిరిని అందుకోవాలని మేకలు ఎగురుతున్నాయి. ముద్ద మందారాల పూలమొక్కల పాదుల్లో పందులు తమ ముట్టెలతో నేలని తొలుస్తున్నాయి. నీళ్ళు లేక గులాబీ మొక్కలు ఎండి పోతున్నాయి. తమ కింక రక్షణ లేదని పశువులకి బలైపోతున్నాయి మొక్కలు.

శంకరం అనాలోచితంగా ఆకాశంలోకి చూశాడు.

చండప్రచండంగా మండుతున్న సూర్యుడ్ని చూడలేక దృష్టిని మళ్ళించి వెనక్కి తిరిగాడు. కిటికీ తలుపులు మూసేశాడు. కాని తన గుండెల్లో మండుతున్న మంటని భరించలేక విల విల్లాడిపోతూ 'సుమా....సుమా, అని రోదిస్తూ సుమతి ఫోటోవంక చూస్తూ 'సుమా ....నన్నెందుకిలా అన్యాయం చేశావ్....నైతికంగా పతనం చెందిన దుర్మార్గుడ్ని కావచ్చును. కాని నువ్వు దేవతవి .... నువ్వు దేవతవి 'సుమా'.... ఎందుకింత దారుణంగా నీ దారిని నిర్ణయించుకున్నావ్........నీ ప్రమేయం యే మాత్రం లేని చిన్న తప్పుని పెద్దగా వూహించుకొని యెందు కింత పెద్ద శిక్ష విధించుకున్నావ్....?....'

* * *

"నువ్వు దేవతవి....అందుకే నే నెన్ని తప్పుడు పనులు చేసినా చిరునవ్వుతో సహిస్తావు....నీ వోర్పుని చూసి భూదేవి అసూయ పడుతున్నది."

"మీరు నన్ను మాటలతో బాగా మురిపిస్తారు:" అంటూ శంకరం బూట్లు పాలిష్ చేస్తూ ముంగురుల్ని సవరించుకుంటున్నది సుమతి.

"చేతలతో మురిపించాలంటే ఈ రోజు శనివారమంటావు. లేకపోతే ఏకాదశి అంటావు. తిధి వారనక్షత్రాలు చూసి నిన్ను మురిపించే ఓపిక నాకు లేదు....యిప్పుడు నాతో క్లబ్‌కి రా....నీ పూజలతో, వ్రతాలతో ఎప్పుడో చచ్చిన

తరువాత లభించబోయే స్వర్గాన్ని చిటికెలో చూపిస్తాను" అంటూ విలాసంగా సిగరెట్ వెలిగించాడు శంకరం.

"మళ్ళీ సిగరెట్ వెలిగిస్తున్నారా?"

"ఐ కాంట్ బ్రీత్ విత్ అవుట్ సిగరెట్. నేను సిగరెట్ లేకుండా గాలి పీల్చలేను" అంటూ గొంతుని వొత్తుకొంటున్న టైని సర్దుకున్నాడు.

"అవునవును....బ్రాంది గొంతులో పడితే గానీ మీకు మాట పెగలదు. సిగరెట్ లేకపోతే మీ శ్వాస ఆగిపోతుంది—" వ్యంగ్యంగా, నిష్ఠూరంగా అంటూ అతని కాళ్ళదగ్గర బూట్లు పెట్టింది.

"వెల్ సెడ్ మై డియర్....వైఫ్ అంటే యిలా వుండాలి. మీరు పేకాట ఆడితే నేను నెత్తిమీద కిరసనాయిల్ పోసుకొని అంటించుకుంటాను; మీరు బ్రాందీ తాగితే నేను ఎండ్రిన్ తాగుతాను; మీరు గరల్‌ఫ్రెండ్స్‌తో తిరిగితే నేను బావిలోపడి చస్తాను....అనే పాతకాలపు స్త్రీవి నీవు కాదు" అంటూ సాక్స్ వేసుకొని "అలా అని....నా భర్త శ్రీరాముడు కానప్పుడు నేను సీతగా యెందుకు వుండాలని బరితెగించిన యీ యుగసంధి స్త్రీవీ కాదు" అంటూ బూట్ల లేసులు బిగించసాగాడు శంకరం.

అతనికి కోటు అందిస్తూ "నేను ఆదికాలపు మనిషిని....పాత చింతకాయ పచ్చడిని—" అంటూ పేలవంగా నవ్వింది సుమతి.

"చాలా చక్కని వుపమానం చెప్పావు.... సుమా....ఆఁ....పాత చింతకాయ పచ్చడా? అయితే యెప్పుడో వొకప్పుడు నీ అవసరం నాకు వస్తుందంటావు....అంతేనా—" అంటూ అద్దంలో చూసుకుంటూ క్రాఫ్ దువ్వుకోసాగాడు.

"నా అవసరం మీకు రావలని నే నెప్పుడూ కోరుకోను. అటువంటి అదృష్టాన్ని నేను మనసా, వాచా వాంఛించను. మీరు ఆరోగ్యంగా, ఆనందంగా వుండాలని సదా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వుంటాను."

"నువ్వు వ్రతాలూ నోములు, పూజలు చేస్తున్నంతకాలం నాకేం ఫరవాలేదు....క్లబ్‌కి వేళ అయింది....వెళ్తున్నాను....ఈ రాత్రికి ఇంటికి రాను....టా....టా" అంటూ ముందుకు సాగాడు.


"వెళ్తున్నాను....అని అనకూడదు. వెళ్ళి వస్తా ననండి" అంది సుమతి నిర్జీవంగా అతని వంక చూస్తూ.

"ఓ....కే....వస్తాను—" అంటూ వెళ్ళిపోయాడు.

కనుమరుగై పోతున్న భర్తని చూస్తూ కన్నీళ్ళు తుడుచుకుంది సుమతి. తన భర్త యిక మారడు. తాను యెన్నో విధాల బ్రతిమాలింది. ఏడ్చింది. ప్రయోజనం శూన్యం. చచ్చిపోతానని బెదిరించింది. ఈ దేశంలో 'గుండెలమీద కుంపట్లు' చాలా వున్నాయి అంటూ తన బెదిరింపుని అతి సులభంగా కొట్టి పారేశాడు. అవును అతను చెప్పినది నిజమే. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. ఏదో బరువు దించుకోవాలనే ధోరణిలో ఆడపిల్లని ఒక జడపదార్థంలా, గుండెలమీద కుంపటిలా చూస్తారుగానీ ఆమెకీ వొక మనస్సూ, ప్రాణం, ఆశలు గట్రా వుంటాయని ఆలోచించరీ తల్లిదండ్రులు.

తన విషయంలో నాన్న ఎంత తొందర పడ్డారు. కాపురానికి వెళ్ళవలసిన పిల్లే గదాని, చదువుకుని ఉద్యోగాలు చేయాలా? వూళ్ళేలా అని 'చాకలిపద్దు' చదువు చెప్పించారు. అయిదు వేల కట్నంతో తనని శంకరానికి దానమిచ్చారు. తన పెళ్ళికి ముందే శంకరం గురించి చాలా చెడ్డగా విన్నారు నాన్న. వయస్సులో వున్న కుర్రాడు. మన మా వయస్సులో మడి కట్టుకుని వున్నామా? పెళ్ళి చేస్తే అన్నీ సర్దుకు పోతాయి—అంటూ పెళ్ళిపెద్దలు నాన్నకి సర్ది చెప్పారు. నాన్న వాళ్ళ మాటలకి లొంగిపోయారు.

నాన్నని అనుకుని ఏం లాభం? తనకీ భర్తని రాసిపెట్టేడు భగవంతుడు. అనుభవించాలి తప్పదు. అతని దృష్టిలో స్త్రీ ఒక ఆటవస్తువు. అందుకనే అతన్ని ఎక్కువకాలం తాను ఆకట్టుకోలేక పోయింది. అతని చెడు తిరుగుళ్ళని



అరికట్టలేక పోయింది. స్త్రీ పై భౌతికంగా వ్యామోహం పెంచుకున్నవాళ్ళకి భార్యపై ప్రేమ ఎంతకాల ముంటుంది? అందుకే తనని కాదన్నాడు. పాత చింతకాయ పచ్చడని తనని ఎద్దేవా చేశాడు.

తనకీ జీవితంలో ఒక అచ్చటా లేదు. ముచ్చటా లేదు. ఏదో వేళకింత వుడకేసుకోవడం తినడం నిద్రపోవడం. లేకపోతే పూజలు, వ్రతాలు నోములు అంటూ మనసుని మళ్ళించడం. చంపుకోవడం. అంతకన్నా తనేం చేయగలదు? తాను చదువుకోలేదు. ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి స్వతంత్రంగా బ్రతకలేదు. ఈ అయిదు వేల కట్నంతో నాన్న చదువు చెప్పిస్తే తాను హాయిగా ఉద్యోగం చేసుకునేది. స్వేచ్ఛగా గాలి పీల్చేది. అదృష్టముంటే పెళ్ళి చేసుకునేది. తానిప్పుడేం చేయగలదు? కాయకష్టం చేసుకుని బ్రతుకుదామనుకుంటే ఈ ప్రపంచం స్త్రీని వొంటరిగా బ్రతకనిస్తుందా? తన జీవితానికి భద్రత వుంటుందా? పుట్టింటివారు తనని పోషించే పరిస్థితిలో లేరు. యిక తాను ఎక్కడికి వెళ్తుంది. లభించిన జీవితంతో రాజీపడడం మినహాయించి తానేమీ చేయలేదు.

2

"క్లబ్‌కి వెళ్ళలేదని సంతోషిస్తే ఈ పేకాట భాగోతం యింట్లోనే మొదలెట్టేరా?" అంటూ గత రాత్రి జరిగిన సంఘటనల్ని తలచుకుంటూ ప్రశ్నించింది సుమతి.

"బెడ్‌రూం తలుపులన్నీ బిడాయించుకుని పడుకున్నావుగా .... నీకు నిద్రపట్టలేదా?" అన్నాడు వ్యంగ్యంగా శంకరం.

"ఏం నిద్ర పడుతుంది? మీ తాగుడు మాటలు వింటూంటే...." గతరాత్రి తాను విన్నమాటలు గుర్తుకురాగా అసహ్యంతో వొణికిపోయింది.

"అయితే రాత్రి నిద్రపోకుండా తలుపు చాటునుంచీ మా మాటలు వింటూనే వున్నావన్నమాట."

"నాకేం అంత కర్మ పట్టలేదు. అరచేతుల్తో గుండెని పట్టుకొని పడుకొన్నాను. నేను అసలు రాత్రి నిద్రపోలేదు. మీకు పుణ్యం వుంటుంది. దయచేసి మీ స్నేహితుల్ని మనింటికి ఆహ్వానించి పార్టీలు యివ్వకండి. నేను మిమ్మల్ని కోరుకునే వొకే వొక వరం యిది. ఈ ఇంటిని క్లబ్‌గా మార్చకండి. బయట మీ యిష్టం వచ్చి

నట్లు తిరగండి. నాకేం అభ్యంతరంలేదు. ఈ యింట్లో మాత్రం ఎటువంటి అల్లరి చేయవద్దు. నాకున్న కొద్దిపాటి మనశ్శాంతిని దూరం చేయవద్దండీ...." అంది రుద్ధకంఠంతో సుమతి.

"ఏం....ఏమయిందని యిప్పుడు? నాకు తెలుసు....నువ్వు నోర్మల్‌గా వుండలేవు. నువ్వొక గబ్బిలానివి. మొన్న రాత్రి చలపతి యింట్లో అరుణ....అదే చలపతి మిసెస్...." అతని మాటలకి అడ్డు వస్తూ "చలపతి ఇంట్లో జరిగిన శృంగార కలాపాల్ని వినే సిగ్గుమాలిన తనం భగవంతుని దయవలన నాకింకా అలవడలేదు" అంది ఉక్రోషంగా.

జుగుప్సాకరమైన అటువంటి సంఘటనలు గురించి ఎందుకింత గొప్పగా చెప్పుకుంటారో ఆమెకి పాలుపోవడం లేదు.

"నోర్మయ్....నేనేం సిగ్గుమాలిన పనులు చేయడంలేదు. తినడం .... తాగడం....అనుభవించడం....తప్పుడు పనులు కావు."

"ఆ పనులన్నీ నా కళ్ళముందు చేయవద్దని ప్రార్థిస్తున్నాను. నాకు మీరేమీ యివ్వనవసరం లేదు. గుప్పెడు మెతుకులు చాలు. నా భర్త మీరనే అండ చాలు....నాకింకేం అవసరం లేదు" అంటూ కన్నీరు తుడుచుకుంది సుమతి.

"ఇప్పుడు ఏమయిందని....ఆ కన్నీళ్ళు?" విసుక్కున్నాడు.

"మీ సరదాలీ యింట్లో కొనసాగిస్తే నా జీవితానికి భద్రత వుండదు...."

"నిన్న రాత్రి నువ్వు మంచినీళ్లు అందిస్తూంటే చలపతి నీ చెయ్యి తాకాడని భయపడుతున్నావా?"

సుమతి దిగ్భ్రాంతిచెందింది. ఆమె ముఖంపై రంగులు మారాయి. ఏ విషయాన్నైతే తాను చెబుదామనుకుంటున్నాదో అది అతనికితెలుసు. తెలిసినా అదే మంత పెద్ద విషయంలా భావించడం లేదు. తాను మంచినీళ్ళగ్లాసు టీపాయ్ మీద పెడుతూంటే పొంచివుండి మీదికి వురికిన పులిలా అతని చేతులు తన చేతిని కాటేసినాయి.

"అతని చెయ్యి తగలగానే నువ్వేమీ మైలపడిపోవు. దీనికింత కంగారుపడవలసిన పని లేదు. అతను తలచుకుంటే అప్సరసలు క్యూలో నిల్చుంటారు. నీలాంటి 'చింతమొద్దు' చెయ్యి లాగవలసిన కర్మ అతనికి లేదు. నిన్న క్లబ్‌కి శెలవు కాబట్టి మన యింటికి వచ్చాడు గానీ...." అని పైకి బింకంగా ఏదేదో అంటున్నా లోలోన భయపడుతున్నాడు శంకరం. ఉచ్ఛనీచాలు లేని వెధవ చలపతి. తన దగ్గరున్న డబ్బుకి దాసోహమని తనవెంట కుక్కలా తిరుగుతున్నాడు. వాడికి ప్రతీరోజూ 'బుడ్డి' పార్టీలు కావాలి. పైగా స్త్రీ దాహంకూడా హెచ్చే. వాడి అవసరాలకోసం రంభలాంటి భార్యని తార్చేస్తున్నాడు. తనకూడా స్వాధీన పరిచాడు. కొంపతీసి సుమతిపై కన్నువేయ లేదు గదా....ఆ అల్పుడు. అయినా సుమతి అటువంటి మనిషికాదు.


"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని సుమతి ప్రశ్నించేసరికి "ఆc....ఏంలేదు....ఏంలేదు.... చలపతికి మద్రాసు ట్రాన్స్‌ఫర్ అయింది.... అందుకే నిన్న పార్టీ యిచ్చాను....ఇంకెప్పుడూ మనింట్లో పార్టీలు ఇవ్వను" అన్నాడు శంకరం ఏదో ఆలోచిస్తూ.

3

పోస్టుమాన్ యిచ్చిన కవరు విప్పి చదివింది సుమతి.

సుమా డియర్,

చాలా రోజుల తరువాత. నేను క్షేమం. ఇరవై రోజులనుంచి నీకు ఉత్తరం రాయలనుకుంటూనే ఆలస్యం చేశాను. క్షమించు. నాకోసం బెంగ పెట్టుకున్నావా? నీ పూజలూ, వ్రతాలే నన్ను రక్షిస్తాయి. నిన్ను చూడాలని వుంది. సిగ్గుపడుతున్నావా? బాధపడు తున్నావా? ఈసారి నాలో వచ్చిన మార్పుని చూసి నువ్వే ఆశ్చర్యపోతావు. అపను వెంటనే రెక్కలు గట్టుకుని నీ ముందు వాలాలని వుంది. కానీ ఇక్కడ ఆఫీసు పని తెమలడంలేదు. కొంపు నుంచి ఇంకో పదిరోజుల్లో వస్తున్నాను.



నీ అవసరాలకి 'చెక్' పంపిస్తున్నాను. నీకు కష్టం కలిగిస్తే క్షంతవ్యుడ్ని. అంతకన్నా ప్రస్తుతానికి యింకేం రాయలేను.

ఆశీస్సులతో నీ ప్రాణం శంకరం.

ఆ వుత్తరం చదవగానే ఉక్కిరి బిక్కిరయింది సుమతి. ఆమెకి ఆనందం; దుఃఖం వొకేసారి వచ్చాయి. ఆమె కాపురానికి వచ్చాక భర్త దగ్గరనుంచి యింత అదరణ ఎప్పుడూ లభించలేదు. శంకరంలో కలిగిన మార్పుకి ఆమె ఆశ్చర్యపడుతున్నది. ఆ ఉత్తరాన్ని గుండెలకి హత్తుకుంది. 'నిన్ను చూడాలని వుంది' అనే వాక్యాన్ని పునః పునః చదివింది. అతనికి ఉత్తరం రాయాలని కొంపు ఎడ్రెస్ కోసం ఆ వుత్తరమంతా వెతికింది. ఆ వుత్తరంలో 'మద్రాస్' అని మినహాయించి యిక ఎటువంటి ఆధారం ఆమెకి దొరకలేదు. కాసేపు నిరుత్సాహపడి తిరిగి బలాన్ని పుంజుకుని మంచంమీద పడుకుని తిరిగి ఆ వుత్తరాన్ని చదవసాగింది.

అంతవరకూ అకాశంనుంచి నిప్పులు కురిపిస్తున్న సూర్యుడ్ని నల్లటి మేఘాలు కమ్మేసినాయి. వాతావరణం చల్లపడింది.

కిటికీ తలుపులు టపటప కొట్టుకుంటూంటే ఉలిక్కిపడి లేచింది సుమతి. చల్లటిగాలి ఆమె శరీరాన్ని తాకింది. చక్కిలిగింతలు పెట్టినట్లయింది ఆమెకి.

4

శంకరం వస్తూనే సుమతిని తన కౌగిట బంధించి "సుమా....నన్ను క్షమించు....నేను చేసిన తప్పుడు పనులని మన్నించు....యిక నేనెక్కడికీ వెళ్ళను....క్లబ్‌కి పోను....పేకాట ఆడను....తాగను....ఆఫీసు .... యిల్లు....నాకు వేరే లోకంలేదు....నిన్ను విడిచి నేనెక్కడికీ వెళ్ళను సుమా" అంటూ ఆవేశంగా ఆమెని చుంబించాడు.

"యిక ఎప్పుడూ నన్ను విడిచి వెళ్ళరుగా" అంటూ అశ్రుసిక్త నయనాలతో ప్రశ్నించింది సుమతి.

"నో....నో .... వెళ్ళను .... సుమా .... వెళ్ళను" అంటూ ఆమె పెదవుల్ని మృదువుగా స్పృశించాడు.

ం ం ం

....సుమా శిక్ష నీకుకాదు. నాకు....నాలాంటి పాపిష్టివాడు యిటువంటి శిక్ష అనుభవించవలసినదే అంటూ చేతుల్ని టేబులుమీద బలంగా కొట్టి సుమా....నువ్వు వెళ్ళిపోయావా? నాకు

దూరంగా వెళ్ళిపోయావా? నాకు అందనంత దూరం వెళ్ళిపోయావా అని ఉద్రేకంతో ఎగసి పడుతున్న గుండెల్ని అదుముకుంటూ వంకర టింకర అక్షరాలతో సుమతి రాసిన వుత్తరాన్ని చదువుకోసాగాడు శంకరం.

మహారాజశ్రీ....శ్రీ వారి పాద పద్మములకు నమస్కరించి వ్రాయునది.

యింతవరకు మీరు పాడిన పాటకీ ఆడిన ఆటకీ ఎంతమాత్రం నేను అడ్డు పెట్టలేదంటే అది నా గొప్పతనంకాదు. సహనం అంతకన్నా కాదు. అది నా చేతకానితనం. అసమర్థత. మిమ్మల్ని విడిచి ఎక్కడకీ వెళ్ళలేక, దారి తెన్నూ, తెలీక మీ యింటి పనిమనిషిలా గుప్పెడు మెతుకులకోసం మీ నీడలో కాలం వెళ్ళబుచ్చాను. నాకూ మనసు వుంది. కోరిక లున్నాయి. ఆశలున్నాయి. కాని తెగింపులేదు. అందుకే దొరికిన జీవితంతో రాజీపడ్డాను.

యిక అసలు విషయానికి వస్తున్నాను. పది రోజుల్లో వస్తున్నట్లు మద్రాస్‌నుంచి మీరు జాబు రాశారు. ఆ ఉత్తరాన్ని చదువుకుని మైమరిచి పోయాను. ఎండి మోడై పోయిన నా జీవితం మీ చల్లని ఉత్తరంతో వూపిరి పోసుకుని చిగురించింది. నా మనసులాగా బయట వాతావరణంకూడా చల్లబడింది. నా మేను పులకరించింది ఆ చల్లగాలికి. మీగురించి వెచ్చని వూహలు నాలో చోటుచేసుకున్నాయి. బయట జోరున వర్షం కురుస్తున్నది. నాలో ఉద్రేకం పెరుగుతున్నది. అంతవరకు నేను అదిమిపెట్టిన కోర్కెలు కిటికీ రెక్కల్లా టపటపా కొట్టుకుంటున్నాయి. నాకు వూపిరి సలపడం లేదు. ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలిలా నన్ను చుట్టబెట్టేశాడు చలపతి. అతను ఎప్పుడు వచ్చాడో తెలీదు. నేను అతని కౌగిలిలో పోరాడుతూనే వున్నాను. అతనిపై పిడుగులు కురిపించి మెరుపులా తప్పించుకుంటూనే వున్నాను. యింటివాళ్ళు లేరు. పెళ్ళికి వెళ్లారు. నా ఆర్తనాదం ఎవరికీ వినిపించకుండా జోరున వాన. నేను భోరున ఏడుస్తూనే వున్నాను కురుస్తున్న వానలా. అతనే గెలిచాడు.

వాన వెలిసింది. ఎండ వచ్చింది. నాపై అతను జరిపిన అత్యాచారం తలుచుకుని కుమిలి కుమిలి ఏడ్చాను. రోజులు గడుస్తున్నాయి. మీరు క్యాంపునుంచి వచ్చారు. మీ కౌగిలిలో సర్వస్వం మర్చిపోయాను. మీరు చెడు స్నేహాలకి స్వస్తి పలికారు. ఆఫీసు, యిల్లు, యిక వేరే లోకం లేదు. నాతో గుడికి వచ్చేవారు. మీతో సినిమాలు చూసేదాన్ని. నాకు జీవితంపై ఆశపుట్టింది. అందుకే చలపతి నాపై జరిపిన అత్యాచారాన్ని మీకు చెప్పలేదు, అనవసరంగా ఆపదలు కొని తెచ్చుకోవడ మెందుకుని జీవితంపై వుండే మమకారంతో మవునంగా వూరుకున్నాను.

అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే అది జీవితంకాదు. మీరు నాతో సినిమాలకీ గుళ్ళకి వచ్చినా మనం స్నేహితులుగానే వున్నాం. దానికి కారణం మీకు ఆరోగ్యం బాగులేదని మందులు వాడుతున్నట్లు నన్ను మభ్యపెట్టేరు. నా కడుపులో చలపతి పాపం పెరుగుతున్నదని తెలీగానే నేను భయపడ్డాను. ఇది నేను తెలిసి చేసిన తప్పుకాదు. నాకు జీవితంపై వ్యామోహం రోజురోజుకి పెరుగుతున్నది. ఈ నా తప్పుని వొప్పుగా చలామణి చేసుకునే స్థితిలో నేనున్నాను. నేను సంసారం చేసే స్త్రీని. యిప్పుడు యదార్థం చెప్పి అనేక అనర్థాలను కావాలను కొని తెచ్చుకోవడం అవివేకంగా భావించాను. నాకిప్పుడిప్పుడే మీ సహచర్యంలో కొత్తజీవితం లభించింది. ఏదో విధంగా జీవించాలనే తాపత్రయం, తెగింపు నాలో చోటు చేస్తుకున్నాయి. అందుకే అనేక కట్టుకధలు అల్లి మీకు చెప్పాను, మీరు మద్రాసునుంచి వచ్చిన రోజు రాత్రి వొళ్ళు తెలీని ఉద్రేకంతో నా దగ్గరకి వచ్చినట్లు మిమ్మల్ని నమ్మించాను. నా కడుపులో పెరుగుతున్నది మీ బిడ్డేని. మిమ్మల్ని వంచించాను. నా లాంటి వంచకురాలు ఈ భూప్రపంచంలో వుండదు. మీరు పొంగిపోయారు. నన్ను డాక్టర్‌కి చూపించారు. మందులు కొన్నారు.

నాలుగు రోజుల క్రితం మీరు ఆఫీసు పని మీద బొంబాయికి వెళ్ళారు. మళ్ళీ వచ్చాడు చలపతి. పట్టపగలు అందరూ చూస్తూ వుండగా వచ్చాడు. నా నోట మాటరాలేదు. వస్తూనే అర్జంటుగా నాలుగువేలు కావాలన్నాడు. నా కాపురం గుట్టుగా సాగాలంటే వెంటనే డబ్బు యివ్వమన్నాడు. అతని బెదిరింపులకి నేను లొంగలేదు. నువ్వు యదార్థం చెప్పినా మా ఆయన నమ్మరు అన్నాను.

వాడు విషపు నవ్వు నవ్వుతూ నేను మీకు చెప్పిన కట్టుకధని విప్పేసి అసలు కధ చెప్పేశాడు. చలపతి చెప్పిన కధ వింటూంటే నా చెవులు దిబ్బెళ్ళు పడినాయి. వొళ్ళంతా చెమటలు పట్టేయి. నోట మాట రాలేదు. నేను చేసిన తప్పుపని తెలిసకూడా పల్లెత్తి వొక మాటకూడా అనకుండా నన్ను క్షమించగల ఔదార్యం మీకు వుంది. కాని మీలాంటి ఉన్నతుని సానుభూతి స్వీకరించగల స్థితిలో నేను లేను. జీవితంపట్ల గల మక్కువ నన్నీ స్థితికి దిగజార్చింది. సంసారిని కదా నా తప్పు వొప్పుతుందనుకుంటే చలపతి నా కళ్ళు తెరిచాడు. నాకిప్పుడు మీ కళ్లలోకి చూసే ధైర్యం లేదు. ఎంత గుప్తంగా వుంచారీ విషయాన్ని. మీకు మద్రాస్‌లో ఏక్సిడెంట్ అయిందా? మేడ మీద నుంచి క్రిందికి పడ్డారా? నెలరోజులు అక్కడే ట్రీట్‌మెంట్ తీసుకున్నారా? మీరిక సంసారానికి పనికిరారనే చేదు నిజాన్ని నాకు చెప్పకుండా నా కట్టుకధలని ఎంత తియ్యగా నమ్మారు. రాయడానికి నాకు మాటలుకూడా రావడంలేదు. నిజంగా మీరు దేవుడులాంటివారు. మీ ముందు నిల్చునే అర్హత నాకు లేదు. నేను అల్పురాలిని. అందుకే నిష్క్రమిస్తున్నాను. ఈ ప్రపంచానికి దూరంగా పోతున్నాను. మీ మంచితనాన్ని భరించలేని నేను మీకు అందకుండా వెళ్తున్నాను. నా గురించి మీరు బాధపడవద్దు. నేను మీకిక కనబడను. ఈ జీవితాన్నుంచి తప్పుకుంటున్నాను. మీరు నా శవాన్ని చూడడానికి కూడా రావద్దు. నా వంటి పాపాత్మురాలికి వంచకురాలికి నిష్కృతి లేదు. దయచేసి ఇది నా ఆఖరి కోరిక కాదనకండి. నా శవాన్నికూడా చూడకండి. అప్పుడుకాని నా ఆత్మకి శాంతి లభించదు. ఎంత తీయనైనది జీవించాలనే కోరిక? యిక వుంటాను.

అనేక వేల నమస్కారాలతో మీ పాదదాసి

సుమతి.

ఉత్తరం చదవడం పూర్తిచేసి రుద్ధ కంఠంతో "సుమా....నన్ను నువ్వు అపార్థం చేసుకున్నావ్. చలపతి మళ్ళీ మన జీవితంలో ప్రవేశిస్తాడని నేను అనుకోలేదు. నేను తెలిసి చేసిన అనేక తప్పుడు పనులని నీవు సహించావు. నన్ను క్షమించావు. నీ ప్రమేయం ఏమాత్రం లేని, పరిస్థితుల ప్రాబల్యంవల్ల నీవు మోసపోయావు. ఆ విషయం నాకు తెలుసు. నీ కళ్ళల్లోని అమాయకత్వం, జీవితంపట్ల నీకున్న మక్కువ నన్ను ఆకర్షించింది. నీలో తప్పు పట్టగల గొప్పవాడిని నేనుకాదు. అయినా నేడు అటువంటి తప్పులు వొప్పులుగా చెల్లుబడి అవుతున్నాయి. కట్టుబాటులు, నీతి నియమాలు స్త్రీ, పురుషులకి వేరువేరుగా వుండకూడదు. నేను, తిరుగుబోతునని తెలిసికూడా మీ నాన్న నిన్ను నాకు కట్టబెట్టాడు. పురుషుడు నైతికంగా చెడిపోయినా ఫరవాలేదు. ఏమిటీ ద్వంద్వ నీతి. అందుకే నీ మాటల్ని నమ్మాను. నా భార్యగా నిన్ను గౌరవించాను ....ప్రేమించాను....కాని చలపతి మన సంసారంలో నిప్పులుపోశాడు.. అందుకు కారణం నేనే. నేను చేసిన పాపాలే నన్ను కాటువేశాయి....సుమా....సుమా...." అంటూ బయటికి పరిగెత్తాడు శంకరం.



అల్లావుద్దీన్ అభినవ దీపం

దాస్ బాబు

అల్లావుద్దీన్ రై (జై) లు ప్రయాణం

అల్లావుద్దీన్ ఆవులించి, కళ్ళు • నలుపుకుని అటూ యిటూ చూసేసరికి మజ్జు ఎక్కడా కనిపించలేదు. అరవై వోల్టుల బల్బును రుద్దే సరికి—ఓ మూలనుంచి గునగున పరుగెత్తుకుంటూ వచ్చి — గుడ్ మార్నింగ్ సార్— అన్నాడు. రాకాసి మిత్రం ఉరఫ్ మజ్జు ప్రదర్శించిన వినయం అల్లావుద్దీన్‌కు నచ్చింది. అంతేకాదు—పూర్వం రోజులుకూడా గుర్తొచ్చాయి. అప్పటి ఠీవిని వెలగబెడుతూ—

"చూడు రాకాసి మిత్రమా....ఉన్నపళంగా మనం వింత పావుకోళ్ళ మీద చెన్నపట్నం వెళ్ళాలి. ఏదీ....ఆంఫట్ అని ఓ అద్భుతం చెయి —"అన్నాడు....ఆజ్ఞాపూర్వకంగా.

మరుగుజ్జుగా మారిన రాకాసిమిత్రం ముఖమంతా చించుకుని—"టాట్. నేను రాకాసిలాగా కనిపిస్తున్నానా? మజ్జూ అని పిలవమని చెప్పలేదూ? పావుకోళ్ళు లేవు, అరకోళ్ళూ లెవ్వు. అరవై వోల్టుల బల్బుకి అద్భుతాలు జరగవు — ఇక మీ యిష్టం సార్—" అన్నాడు.

"అటులయినచో ధూమశకటయానము తప్పనిసరియా....ప్రథమ తరగతి యందు మనమిద్దరము ప్రయాణమునకు సిద్ధమగుదుము గాక—"

"సార్. ఈ లోకంలోకి రండి సార్. లోకులకర్థమయ్యే భాష మాట్లాడండి సార్. పెద్దబుక్కు తరుమాలా వుంది తమరి భాష. రైలుబండి అంటేనే అర్థమవుతుంది. ఇక ఫస్టు క్లాసు ప్రయాణమంటారా — పైసలు యిల్లియా. చివరి తరగతే గతి—"

"అంటే మూడో తరగతా?"


"నో. ఇప్పుడు మూడో తరగతి లేదు సార్. ఒకప్పుడు, తమరు గోలీలు ఆడుకునే దశలో యింటర్ క్లాసు అని ఒక [illegible] అంటే మొత్తం రైలుబండిలో నాలుగు తరగతులుండేవన్నమాట—ప్రైమరీ స్కూల్లాగా" మజ్జు చెప్పాడు.

"మరిప్పుడు అవన్నీ ఏమయ్యాయి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"సగం పొయ్యాయి...సగం మిగిలాయి."

"అంటే .... ప్రయాణం చేసేవాళ్ళు తగ్గిపొయ్యారా?"

"లేదు. ఎక్కువయ్యారు. కాని—టికెట్ కొనడం లేదు. వీళ్ళదంతా ఎఫ్.ఎస్. క్లాసు. అంటే ఫ్రీ సర్వీస్."



"మజ్జూ, మనం కూడా ఎఫెస్సు క్లాసులో మదరాసు పోదామా?" ముచ్చటపడ్డాడు.

"పోదాం పోదాం....ఏ ప్రాజెక్టుకో రాళ్ళు కొట్టడానికి! సార్ .... టికెట్ లేకుండా ప్రయాణంచేస్తే టీసీ పట్టుకుంటాడు. వెంటనే మనల్ని ప్రాజెక్టుకి బట్వాడా చేస్తాడు. లాభం లేదు."

"ఎట్లాగన్నా సరే — మదరాసుకు చేర్చు మజ్జూ!"

"ఎట్లాగంటే....ఎవడిజేబన్నా కొట్టాలి."

"కొట్టు మరి...."

"ఆహా....ఏలేం....బల్బు చేతిలో వుంది కదా అని నోరు నొవ్వకుండా చెప్పుతావు. జేబుకొడితే నా వీపు పగలగొడతారు — అదీ లాభం లేదు." చేతులు కట్టుకుని మోర పైకెత్తాడు. అల్లావుద్దీన్‌కి అసహనం పెరిగిపోయింది.

"అదేమన్నా సరే. అర్జంటుగా మదరాసు చేర్చు. ఇది నా ఆజ్ఞ" బల్బు నొక్కాడు.

"సరే సార్. రెండు సెకెండ్ క్లాస్ టికెట్లు కొనుక్కొని వస్తాను వుండండి" అంటూ మజ్జు పరుగెత్తాడు.

మజ్జు టికెట్లు కొనుక్కొని రావడం, ఇద్దరూ కలిసి రైలుస్టేషన్‌కు వెళ్ళడం అంతా అర్ధగంటలో జరిగిపోయింది. అక్కడ మరో అర్ధగంట గడిచిపోయింది.

"మదరాసు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ మరో అయిదు నిమిషాల్లో ఒకటో నంబరు ప్లాట్‌ఫారం మీదకు వస్తుంది—" రైల్వే మైకు లన్నీ వంతుల వారీగా మోగాయి. దాంతో అల్లావుద్దీన్ ముఖం విప్పారింది.

"మజ్జూ! అయిదు నిమిషాల్లో మనబండొస్తుందట!"

"అయితే మరేం పర్వాలేదుగాని—మనం నాస్తా చేసొద్దాం సార్—" మజ్జు క్యాంటీన్ వైపు మళ్ళాడు.

"అదేంటి మజ్జూ అయిదు నిమిషాల్లో బండొస్తుందంటే?"

"సరేలే వచ్చినప్పటి మాట కదా! ఇక్కడి టైమింగ్స్ నీకు తెలియవు కాబోలు. అయిదు నిమిషాలంటే అరగంట, ఇదుగ్గో వచ్చెబండి అంటే పావుగంట; కొద్దిక్షణాల్లో అంటే అయిదు నిమిషాలు.



"ఒకటో నంబరు ప్లాటుఫారం మీదకు బండి వచ్చియున్నది —" అన్న ప్రకటనే నిఖరమైన ప్రకటన. కనక కాస్త కాఫీ అన్నా తాగొద్దాం రండి సార్....ఈ రైళ్ళ మోతలకి తల దిమ్మెత్తిపోయింది." మజ్జా క్యాంటీన్‌కి దారి తీశాడు. అల్లావుద్దీన్ అతని వెనకాలే వెళ్ళాడు.

క్యాంటీన్ చుట్టూ ముసురుకున్నారు పాసెంజర్లు. కాళ్ళసందుల్లోనుంచి దూరి, బుడుంగున పైకి లేచి రెండు కాఫీ కప్పులు అందుకుని, అల్లావుద్దీన్ ముందు తేలి, అతని చేతికి ఓ కాఫీకప్పు అందించాడు. అల్లావుద్దీన్ నోట్లో పెట్టుకున్నాడో లేదో — ఛూత్ — అని వూస్తూ—

"ఇది కాఫీ? [illegible] తుంది—ఛూత్" అన్నాడు.

"అంటే .... [illegible] కూడలి కదా యిది....కాఫీలో [illegible] కలిపితే అంటువ్యాధులు రావు [illegible].." చాలా తాపీగా [illegible]

"ఎద్చినట్టే వుంది [illegible]. [illegible] ఈసారి టీ [illegible]—"

కాఫీ పారబోస్తూ, హుకుం జారీ చేశాడు. మజ్జా బుడుంగుమని, టీ కప్పుతో తేలి అల్లావుద్దీన్‌కి అందించాడు. అనుమానంగా, భయంగా టీని రుచి చూశాడు. మళ్ళీ "ఛూత్" అన్నాడు.

"ఇది టీయా దగ్గుమందా?"

"దగ్గుమందే. ఇక్కడ టొగ్గు పులుసు యెక్కువగా పీల్చేస్తారీ పాసెంజర్లూ....వాళ్ళ ఆరోగ్యం కోసమని దగ్గుమందు...."

"అయితే యిది రైల్వే స్టేషన్ కాదు— ఆస్పత్రి. ఇక్కడ కొచ్చేవాళ్ళ పాసెంజర్లు కాదు పేషెంట్లు...." అల్లావుద్దీన్ ఆవేశంగా అన్నాడు.

ఇంతలో మళ్ళీ మైకులు మోగాయి—

"మదరాసు వెళ్ళే బండి ఒకటో నంబరు ప్లాట్‌ఫారంమీదకు వచ్చియున్నది."

ఆ మాట విన్నాడో లేదో మజ్జా గునగున [illegible] పరుగెత్తాడు. టీ కప్పును [illegible] అతని వెనకాలే పరుగెత్తాడు. [illegible]

[illegible] దగ్గర [illegible]

త్వరలో ప్రారంభం!

ప్రఖ్యాత రచయిత్రి బీనాదేవి సీరియల్

భూమి గుండ్రంగా వుంది

జ్యోతిలో ధారావాహికంగా ప్రచురించబడుతూ, అనివార్య కారణాల వల్ల ఆగిపోయిన బీనాదేవి సీరియల్ నవల త్వరలోనే జ్యోతిలో మళ్ళీ ప్రారంభించబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

—ఎడిటర్.

ఢీకొన్నారు. తోపిడి అయితే వుంది కాని యెవరూ ఒక్క అంగుళం కదలడం లేదు. అది గమనించి మజ్జా కాళ్ళ సందుల్లో నుంచి దూరి వెళ్ళి ఒక సీటుమీద కూర్చుని కాలర్ యెగరేశాడు. అయిదు నిమిషాల్లో అంతా సర్దుకున్నాక అల్లావుద్దీన్ వచ్చాడు. వస్తూనే చినిగిపోయిన జేబు చూపించాడు. మజ్జా గట్టిగా నవ్వుతూ—

"రాంగ్ చాయిస్! యెవడో ఆశపడి నీ జేబును తడిమాడు! పర్వాలేదులే .... సర్దుకో. ప్రయాణంలో యివన్నీ మామూలే. రా, కూర్చో సార్, కష్టపడి సంపాదించాను కిటికీ పక్క సీటుని—" తను లేచి అల్లావుద్దీన్ని కూర్చోబెట్టాడు.


ఇంతలో బెకబెకమంటూ ఒక ఫామిలీ వచ్చింది. ఎనిమిది మంది వుంటారు. రెండు రేకుపెట్టెలు, డోలంత మూట, తాటాకులు బుట్టలు, కొబ్బరి బోండాలు, చద్దిమూటలు, కొబ్బరి చీపురుకట్టలు - మోసుకుని ఫుల్ లోడుమీద వచ్చారు. వస్తూనే గబగబా సగం సామాన్ని పైన సర్దారు—మిగతా సామాన్ని కింద కుక్కారు..ఎదుటివాళ్ళ కాళ్ళు విరుగుతాయన్న సోయి లేకుండా. డోలు మూటను నడవలో పారేసి అది మాది కాదు అన్నట్లు కూర్చోడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆ మూట - అటునుంచి, యిటునుంచి వచ్చే జన ప్రవాహానికి ఆనకట్టలా వుంది. అయినా హనుమంతుడిలా దానిమీదనుంచి దూకి వెళ్ళే వాళ్ళు వెళ్తూనే వున్నారు. ఆ ఫామిలీ యిన్చార్జి, సామాన్ని తప్పించుకుంటూ రెండు అంగలు వేసి అల్లావుద్దీన్ ముందుకొచ్చాడు. మజ్జు పక్కనే నిల్చొనివుంటే అతనికేసి ఒకసారి చూసి కిసుక్కుమని నవ్వి—

"మీరు యివతలకు జరగండి మా ఫామిలి కూర్చుంటది—" అన్నాడు అల్లావుద్దీన్తో. వెంటనే మజ్జా కలిపించుకుని—

"ఎవతల జరగాలి..అవతల స్థలం వుందా?" దీర్ఘం తీశాడు.

"మధ్యలో నీ కెందుకయ్యా, నే నేదో పెద్ద మనిషిని బతిమాలుకుంటే — జరగండి సార్ ఆడంగులు కూర్చుంటారు .... ఆడవాళ్ళని నిలబెట్టి మనం కూర్చుంటామా— రావే చిట్టీ— కూర్చో—" అన్నాడు.

అల్లావుద్దీన్ జరిగినా జరగకపోయినా ఆమె పూనికచేస్తూంటే అల్లావుద్దీన్ చటాలున లేచి నిలువబడ్డాడు. చిట్టిగారొచ్చి పైట సర్దుకుని



కూర్చున్నారు. మిగతా వాళ్ళంతా అంగుళం, అరంగుళం ఖాళీ యెక్కడ వుంటే అక్కడ కూర్చున్నారు.

తీరా బండి కదలక ముందు—ఇంజను కూత విని మరో పాతిక మంది బిలబిలామని తోసుకొచ్చారు. ప్లాటుఫారం దాటే వరకు యెక్కుతూనే వున్నారు. రెండు నిమిషాలు గడిచాయో లేదో ఓ సాయిబుగారు ఫామిలీ దగ్గర కొచ్చారు. వస్తూనే—

"ఏంది ఖాసల్లో కూకండావ్ .... వుటో మెమ్ సాయిబ్" అన్నాడు కోపంగా. ఆవిడ బిక్కమొకంవేసి ఇన్చార్జి కేసి చూసింది. అతను కలగించుకున్నాడు.

"ఏం దబాయిస్తున్నావ్ — నీ సీటని రాసుందా? యిప్పుడొచ్చి మాట్లాడుతున్నావేం దయ్యా?" మధ్యలో రెండు సార్లు ఫామిలీని చూసుకుంటూ గట్టిగానే అన్నాడు.

"ఏమ్ భాయ్ దేక్కె బాత్ కరో. రుమాలు పెట్టి ఛాయ్కి కిందికి పోయా. సమ్జా—పైనుం దొస్తున్నా. ముందు లే!" సాయిబుగారికి ఓపిక తగ్గిపోతోంది.

"ఈ రుమాల్ తమరిదేనా సాబ్? గాలికి యెగిరిపోతుందేమోనని చేత్తో పట్టుకున్నా. ఈ సీట్లోనే వుంది—" పావు కిలో మురికి పేరుకున్న రుమాలు తీసి ఆ సీటుమీద కాస్త స్థలం వుంటే అక్కడ వేశాడు. అదేదో నిప్పు కొరకాసులా కనిపించిందేమో గభాల్న లేచి నిల్చుంది ఫామిలీ. సాయిబుగారు చెప్పులు తడిగా వున్నా పట్టించుకోకుండా వాటిని తీసి సీటుమీద పెట్టి, రుమాలు వాటిమీద కప్పి, కాస్త వెనక్కి నెట్టి తను కూర్చున్నాడు.

బండి స్పీడు యెక్కువైంది.

"కాలక్షేపం బఠాణీలు. ఆఁ .... యింకా యెవరికండీ బఠాణీలు....బఠాణీలు" అంటూ పెద్దబుట్ట ఒకటి వేసుకొచ్చి రెండు నిమిషాలు అరిచి పక్కకు వెళ్ళాడు.

"గాంధీగారిపాకం ... గాంధీపాకం....గాంధీ పాకం...." వేరుశెనగ పాకాన్ని చూపెడుతూ మరొకడు వచ్చాడు. గాంధీ — ఈ పేరు యెక్కడో విన్నట్టుందే అంటూ అల్లావుద్దీన్ మజ్జు ముఖంలోకి చూశాడు.

"గాంధీగారు...ఈ జాతి పిత; మహాత్ముడు. వీళ్ళంతా మర్చిపోయారు. ఏదో — ప్రమాణాలు చేసేటప్పుడు మాత్రం ఆ పేరు విని

పిస్తుంది. అంతే! ఈ పాకంవాడు నయం కదూ....రోజుకు వెయ్యి సార్లన్నా గాంధీ, గాంధీ అంటాడు — సహస్రనామ సంకీర్తనంలా" మజ్జా వివరించాడు.

"జాతి పిత పరపతి పాకం వరకు వచ్చిందా!" అనుకున్నాడు అల్లావుద్దీన్.

"టికెట్ ప్లీజ్! మీ టికెట్లు చూపించండి" అన్న మాటలు అవతల పక్కనుంచి వినిపించాయి. అంతే! ఆ పెట్టె అంతా కాస్తా దడదడ లాడింది. అటువాళ్ళు యిటువాళ్ళు కాస్తా సర్దుకోవడం, తలుపు దగ్గరకు, బాత్‌రూం దగ్గరకు పరుగులెత్తడం మొదలయింది. రుమాలు సాయిబాబుగారు తపీమని లేచి, రుమాల్ని సీటుమీద వేసి—జర దేకో భాయి — అని మజ్జాకి ఆ బాధ్యత అప్పగించి మెల్లగా జారుకున్నాడు. ఫామిలీలో కూడా ముసలకం బయలుదేరింది.

"ఇదో—నడిపిదానికి తొమ్మిదేళ్ళు, చిన్నదానికి రెండున్నర అని చెప్పు. టికెట్లడిగితే పక్క డబ్బాలో మావారున్నారను. ఈ మాట పట్టించుకోకు. లగేజడుగుతాడు. ఏటి - వస్తా - సూళ్లూరుపేటలో కలుసుకుంటా" — యిన్‌చార్జి సాయిబు వెనకాలే బయలుదేరాడు. వాళ్ళతోబాటు మరో యిద్దరు నిష్క్రమించారు. అప్పటి దాకా ఆఫ్రికా అరణ్యంలా వున్న డబ్బాలోకి రవంత వెలుతురు, పిసరంత గాలి వచ్చాయి.

"ఏవిటి మజ్జా సూళ్లూరుపేట అని వెళ్ళిపోయాడు? ఏవిటి అంతా అటూ యిటూ కదుల్తున్నారు?" అమాయకంగా అడిగాడు అల్లావుద్దీన్.


"పూర్వం సూళ్ళూరుపేటలో పెద్ద డ్రామా కంపెనీ వుండేది. ఇప్పుడు నువ్వు చూస్తుందంతా డ్రామా; టికెట్ల భాగోతం. ఇండియన్ రైల్వే రెండో తరగతి పెట్టెలో యిలాంటి భాగోతాలు కోలెడు. చూస్తూ అర్థంచేసుకోవాల్సిందేగాని చెప్పుకోకూడదు ఈ భాగోతాల్ని." మజ్జా ముగించాడో లేదో బండి తకీమని ఆగింది.

"ఎవడో చెయిన్ లాగాడ్రా—" అన్నారెవరో. జనాన్ని తోసుకుంటూ యిటునుంచొక పోలీసు, అటునుంచొక పోలీసు దడేల్ దడేల్ మని పరుగులెత్తారు. కిటికీల్లోనుంచి తలకాయలు బయటపెట్టి చోద్యం చూస్తున్నారంతా. ఒక కిటికీలోనుంచి అల్లావుద్దీన్ తల, మజ్జా తల బయటకొచ్చాయి.

"ఏవిటి మజ్జా...సూళ్ళూరుపేట వచ్చిందా? యెందు కాగింది బండి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"సూళ్ళూరుపేటొస్తేనా బండి ఆగేది? యిదో భాగోతం—చెయిన్‌ల భాగోతం. ఎవడిల్లు యెక్కడ కనబడితే అక్కడే దేవుణ్ని తలుచుకోవడం చెయిను లాగడం—" మజ్జా చెప్పాడు.

"అదేవిటి తొందరగా వెళ్దామని కదా రైలు బండి ఎక్కాం. ఇట్లా చెయిను లాగి ఎక్కడ



పడితే అక్కడ బండి నాపుజేస్తే ఎలా?"— అల్లావుద్దీన్ ప్రశ్నించాడు.

"తొందరగా వూరు చేరాలంటే రైలుబండెక్కకూడదు. ఇంత చద్ది కట్టుకుని కాలినడకన బయలుదేరడం మేలు. ఏదో ఒక టైంకు వూరుకు వెళ్తావన్న నమ్మకముంటుంది!"

ఇంతలో ఎవరో దభేళ్ళున కిందకు దూకి పరుగు లంకించుకున్నాడు. వాడు వందగజాలు పరుగెత్తిం తర్వాత ఇద్దరు పోలీసులు కిందకు దూకి కాసేపు వాడివెనకాలే పరుగెత్తి, వెనక్కు మళ్ళారు.

"ఇదంతా ఏవిటి మజ్జా విచిత్రంగా వుంది. అతను అర్జంటుగా మద్రాస్ పరుగెత్తాడా?"

"ఆఁ చూశావా నీక్కూడా అర్థమయింది ట్రిక్కు! అంతే. అర్జంటుగా వూరు చేరాలంటే లగెత్తడమే!"

"మరి పోలీసులెందుకు దూకారు?"

"వాణ్ని పట్టుకోడానికి!"

"మరి అంత అలస్యంగా దూకారేం?"

"వాడితోబాటు దూకితే దొరికిపోడూ! ఇదో భాగోతం!"

"మజ్జా మన మిత్రులు—పెద్దాయన, సాహెబ్‌గారూ...." అంటూ అల్లావుద్దీన్ రుమాలు సాయిబుగారినీ, ఫామిలీ ఇన్‌చార్జిని చూపించాడు. వాళ్ళిద్దరూ పక్కపెట్టె తలుపును పట్టుక వేలాడుతున్నారు.

"ష్, మన మిత్రులు అని గట్టిగా అరవమాక....వాళ్ళ దగ్గర టికెట్లు సరిగ్గా లెవ్వు. మనల్ని పట్టుకెళ్తారు—" అన్నాడు మజ్జా.

"ఎక్కడికి" అల్లావుద్దీన్ అడిగాడు.

"ప్రాజెక్టు రాళ్ళ కాడికి! నువ్వూర్కో-సార్...."

పోలీసులు బండెక్కిం తర్వాత కూతపెట్టి సూడు తాంబేలులా కదిలింది బండి. ఆ ఇద్దరు తలలు లోపలకు లాక్కున్నారు. పెట్టెలుపెట్టే అటకమీద స్థలం కనిపిస్తే అల్లావుద్దీన్ని పైకెక్కించి—

"సార్....ఇక మీరు అడ్డే ప్రశ్న లడగకుండా చుమ్మ నిద్రపొండి. ఇది నేరుగా మదరాసు సెంట్రలు చేరిం తర్వాత లేద్దురుగాని—తూంగో సామి" అంటూ మజ్జా అల్లావుద్దీన్ని పడుకోబెట్టి తను ఒక సీటుపక్కన సర్దుకున్నాడు మదరాసు భాగోతాన్ని తలంచుకుంటూ. (ఇంకా వున్నాడు!)



సినిమా

మంచి సినిమా ఎంచి తీస్తే........!

తెలుగు ప్రేక్షక మహాశయుల హృదయం తెలుసుకోవడం అంత సులభం కాదు—వాళ్ళు సికందర్ కా ముకద్దార్ చూడగలరు, శివరంజనినీ చూడగలరు, సాటర్‌డే నైట్ ఫీవర్ నుంచి శంకరాభరణందాకా దేన్నయినా చూసి చప్పట్లు చరచగలరు. కన్నీళ్ళు పెట్టుకోగలరు. తారలు లేకపోయినా మరేమీ ఫరవా లేదు—ఉదయం ఆటలు మాత్రమేనా?—అయినా మునిగిపోయిందేమీ లేదు—'సీడ'ని వందరోజులు చూశారు. "మా భూమి" వంటి సంపూర్ణ వాస్తవికతాశైలి చిత్రాన్ని కూడా హౌస్‌ఫుల్ బోర్డులో పెట్టి మరీ చూస్తున్నారని ఆంధ్రదేశం నుంచి వార్తలొస్తున్నాయి. ఆంధ్రప్రేక్షక మహాశయా, నీ అభిరుచి పెద్ద జలాశయం—అందులో చిన్న చేపల్నీ పెరగ

'కలియుగ రావణాసురుడు'లో శారద, మురళీమోహన్



నిస్తావు, తిమింగలాల్ని తిరగనిస్తావు. ఒకటే భయం—మా బుల్లి చేపల 'సీడ'ల మీద తిమింగలాల పీడ పడకుండా కాపాడు. తెలుగు సినిమా స్వర్ణయుగానికి రోడ్డు రూపొందించవలసిన ఇంజనీరువి నువ్వే—!

నవతరం దర్శకుడుతో యువతరం కదిలింది!

నవయువ దర్శకుడు ధవళ సత్యం యువ నటుడు, అభ్యుదయభావుకుడు మాదల రంగారావు నిర్మిస్తున్న రంగుల, యువకావేశపు పొంగుల చిత్రం 'యువతరం కదిలింది'కి దర్శకత్వం నిర్వహిస్తున్నాడు. రికార్డింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేయడానికి వీలుగా రంగారావుగారు కార్యక్రమం రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది.

సీడ శతాధిక దినోత్సవం!

దాసరి నారాయణరావు దర్శకత్వంలో 'తెలుగుచిత్ర' నిర్మించిన కొత్త తరహా చిత్రం "సీడ" నూటపదిరోజుల పండుగ యిటీవల హోటల్ చోళాషెరాటన్‌లో ఘనంగా జరిగింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ప్రముఖ రచయిత తిరు (శ్రీ) కరుణానిధి నటీనటులకు, సాంకేతికకళాకారులకు మేమెంటోలు బహూకరించారు. అక్కినేని నాగేశ్వరరావుగారు, దాసరి నారాయణరావుగారి ప్రతిభా విశేషాలను ప్రశంసిస్తూ మాట్లాడారు. "సీడ" విజయం ఈ ధోరణిలో చిత్రాలు తీయాలనుకునేవారికి కొంత నైతిక శక్తినిస్తుందన్నారు కృష్ణ. నిజమే—బసూ ఛటర్జీ 'రజనీగంధ' ఉదయం ఆటలు ఆడి నిర్మాతలకి, షత్రంజ్ కే ఖిలారీ వంటి భారీ చిత్రాన్ని, సత్యజిత్ రే వంటి అంతర్జాతీయ స్థాయి దర్శకుడితో నిర్మించేంతటి బలాన్నిచ్చింది. తెలుగులో యిప్పు డొస్తున్న భారీ తారా చిత్రాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు "సీడ" ఉదయం ఆటలతో సాధించిన విజయానికి యెంతైనా ప్రాధాన్యత వుంది. 'తెలుగు చిత్ర'నీ, నారాయణరావుగారినీ ఉత్తమ చలన చిత్రాభిమానులు అభినందించి తీరాలి.

'సుజాత'లో సుజాత





"ఘరానా దొంగ"లో కృష్ణ, శ్రీదేవి

బాలల చిత్రాలకు ఒక ఆశా దీపం!

తెలుగులో పిల్లలకంటూ ప్రత్యేకంగా సినిమాలు తీసే అలవాటు లేదు. ఆ మాటకొస్తే ఇటువంటి సదాచారం ఈ దేశంలోనే అంతగా లేదు. తెలుగులో ఒకరిద్దరు నిర్మాతలు యిటీవలి కాలంలో బాలల చిత్రాలపట్ల ఆసక్తి చూపడం సంతోషించవలసిన విషయం. హైదరాబాద్‌కి చెందిన నిర్మాత రాజ్‌జీ కొత్త దర్శకుడు ఇ. పి. రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన "ఆశాదీపాలు" పిల్లలతో, పిల్లలకోసం పెద్దలచేత నిర్మించబడిన సినిమా. ఇటీవల సవేరా హోటల్లోని 'పల్లవి' థియేటర్‌లో "ఆశాదీపాలు" లోని పాటల్ని, కొన్ని ముఖ్యమైన సన్నివేశాల్ని పత్రికల వారికి చూపించారు నిర్మాతలు. దర్శకుడు కీలకమైన్న సన్నివేశాలను చిత్రీకరించిన తీరు ఆయన భవిష్యత్తు ఆశావహంగా వుండగలదనిపించింది. జయంతి, ప్రభాకరరెడ్డి, నూతన్ ప్రసాద్, సత్యేంద్రకుమార్, శోభ ప్రధాన పాత్రధారులు. మే నెలలో ప్రారంభం కానున్న "ఊరు నిద్ర లేచింది" అనే మరొక చిత్రానికి కూడా, ఇ. పి. రెడ్డి దర్శకత్వం వహించనున్నట్టు తెలిసింది.

మద్రాసులో 'మా భూమి' ప్రదర్శన

మార్చి 18 మధ్యాహ్నం మద్రాసు పాత్రికేయులు "మా భూమి" చిత్రం చూశారు. తరువాత పామ్‌గ్రోవ్ హోటల్లో జరిగిన ఒక సమావేశంలో దర్శకుడు గౌతమ్‌ఘోష్ పత్రికల వారితో యిష్టాగోష్ఠిగా మాట్లాడారు. చిత్ర నిర్మాణంలో తామెదుర్కొన్న అవాంతరాలను

గురించీ, సమస్యలని గురించీ శ్రీ ఘోష్ వివరించారు. నిర్మాతల్లో ఒకరైన బి. నరసింహారావు "మా భూమి" నిర్మించడానికి ప్రేరణ యేమిటో చెప్పారు. సమావేశంలో మహాకవి శ్రీశ్రీ, ప్రఖ్యాత రచయిత కొడవటిగంటి కుటుంబరావు కూడా పాల్గొని "మా భూమి"కి స్వాగతం చెప్పారు. చరిత్ర పేరుతో అభూత కల్పనలు చూడడానికి అలవాటుపడిపోయిన ప్రేక్షకులకి, యదార్థ చంద్రుని అత్యంత వాస్తవికంగా చిత్రీకరించి, భారతదేశ చరిత్రలో అత్యంత కీలక స్థానం వహించిన తెలంగాణా ప్రజల వీరోచిత పోరాట గాధని పునర్నిర్మించి చూపిన చైతన్యచిత్ర ఇంటర్నేషనల్‌వారిని ఈ ఇరువురు మహారచయితలూ అభినందించారు. "మా భూమి"లో ప్రధానపాత్రలు ధరించిన సాయిచంద్, కాకరాల కూడా సమావేశంలో పాల్గొన్నారు.

ఎం. ఎస్. రెడ్డి లీలలు

తెలుగు సినిమా నిర్మాతలలో విశిష్టమైన వ్యక్తిత్వం వున్న పెద్ద తలకాయ ఎం. ఎస్. రెడ్డి. ఆయన సంస్థ పతాకం పేరు కౌముది. అంటే వెన్నెల. వెన్నెల చల్లన. ఎం. ఎస్. రెడ్డిగారి ప్రవర్తన, మాట తీరూ మరీ చల్లన. కనుకనే ఆయన పరిశ్రమలో నిలదొక్కుకో గలిగారు. డబ్బింగు సినిమాలతో రంగ ప్రవేశం చేసి కృష్ణావతారం వంటి భారీచిత్రాలు నిర్మించిన ఎం. ఎస్. రెడ్డి "గుప్పెడు మనసు" చిత్రాన్ని తెలుగువారికి సమర్పించినా, "తాతయ్య ప్రేమలీలలు" పేరుతో, వినూత్న కథాసంవిధానంతో ఒక రంగుల చిత్రాన్ని నిర్మించినా అందులో ఆయన ప్రత్యేకత కనిపించి తీరుతుంది. నూతన్ ప్రసాద్, గీత, నిర్మల, బాలయ్య, చిరంజీవి, శోభ, కవిత వగైరా నటించగా, బి. వి. ప్రసాద్ దర్శకత్వం నిర్వహించిన రెడ్డిగారి తాతయ్యగారి ప్రేమ లీలల్ని త్వరలోనే తెలుగు దేశం చూడబోతోంది.

చుట్టా లొస్తున్నారు!


'ఈ చుట్టాల పీడ ఎలా వదులుతుందయ్యా' అని విసుగు పుట్టి సలహా అడిగితే, 'ఓపికుంటే వెళ్ళి దేశంలో వున్న రైలుపట్టా లన్నీ పీకి పారేయ'మన్నాట్ట వెనుకటికి ఒక పెద్ద మనిషి! అదీ మన చుట్టాల మహిమ. "తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు" నని చెప్పిన సుమతీ శతకకారుడు యిప్పుడు కనక బతికివస్తే చెరువు తెప్పలుగా నిండక పోయినా, బురదనీళ్ళయినా చాలు నను కొని చేరే కప్పల్ని చూసి తన కంద పద్యాన్ని తిరగ రాసుకుంటాడు. "చుట్టా లున్నారు జాగ్రత్త" పేరుతో తన అమృతా ఫిలింస్ పతాకంతో నట నిర్మాత బాలయ్య నిర్మిస్తున్న చిత్రం యితివృత్తం చుట్టా లనబడే రాక్షసి కప్పలే. కృష్ణ దిపాత్రాభినయం, రావుగోపాలరావు, బాలయ్య, నూతన్ ప్రసాద్, శ్రీదేవి, కవిత, జనాకర్షణగా వున్న ఈ చిత్రానికి కథకుడు బాలయ్య, మాటలు: డి. వి. నరస రాజు, సంగీతం: ఎం. ఎస్. విశ్వనాధం, కెమేరా: ఎస్. ఎస్. లాల్, దర్శకుడు: బి. వి ప్రసాద్.

సత్యం నిష్క్రమిస్తూ జైహింద్ అన్నాడు

జైహింద్ సత్యంగా, తెలుగు సినిమా రంగంలో మూడు దశాబ్దాలకి పైగా ప్రసిద్ధి చెంది, అందరూ తనని 'మనవాడు' అనుకోవాలనే ఆలోచనతో 'మన సత్యం'గా మారిన స్టిల్స్ సత్యం, తన స్టూడియోని తన దగ్గర యింత కాలమూ విశ్వాసంతో పని చేసిన అసిస్టెంట్స్‌కి సమర్పించి, రంగం నుంచి నిష్క్రమించారు. ఈ సందర్భంగా యిటీవల మద్రాసులో యేర్పాటు చేసిన ఒక సభలో పలువురు పెద్దలు పాల్గొని సత్యంగారి త్యాగబుద్ధిని ప్రశంసించారు. విశ్వాసంతో పని చేసినవారికి సర్టిఫికెట్లివ్వవచ్చు, నలుగురిలోకి పిలిచి దండలు వేయవచ్చు, ఊరేగింపవచ్చు, కానీ యిలా, తన కింతకాలమూ ఆర్జించిపెట్టిన ఉత్పత్తి సాధనాల వంటి యంత్ర పరికరాలను-కెమెరాలనూ, డార్క్‌రూమ్ ఎక్విప్‌మెంటూ, ఎన్‌లార్జర్సూ—వగైరా ధారపోసేవారు చాలా తక్కువగా వుంటారు. 'సత్యం'గారి వితరణ శీలం యితరుల్లో కూడా ఆలోచన కలిగిస్తే యెంత బావుంటుంది!!

—దేవీదాసు

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆ ధా రా లు

మే '80

అడ్డం

1. తెనాలిరాముని ఆఖరితిట్టు
3. జరిగి
5. రేడియోవార్తలు
7. మాజీ గవర్నరు
9. పొగడ్త
10. రామదాసు
11. ప్రహేళిక-పెట్టవచ్చు
13. గంటి ద్రవ్య విశేషం
15. కలదు! లేదు! (కలవేలేవు)
16. 29
17. 24. చూ
18. మేరలుంటాయి ఊళ్ళకి
20. లేకుంటే ఆరోగ్యం
22. పై
23. శృంగారవతి
25. ఇదంటే దున్నపోతుకి లక్ష్యంలేదు
27. స్త్రీలకు ఇటువంటి చీరలిష్టం
29. మన ఆస్థానకవి
31. ఉన్నచెట్ల కేరాళ్ల (తలక్రిందులు)
32. మద్దెల కన్న నయం

నిలువు

1. మునసబు పాట్లు
2. అన్నిటికన్నా ప్రాచీనం ఈ వృత్తి
3. రావిశాస్త్రి కథా వస్తువు
4. తలక్రిందులు తపస్వి
5. కొరడా
6. 23 నిలువు నవ్వు
7. 12 నెలలు
8. 12 గంటలు
11. అగ్ని శేషం
14. ప్రజ్వరిల్లి
15. ప్రమదవ్వర్థుడు (తలక్రిందులు)
18. నికుంజాలు
19. బహువచనంలో తాంబూలం
21. కాల్బలం
22. రకారంతో మృగశిర
23. చూ. 6
24. 17 పేల్తుంది జాగ్రత్త
26. పద
28. మేదరి సృష్టి
30. ఇంకో

ఏప్రిల్ పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం : 1. నిగ 3. గోన 5. ఆవేదన 7. విముఖత 9. నది 10. యావత్తు 12. తతి 13. తగు 15. పంతం 16. దిట్ట 17. క్రెడిట్ 18. కాయ 20. జీవి 22. కేకి 23. తనలో 25. రుతి 27. బజాగోడు 28. లోనిగుట్టు 31. వల 32. బుడు

నిలువు: 1. నివేదిత 2. గద 3. గోము. 4. నఖక్షతం 5. ఆన 6. నయా 7. విత్తు 8. తతి 11. వక్ర 14. గుదియ 15. పండిట్ జీ 18. కాకిబావ 19. కాన 21. విరుగుడు 22. కేలు 23. తగు 24. లోలో 26. తిట్టు 28. గోల 30. విలు

నిబంధనలు గమనించండి :

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి ఏప్రిల్ 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

ఏప్రిల్ ప్రహేళిక విజేతలు:

1. వి. రంగాచార్యులు, అదిలాబాద్. 2. జి. పుల్లప్ప, చాగలమర్రి. 3. వి. విజయభాస్కర రెడ్డి, కనాల. 4. కె. ముత్యాలు, ఏలూరు. 5. కె. జె. ఎం. కృష్ణారావు, ఏలూరు. 6. టి. సుధాదేవి, హైదరాబాద్. 7. బి. నాగార్జునసింగ్, కావలి. 8. ఇ. వసుంధర, కాకినాడ. 9. ఎమ్. సూర్యనారాయణమూర్తి, నర్సాపూర్. 10. భట్టారం ఉదయిని, నెల్లూరు. 11. బి. పద్మావతి, మద్రాసు. 12. బి. సీతారామిరెడ్డి, నగరం. 13. ఇ. వి. ఎల్. ప్రసూన, పెద్దవాల్తేరు. 14. బి. ఆర్. కృష్ణమూర్తి, టెక్కలి. 15. పి. వి. కృష్ణయ్య, వాల్తేరు. 16. ఎమ్. ఎల్. ఎన్. ఆచార్యులు, విశాఖపట్నం. 17. పి. జె. సుధారాణి, వరంగల్. 18. పి. నాగేశ్వరరావు, పేటండ్ల. 19. డి. ఉమ & రమ, మిర్యాలగూడ.

Edited&Publisher by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024 & Printed by D. Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras 600001.


శ్రీ వెంకటేశ్వరం మూవీక్రియేషన్స్
ఆటగాడు
జి.రాజేం సాద్ దర్శకత్వం: తాతినేని రామారావు
లక్ష్మీచిత్ర
శ్రీలక్ష్మీచిత్ర
నవభారత్